ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org
బుధవారం 14.08.2024 | సంపుటి : 11 సంచిక : 35 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## మరోసారి వాయిదా

**వినేశ్ ఫొగాట్ పిటిషన్‌పై తీర్పును 16కు పొడగించిన 'కాస్'**

**పారిస్(జనంసాక్షి):** పారిస్ ఒలింపిక్స్‌లో తనపై అనర్హ త వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వేసిన పిటిషన్‌పై తీర్పు మరోసారి వాయిదా పడింది. ఈ వ్యవహారంపై తీర్పును కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (కాస్) ఈ నెల 16కు వాయిదా వేసింది. ఇప్పటికే వాదనలు విన్న కాస్.. శుక్రవారం తీర్పు వెల్లడించాలని నిర్ణయించింది. వినేశ్ వ్యవహారంపై కాస్ తీర్పు వాయిదా పడటం ఇది మూడోసారి.

మిగతా 2లో..

తుంగభద్రపై తాత్కాలిక గేటు ఏర్పాటుకు

## కసరత్తు

- ఈప్రక్రియ ఇంజనీరింగ్ సాహసం
- నిపుణుల వెల్లడి



2లో

# కారం మెతుకులపై రేవంత్ సర్కారు కన్నెర్ర

## మెనూ మెక్కిన 'పందికొక్కులపై' ఏసీబీ అస్త్రం

- స్వీట్లు, అరటిపండ్లు, కోడిగుడ్లు కూడా స్వాహా
- రాష్ట్రవ్యాప్తంగా అవినీతి నిరోదక శాఖ దాడులు
- నాసిరకం పదార్థాలతో వంటకాలు చేస్తున్నట్టు నిర్ధారణ
- టాయిలెట్లు సరిగ్గాలేక చాలాచోట్ల విద్యార్థుల అవస్థలు

**పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం కేటాయిస్తున్న నిధులను 'పందికొక్కుల్లా' బుక్కేస్తున్నవారిపై రేవంత్ సర్కార్ ఏసీబీ అస్త్రాన్ని ప్రయోగించింది. నాసిరకం భోజనం పెడుతూ పిల్లల ఆరోగ్యాలతో చెలగాటమాడు తున్నవారి భరతం పట్టేందుకు నడుం బిగించింది. చాలాచోట్ల కాలం చెల్లిన ఆహార పదార్థాలతో వంటకాలు చేపడుతూ రేపటి భావిపౌరులకు కారం మెతుకులను వడ్డించడంపై కన్నెర్రజేసింది. ఇటీవల కాలంలో పలు గురుకులాల్లో విద్యార్థులు మృతిచెందడం, అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టడం అధికారులు, వార్డెన్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. అత్యధిక హాస్టళ్లలో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలతో వండుతున్నట్టు తనిఖీల్లో బయటపడటం గమనార్హం.**





వేమనపల్లి ప్రభుత్వ హాస్టల్‌లో తనిఖీలు చేపడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి బృందం

హైదరాబాద్/కరీంనగర్/మెదక్/ఖమ్మం (జనంసాక్షి) విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చూపడం, రికార్డుల్లో అవక తవకలు చేయడం సహా తెలంగాణలోని ప్రభుత్వ హాస్టళ్ల లో పలు అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) స్పందించింది. మంగళ వారం ఉదయం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ హాస్టళ్లలో తనిఖీలు చేపట్టింది. తెల్లవారుజామునే హాస్టళ్ల కు చేరుకుని విద్యార్థుల సంఖ్య, వారికి అందుతున్న సౌకర్యాలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరీక్షిం చారు. విద్యార్థులతో మాట్లాడుతూ అక్కడున్న సౌకర్యా లపై ఆరా తీశారు. బీసీ, ఎస్సీ,

మిగతా 2లో..



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం భట్టి

## నేలపై వద్దు.. మంచం ఉండాలి

- పెద్దాపూర్‌లో విద్యార్థుల మృతి దిగ్ర్భాంతికి గురిచేసింది
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు తక్షణమే రూ. 50 లక్షలు మంజూరు
- విద్యార్థుల డైట్ చార్జీల పెంపునకు కమిటీ వేస్తాం
- మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకొకరోజు గురుకులాల సందర్శన : భట్టి

జగిత్యాల బ్యూరో/రాయికల్ (జనంసాక్షి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలను ప్రక్షాళన చేసి ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రతగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన నిధులను సమకూర్చుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. నెలలో ఒక రోజున రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు శాసనసభ్యులు గురుకుల

మిగతా 2లో..

## తెలంగాణ డీఎస్సీ ప్రిలిమినరీ కీ విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రాథమిక కీ విడుదలైంది. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, సెకెండరీ గ్రేడ్ టీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించి వేర్వేరుగా కీ, రెస్పాన్స్‌షీట్లను పాఠశాల విద్యాశాఖ అధికారులు తమ అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు కీపై అభ్యంతరాలను ఆగస్టు 20వరకు తెలపవచ్చని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జులై 18 నుంచి ఆగస్టు 5వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు 2,45,263 మంది హాజరయ్యారు.

ఐరాసలో భారత శాశ్వత సభ్యత్వం వ్యవహారం..

## మళ్లీ పాక్, చైనా మోకాలడ్డు

**న్యూయార్క్(జనంసాక్షి):** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను పరిష్కరించాలంటే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు అవసరమని భారత్ పునరుద్ఘాటించింది. ఈసందర్భంగా న్యూఢిల్లీకి శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. భద్రతా మండలిని విస్తరించాలని, అందులో ఆఫ్రికా, ఆసి యా-పసిఫిక్ దేశాలకు సభ్యత్వం కల్పించాలని సూచించింది. అయితే, దీన్ని చైనా , పాకిస్థాన్‌లు వ్యతిరేకించాయి. అంతర్జాతీయ శాంతిభద్రతల నిర్వహణ అంశంపై ఐరాస భద్రతా

మిగతా 2లో..



## పేర్లు మార్చి.. ఖర్చుపెంచేశారు

**ప్రాజెక్టుల కోసం రూ.1.81 లక్షల కోట్లు వెచ్చించినా ఫలితం నామమాత్రమే**

**నీటిపారుదల శాఖను గాడిలో పెడుతున్నాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలో నీటిపారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి.. నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చిందని విమర్శించారు. కమిషన్ల కోసం ప్రాజెక్టులకు పేర్లు మార్చి రీడిజైన్ చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు 3 పంపులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2026 ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.7,436 కోట్లు ఖర్చు చేసిన అప్పటి ప్రభుత్వం ఒక్క ఎకరాకీ నీళ్లు ఇవ్వలేదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా.. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ పెండింగ్

మిగతా 2లో..

మరో వివాదంలో..

## నేను పక్కా లోకల్..

- కేసులకు భయపడను
- నాపై కేసును సీఎం దృష్టికి తీసుకెళ్తా
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం



**హైదరాబాద్(జనంసాక్షి):** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ ఘట న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రంగనాథ్‌కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు. అందు కే తనపై కేసు పెట్టారని దానం తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు.. కానీ తాను మాత్రం లోకల్ అని పేర్కొన్నారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని వార్నింగ్ ఇచ్చారు. అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. హైడ్రా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ గురుబ్రహ్మ నగర్‌లో పేదల గుడిసెలు కూల్చి వేసే అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పార్క్ స్థలం అని చెప్పి ఈవీడీఎం వాళ్లు పెద్ద ప్రహరీ గోడ కడుతున్నారని.. బస్తీ వాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారు? అని ప్రశ్నించారు. గోడ కట్టొద్దన్నందుకే ఈవీడీఎం

మిగతా 2లో..

డాక్టర్‌పై హత్యాచార కేసు

## సీబీఐకి

**కోల్‌కతా హైకోర్టు ఆదేశం**

**కోల్‌కతా(జనంసాక్షి):** కోల్‌కతాలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా డాక్టర్లు నిరసన తెలుపుతున్నారు. ఈ సమయంలో కలకత్తా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది.కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలని పోలీసులను ఆదేశించింది. కేసుకు సంబంధించిన అన్ని దస్త్రాలను బుధవారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందజేయాలని పేర్కొంది. సెమినార్ హాల్‌లో జూనియర్ వైద్యురాలిపై

మిగతా 2లో..



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు ఇస్తే

## ఇళ్ల మంజూరుకు కేంద్రం సిద్ధం

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ**



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో సొంతిళ్లు అవసరం ఉన్న పేదల జాబితాను కేంద్రానికి అందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించనున్న సర్వేలో పాల్గొనాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని


మిగతా 2లో..

ఎన్నాన్లో వేచిన ఉదయం

## మన ఉద్యోగులు మన రాష్ట్రానికే..

**తెలంగాణ ఉద్యోగులు రిలీవ్ ..**
**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు**

**అమరావతి(జనంసాక్షి):** తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం మంగళ వారం ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో కేటాయించిన 122 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులను స్వరాష్ట్రానికి పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.తెలంగా ణ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన ఏపీ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రిలీవ్ అయ్యే వారు తమ కేడర్ చివరి ర్యాంక్‌లోనే విధుల్లో చేరతారని వెల్లడించింది.



## అలుముకుంటున్న యుద్ధమేఘాలు

**ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఏ క్షణాన్నైనా దాడి చేసే అవకాశం ● వైట్‌హౌస్ హెచ్చరిక**

**వాషింగ్టన్(జనంసాక్షి):** హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో ఇజ్రాయెల్-ఇరాన్ ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితులు ఎప్పుడైనా యుద్ధంగా మారొచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి.రానున్న రోజుల్లో ఇరాన్ లేక దానికి మద్దతిస్తున్న సంస్థలు ఇజ్రాయెల్‌పై దాడి చేసే అవకాశం గణనీయంగా పెరుగుతోందని వైట్‌హౌస్ హెచ్చరించింది. ఈ వారంలోనే దాడి జరగొచ్చని అప్రమత్తం చేసింది. నిఘా వర్గాల సమాచారాన్ని ఉటంకిస్తూ వైట్‌హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ ఆమేరకు ప్రకటించారు. మరోవైపు ఈ ప్రతీకార దాడుల్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ పూర్తి సంసిద్ధతతో ఉందని తెలుస్తోంది.టెహ్రాన్‌లో హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా హత్యానంతరం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిన సంగతి తెలిసిందే. హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో తమ అత్యంత సీనియర్ మిలిటరీ

మిగతా 2లో..





**వీర్యం, అండం దానమిస్తే బిడ్డపై**

## హక్కులుండవు

**బాంబే హైకోర్టు సంచలన తీర్పు**

**ముంబై(జనంసాక్షి):**వీర్యదాతకు, అదేవిధంగా అండం ఇచ్చిన మహిళకూ పుట్టిన బిడ్డపై చట్టపరమైన హక్కు ఉండదని బాంబే హైకోర్టు వెల్లడించింది. పిల్లలకు వారు జీవసంబంధ తల్లిదండ్రులుగా చెప్పడం కుదరదని స్పష్టం చేసింది.తన కవల కుమార్తెలను చూసేందుకు ఓ మహిళకు అనుమతిస్తూ ఈ తీర్పు చెప్పింది.తన కవల పిల్లలు సరోగసీ ద్వారా జన్మించారని, వారు తన భర్త, సోదరితో ఉంటున్నారంటూ ఓ మహిళ కోర్టులో పిటిషన్ వేశారు. తన సోదరే అండం దానం చేసిందని, కానీ తన భర్త మాత్రం అండం దానం చేసిన మరదలికే పిల్లలపై చట్టపరమైన హక్కు ఉంటుందని వాదిస్తున్నారని పేర్కొంది. ఆ వాదనను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్ సోదరిని జీవసంబంధ తల్లిగా చెప్పే హక్కు ఉండదని స్పష్టం చేసింది.పిటిషనర్ సోదరి చేసిన అండ దానంతో సరోగసీ ద్వారా

మిగతా 2లో..

**అదానీ-సెబీ వ్యవహారం దేశంలోనే**

## అతిపెద్ద కుంభకోణం

**హిండెన్‌బర్గ్ ఆరోపణలతో బాగోతం బట్టబయలు**

**22న దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం వేడెక్కుతోంది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబి చీఫ్ మాధబి పూరి బచ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22న దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాల వద్ద నిరసలకు దిగాలని నిర్ణయిం చింది. అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారం నాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయ కత్వంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్ చార్జులు, పీసీసీ అధ్యక్షులతో మంగళవారం సమావేశం జరిగింది. అదానీ-సెబీకి సంబంధం ఉన్న హిండెన్‌బర్గ్ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవడంపై



మిగతా 2లో..

## కేజ్రీవాల్, కవితల జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

వార్త 2లో

# గురుకుల విద్యార్థినికి అండగా సీఎం రేవంత్ రెడ్డి

### ప్రభుత్వ ఖర్చుతో నిమ్స్ లో వైద్యం

### కోలుకుంటున్న విద్యార్థిని కార్తీక

**హైదరాబాద్(జనంసాక్షి):** గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలైన విద్యార్థిని కొయ్యడ కార్తీక కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందించాలని ఆయన సీఎం కార్యాలయ అధికారులను ఆదేశించారు. సీఎం సూచన మేరకు హైదరాబాద్ లోని నిమ్స్ లో కార్తీక కు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం కార్తీక కోలుకుంటోంది. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక ఈ నెల 9న ప్రమాదవశాత్తు స్కూల్ మూడో అంతస్తు నుంచి పడిపోయింది. దీంతో విద్యార్థిని నడుము భాగంలో తీవ్రగాయాలయ్యాయి. గురుకుల అధికారులు కార్తీకను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి కి ,అక్కడి నుంచి నిమ్స్ కు తరలించారు. నిమ్స్ న్యూరో సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం నాడు కార్తీక కు ఆపరేషన్ నిర్వహించింది.. ప్రస్తుతం ఐసీయులో విద్యార్థిని కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్తీక కు కావాల్సిన వైద్యం ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించనున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తో మాట్లాడి కార్తీక కోలుకునేంత వరకు వైద్యం అందించాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా కార్తీక ఆరోగ్య పరిస్థితిపైన ఎప్పటికప్పుడు నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు.

## అదానీ-సెబీ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణం

ప్రధానంగా చర్చించాం' అని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ కుంభకోణంలో మోదీ ప్రమేయంపై ఆరోపణలు గుప్పి?స్తూ, ప్రధానంగా తాము రెండు అంశాలపై దేశవ్యాప్త ఆందోళనలకు నిర్ణయించామని చెప్పారు. ప్రధాన మంత్రి పూర్తి ప్రమేయం ఉన్న అదానీ మెగా స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## వీర్యం, అండం దానమిస్తే బిడ్డపై హక్కులుండవు

2019లో కవలలు జన్మించారు. అదే సమయంలో పిటిషనర్ సోదరి కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. దాంతో ఆమె కుమార్తె, భర్త మృతి చెందారు. 2019 నుంచి 2021 మార్చి వరకు ఇద్దరు పిల్లలతో కలిసి పిటిషనర్, ఆమె భర్త కలిసే ఉన్నారు. ఆ తరువాత వైవాహిక బంధంలో విభేదాల కారణంగా 2021లో భార్యకు చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి భర్త వేరే ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ రోడ్డు ప్రమాదంతో కుంగుబాటుకు గురైన తన మరదలు.. పిల్లల బాగోగులను చూసుకునేందుకు తనతోనే ఉంటుందని పిటిషనర్ భర్త చెప్పడంతో పిటీషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా, స్థానిక కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తన అభ్యర్థనను తిరస్కరించడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

## కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

దిల్లీ(జనంసాక్షి): మద్యం విధానం కేసులో అరెస్టయిన దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని దిల్లీ కోర్టు పొడిగించింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉంటున్న ఈ నేతలిద్దరి కస్టడీని సెప్టెంబర్ 2వరకు పొడిగించింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో వీరిని దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

## మళ్లీ పాక్, చైనా మోకాలడ్డు

మండలిలో ఉన్నతస్థాయి చర్చ జరిగింది. ఇందులో జీ4 (భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ) దేశాల తరపున భారత ప్రతినిధి ఆర్.రవీంద్ర కీలక ప్రసంగం చేశారు. "ఐరాస భద్రతా మండలి (జబొఅ)ని 15 నుంచి 25-26కు పెంచాలి. మరో ఆరు శాశ్వత సభ్య దేశాలు, నాలుగు లేదా ఐదు తాత్కాలిక సభ్య దేశాలను మండలిలో చేర్చాలి. శాశ్వత సభ్యులుగా కొత్తగా చేర్చే ఆరింటిలో రెండు ఆఫ్రికా దేశాలు, మరో రెండు ఆసియా-పసిఫిక్ దేశాలు ఉండాలి. లాటిన్ అమెరికా/కరేబియా నుంచి ఒకటి.. పశ్చిమ యూరోపియన్ ప్రాంతం నుంచి ఒక దేశానికి శాశ్వత ప్రాతినిధ్యం కల్పించాలి. కొత్తగా చేర్చే శాశ్వత సభ్యులకు కూడా వీటో లాంటి అధికారాలు కల్పించాలి" అని రవీంద్ర సూచనలు చేశారు."ఐరాస భద్రతా మండలి చర్చల అజెండాలో 70శాతం ఆఫ్రికా దేశాల కోసమే ఉంటాయి. కానీ, మండలిలో దానికి శాశ్వత గళం వినిపించే అవకాశం లేకపోవడం విచారకరం. జీ20 లాంటి గ్రూప్‌ల్లోనూ ఆఫ్రికా యూనియన్‌కు పూర్తి సభ్యత్వం కల్పించాం. కానీ, ఐరాసలో ప్రాతినిధ్యం లేదు" అని ఆయన గుర్తుచేశారు. మండలికి సంస్కరణలు చేయకపోతే ఈ అంతర్జాతీయ సంస్థ ఉద్దేశాలు సఫలీకృతం కాబోవని అన్నారు.అయితే, భారత్ వ్యాఖ్యలతో పాక్, చైనా విభేదించాయి. "ఆఫ్రికాను ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. మండలిలో దానికి దీర్ఘకాల సభ్యత్వం ఇవ్వాలి. అయితే, అందుకోసం భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాల సంఖ్యను పెంచాల్సిన అవసరం లేదు" అంటూ ఐరాసకు పాక్ శాశ్వత ప్రతినిధి మునీర్ అక్రమ్ అక్కసు వెళ్లగక్కారు. అటు చైనా ప్రతినిధి ఫు కాంగ్ మాట్లాడుతూ.. "కొన్ని దేశాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మండలి విస్తరణ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి" అంటూ న్యూదిల్లీపై పరోక్షంగా నోరుపారేసుకున్నారు.

# కారం మెతుకులపై రేవంత్ సర్కార్ కన్నెర్ర





మైనార్టీ వసతి గృహాల్లో నూ తనిఖీలు కొనసాగాయి. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాలు, వివిధ సదుపాయాలకు హాస్టల్ నిర్వాహకులు గండికొడుతున్నారని, తప్పుడు బిల్లులతో కాజేస్తున్నారనే ఆరోపణలతో ఈ సోదాలు చేపట్టినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహంలో తనిఖీలు చేయగా అక్కడి దుస్థితి బయటపడింది. ఏసీబీతో సహా ఆహార భద్రత, శానిటరీ, ఆడిట్ అధికారులు వసతి గృహంలో తనిఖీలు చేపట్టగా.. విద్యార్థులకు అందించే ఆహారం అపరిశుభ్ర వాతావరణంలో వండుతున్నారని, వంట సరుకులు సైతం వండే పరిస్థితిల్లో లేవవి నాసిరకంగా ఉన్నాయని ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ వెల్లడించారు. మెనూ ప్రకారం భోజనం వండటం లేదని, విద్యార్థులకు అందాల్సిన స్వీట్లు, అరటి పండు, కోడి గుడ్లు కూడా అందించడంలేదని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. హాస్టల్ పరిసర ప్రాంతమంతా శుభ్రంగా లేదని, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా చాలారోజులుగా శుభ్రపరచుకుండా ఉంచినట్లు వివరించారు. రిజిస్టర్‌లో 120 మంది విద్యార్థులు ఉన్నట్లుగా నమోదు చేసినా వాస్తవంగా అక్కడ 80 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఉదయం 6 గంటల తర్వాత తనిఖీలు జరిగిన సమయంలో వార్డెన్ కూడా అందుబాటులో లేరని, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ అధికారులను పిలిపించి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

**వసతులు, హాజరుపై ఆరా..**

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాంధీనగర్ ఐటీడీఏ పరిధిలోని గురుకుల పాఠశాలలో ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ఈ గురుకులాల్లో 680 విద్యార్థులు ఉండగా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఏసీబీ డీఎస్పీ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల విద్యుత్ తీగల ప్రమాదకరంగా ఉన్నాయని, విద్యార్థులు ఉంటున్న గదుల బాత్రూంలకు తలుపులు కూడా సరిగా లేవని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ప్రభుత్వ వసతి గృహాల్లోనూ ఏసీబీ అధికారులు తెల్లవారుజాము నుంచి ఏకకాలంగా సోదాలు నిర్వహించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలతో పాటు వసతి గృహాలలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. తనిఖీల్లో దాదాపు ప్రతి హాస్టల్‌లోనూ కాలం చెల్లిన ఆహార పదార్థాలు వినియోగిస్తునట్లు అధికారులు గుర్తించారు. వసతిగృహాల్లోని బాత్రూంలు కూడా చాలా అధ్వానంగా ఉన్నాయని, ఫుడ మెనూ పాటించడం లేదని వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహంలో తనిఖీలు చేపట్టగా.. వసతులు అంతంత మాత్రంగానే అందుతున్నట్టు గుర్తించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గురుకులాలు, హాస్టళ్లలో సోదాలు చేసి మెస్, స్టూడెంట్స్ రిజిస్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. పలు హాస్టల్ స్టూడెంట్స్ రిజిస్టర్‌లలో ఎక్కువమంది విద్యార్థులు ఉన్నట్టు వార్డెన్‌లు నమోదు చేశారు. ఎక్కువ మంది ఉన్నట్టు చూపి అధిక మెస్ బిల్లులు తీసుకుంటున్నట్టు చేస్తున్నట్టు గుర్తించారు. కొంతమంది హాస్టల్ సిబ్బందిని అదుపులోకి తిసుకుని విచారించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎస్పీ ఉదయ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకులలో దాడులు చేపట్టారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు ఇస్తే ఇళ్ల మంజూరుకు కేంద్రం సిద్ధం

పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. కనీసం 10 కోట్ల మందికి లబ్ధిని చేకూర్చాలని ఈ నెల 9న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ పథకం ఫలాలను ఆయా కుటుంబాలకు అందించి వారి సొంతింటి కలను సాకారం చేయడంలో సంపూర్ణ సహకారం అందిస్తారని కోరుకుంటున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు.ఈ మేరకు కేంద్రమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి ప్రధామంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ పథకం ఫలాల విషయంలో లేఖ రాసారు. గ్రామీణ భారతదేశంలోని ప్రతి ఒక్కరు సొంతింటి కలను సాకారం చేయడానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకాన్ని 2016 లో ప్రారంభించిందని తెలిపారు. పథకం ప్రారంభ సమయంలో గ్రామీణ భారతదేశంలోని సొంతిల్లు లేని పేద కుటుంబాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మార్చి 2024 నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుందని వివరించారు.మొదటి విడత గడువు ముగిసిన ఈ పథకాన్ని కొనసాగిస్తూ రెండవ విడతలో భాగంగా ఏప్రిల్ 2024 నుండి మార్చి 2029 మధ్య కాలంలో మరో 2 కోట్ల పక్కా ఇళ్లను సొంతిల్లు అవసరమున్న గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించిందన్నారు.

## నేలపై వద్దు.. మంచం, బెడ్ ఉండాలి

పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో భోజనం చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగునంగా జిల్లా కలెక్టర్లు, డిఎంహెచ్వోలు సైతం నెలలో ఒక రోజున గురుకుల పాఠశాలలో బస చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంగళవారం డిప్యూటీ సీఎం సందర్శించారు. ఇద్దరు విద్యార్థుల మృతి నలుగురు విద్యార్థుల అస్వస్థతకు సంబంధించిన కారణాల గురించి విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నడూలేనివిధంగా ఈ బడ్జెట్ లో ప్రజా ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయించిందన్నారు. పక్క భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం 2015 -16 ఆర్థిక సంవత్సరంలో 197 కోట్ల కేటాయించగా 2016 17 ఆర్థిక సంవత్సరం నాటికి 116 కోట్ల రూపాయలకు కుదించిందన్నారు. 2018- 19 సంవత్సరంలో రూ. 79 కోట్లు, 2019-20 వార్షిక సంవత్సరంలో 70 కోట్లు, 2020-21 వార్షిక సంవత్సరంలో కేవలం 11 కోట్లు, 2021-22 వార్షిక సంవత్సరంలో 9 కోట్లు, 2022-23 వార్షిక సంవత్సరంలో ఏడు కోట్లు, 2023 24 వార్షిక సంవత్సరానికి మూడు కోట్లు మాత్రమే కేటాయిం చిందని వివరించారు. ఇలాంటి తరుణంలో పెద్దాపూర్‌లో ఇద్దరు విద్యార్థులను కోల్పోవడం ప్రజా ప్రభుత్వాన్ని తీవ్రంగా కలిచిసి వేసిందని బాధపడ్డారు. ఇక్కడ నీటి కుంటలు, చెత్తాచెదారం లేకుండా అభివృద్ధి చేయడానికి, టాయిలెట్స్ నిర్మాణం కో సం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వం తరపున రూ. 50 లక్షలు మంజూరు చేశామ న్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డార్మీటరీ, డైనింగ్ హాల్స్, భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించిన వెంటనే ఒక్కరోజు ఆలస్యం చేయకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. బాధిత తల్లిదండ్రులకు ఎక్స్‌గ్రేషియాతో పాటు గురుకుల సొసైటీలో వారి విద్యా అర్హతకు అనుగుణంగా ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఇల్లు లేకుంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలను ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు.

**విద్యార్థుల డైట్ చార్జీల పెంపునకు కమిటీ వేస్తాం**

పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడానికి త్వరలోనే అధికారులతో కమిటీ వేస్తామని ప్రకటించారు. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత డైట్ చార్జీలను పెంచుతామని వెల్లడించారు. గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి నేలపైన పడుకోవడానికి వీలులేదని కచ్చితంగా మంచం, బెడ్, బెడ్ షీట్‌ను ప్రభుత్వ సమకూర్చుతుందని ఇందుకోసం ప్రతిపాదనలు పంపితే నిధులు విడుదల చేస్తామని గురుకులాల సెక్రటరీ రమణ కుమార్ ఆదేశించారు. ప్రతి గురుకులంలో అత్యవసర ఔషధాలు, పారా మెడికల్ స్టాఫ్, కుక్కకాటు, పాము కాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గురుకులాల సెక్రెటరీని ఆదేశించారు. టాయిలెట్స్, బాత్రూమ్స్ విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈజీఎస్ పనుల కింద గురుకుల పాఠశాలలో చెత్తా, చెదారం పిచ్చి మొక్కలు తొలగించి, పండ్లు, ఔషధ మొక్కలు నాటించాలని చెప్పారు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## అలుముకుంటున్న యుద్ధమేఘాలు

కమాండర్ ఫాద్ షుక్ర్ మృతి చెందారని హెజ్‌బొల్లా వెల్లడించింది. హనియా హత్య ఇరాన్ గడ్డపై జరిగింది. దాంతో ఇరాన్, హమాస్, హెజ్‌బొల్లా.. ఇజ్రాయెల్‌పై విరుచుకుపడేందుకు సిద్ధంగా ఉన్నాయన్న అంచనాలతో పశ్చిమాసియా నివురుగప్పిన నిప్పులా ఉంది.ఈ తరుణంలో అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ నేతలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. కాస్త ఓర్పు వహించాలని ఇరాన్‌ను కోరాయి. ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ప్రయత్నాలకు మద్దతు ఇస్తూ ఆ ప్రకటన చేశాయి. సైనికపరమైన ఉద్రిక్తతలను నియంత్రించాలంటూ బ్రిటన్ ప్రధాని, జర్మనీ ఛాన్సలర్.. ఇరాన్ కొత్త అధ్యక్షుడిని సంప్రదించాయి. మరోవైపు ఈజిప్టు, ఖతర్ మధ్యవర్తిత్వంతో జరుగుతోన్న కాల్పుల విరమణ చర్చలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఇరాన్ దాడి చేస్తే.. ఆ చర్చలు ఆలస్యం కావొచ్చని వైట్‌హౌస్ ప్రతినిధి అభిప్రాయపడ్డారు.ఇక, హెజ్‌బొల్లా స్థావరాలున్న లెబనాన్‌పై ఎయిర్ పెట్రోలింగ్ చేస్తున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. అలాగే ముప్పుగా భావిస్తోన్న లక్ష్యాలపై దాడులు చేస్తోంది. పరిస్థితుల తీవ్రతను గుర్తించిన అమెరికా పశ్చిమాసియాకు అణు జలాంతర్గామిని పంపుతున్నట్లు ప్రకటించింది.

# పేర్లు మార్చి ఖర్చు పెంచేశారు

ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నాం. భారాస నేతలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. వై.ఎస్.ఆర్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టు చేపట్టారు. కానీ, భారాస హయాంలో కమిషన్ల కక్కుర్తి కోసం ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే కారణంతో రీడిజైన్ చేశారు. ప్రాజెక్టుల పేర్లు మార్చి, ఖర్చు నాలుగింతలు చేశారని ఉత్తమ్ మండిపడ్డారు. కాంగ్రెస్ చేపట్టిన రాజీవ్, ఇందిరా ఎత్తిపోతలకు సుంకిశాలగా పేరు మార్చి రీ డిజైన్ చేశారని చెప్పారు. రాజీవ్, ఇందిరా ప్రాజెక్టులతో 2 వేల కోట్లతో 6 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవన్నారు. 19 వేల కోట్లతో సీతారామ నిర్మించారని....కమిషన్ల కక్కుర్తితో సీతారామ ఎస్టిమేషన్ ను పెంచారని ఆరోపించారు ఉత్తమ్. బీఆర్ఎస్ హయాంలో సీతారామ కాల్వలకు భూసేకరణ కూడా చేయలేదన్నారు ఉత్తమ్. సీడబ్ల్యూసీ పర్మిషన్ తామే తెచ్చామని కేటీఆర్ చెబుతున్నాడు..కానీ.. ఈ రోజు వరకు సీడబ్ల్యూసీ పర్మిషన్ పూర్తి స్థాయిలో రాలేదన్నారు. బీఆర్ఎస్ వి అన్నీ అబద్దపు ప్రచారాలేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామన్నారు. సీతారామ మోటర్లు బిగించింది తామేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులకు లక్షా 81 వేలు ఖర్చు చేశారని చెప్పారు ఉత్తమ్. బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ ను ఆగం చేశారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టే పనిలో ఉన్నామన్నారు. కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంలో లక్ష కోట్లు ఖర్చు చేసినా ఎకరాకు నీళ్లియ్యలేదన్నారు. పదేళ్లు తూతూ మంత్రంగా పని చేశారని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేదన్నారు. తాము పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉత్తమ్ చెప్పారు.

# నేను పక్కా లోకల్

అధికారులు తనపై కేసు పెట్టారని దానం తెలిపారు. హైదరాబాద్‌ను హైడ్రా అధికారులకేమీ రాసివ్వలేదని.. ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తనపై 190 కేసులు ఉన్నాయని.. కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు.

**రంగంలోకి 'హైడ్రా'**

గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిర క్షణకు, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా హైదరాబాద్ డిజాస్టర్, రెస్పాన్స్ అండ్ అసెట్స్ కు అవసరమైన ఆఫీసర్లు, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. 259 మంది ఆఫీసర్లు,సిబ్బందిని కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒక్క ఐపీఎస్, ముగ్గురు గ్రూప్ 1 స్థాయి ఎస్పీలు,5 మంది డిప్యూటీ స్థాయి సూపరింటెండెంట్లు, 21 మంది ఇన్స్పెక్టర్లు,33 మంది సబ్ ఇన్ స్పెక్టర్లు,5 మంది రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు,12 మంది రిజర్వ్ ఎస్ఐలు, 101 మంది కానిస్టేబుల్స్,72 మంది హోంగార్డ్స్,6 మంది అనలిటికల్ ఆఫీసర్లను కేటాయిస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. 3500 మంది అవసరమని హైడ్రా కమిషనర్ ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హైడ్రాకు ఛైర్మన్ గా సీఎం రేవంత్ రెడ్డి, కమిషనర్‌గా రంగనాథ్ ఉన్నారు. 2,500 చదరపు కిలో మీటర్ల పరిధి ఉన్న హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటవుతుందని రంగనాథ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.. ఈ పోలీస్ స్టేషన్ ద్వారానే ఎస్వోటీ ఏర్పాటు చేసి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడ్తామన్నారు. హైడ్రాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉందని చెప్పారు. పార్క్ స్థలాలను కాపాడే కాలనీ సంఘాలకు మద్దతిస్తామన్నారు. హైడ్రాకు మొత్తం 3,500 మంది సిబ్బంది అవసరమని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. హైడ్రా కింద అసెట్ ప్రొటెక్షన్‌తోపాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కూడా కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో 72 టీమ్స్?ను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఇదిలావుంటే గ్రేటర్‌లో ఆపరేషన్ హైడ్రా కొనసాగుతోంది. మంగళవారం నాడు జీహెచ్ఎంసీలో చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉప్పల్ నల్లచెరువులో కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. చెరువు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించ నున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం కమిషనర్ రంగనాథ్‌ను కలసి ఉప్పల్ నల్ల చెరువులో జరుగుతున్న కబ్జాల గురించి వివరించిన విషయం తెలిసిందే. దీంతో రంగనాథ్ మంగళవారం ఉప్పల్లోని ఎమ్మెల్సీ తీన్ మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువును పరిశీలించారు. నల్ల చెరువులో కబ్జాలను, ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు చెరువు పరిరక్షణ కోసం హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. చెరువులను, నాలాలను, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

## మరోసారి వాయిదా

ఈ తీర్పు భారత్‌కు అనుకూలంగా వస్తే వినేశ్‌కు రజత పతకం ఇవ్వాల్సి ఉంటుంది. ఒలింపిక్స్ 50 కేజీల విభాగంలో అదిరే విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన వినేశ్.. 100 గ్రాముల బరువు ఎక్కువ ఉన్న కారణంగా స్వర్ణ పోరులో తలపడేందుకు అనర్హురాలిగా ప్రకటించడం యావత్ క్రీడా ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిన విషయం తెలిసిందే.ఈ కేసులో వినేశ్ తరఫున వాదించిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులలో ఒకరైన విదుష్పత్ సింఘానియా మీడియాతో మాట్లాడారు. "ఇది మాకు చాలా కష్టమైన పని. ఎందుకంటే మా అభిప్రాయాలను సిద్ధం చేయడానికి, వాటిని కాస్ ముందుంచడానికి మాకు చాలా తక్కువ సమయం దొరికింది. కానీ, మేము కష్టపడి పనిచేసి వినేశ్ కోసం పోరాడటానికి సన్నద్ధమయ్యాం. సాధారణంగా కాస్ 24 గంటల్లో తీర్పు ఇస్తుంది. ఈసారి వారు తీర్పు గడువును ఒకటి కంటే ఎక్కువసార్లు పొడిగించారు. నిర్ణయం భారత్‌కు అనుకూలంగా వస్తుందని మేమందరం ఆశిస్తున్నాం. తీర్పు ఇచ్చే అడ్‌హక్ ప్యానెల్ 24 గంటల కాలపరిమితిని కలిగిఉంది. దీన్నిబట్టి ఈ అంశం గురించి ప్యానెల్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు అర్థమవుతోంది. న్యాయమూర్తి మహిళ అయితే మాకు మరింత మంచిది. గతంలో నేను చాలా కేసులు వాదించాను. ఇక్కడ సక్సెస్ రేటు చాలా తక్కువ. వినేశ్ ఫొగాట్ విషయంలో చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలని న్యాయమూర్తిని కోరుతున్నాం. ఇది కొంచెం కష్టమే అయినా ఏదైనా అద్భుతం జరగాలని ఆశిద్దాం. వినేశ్‌కు పతకం దక్కాలని అందరూ ప్రార్థించండి. ఒకవేళ మెడల్ రాకపోయినా ఆమె ఛాంపియనే" అని విదుష్పత్ సింఘానియా పేర్కొన్నారు.తీర్పు వెలువడనున్న నేపథ్యంలో వినేశ్ ఇంకా స్వదేశానికి బయలుదేరలేదు.

# డాక్టర్‌పై హత్యాచార కేసు సీబీఐకి

అత్యంత పాశవిక దాడి జరుగుతుంటే ఆసుపత్రిలో ఉన్నవారికి ఆ విషయం తెలియకపోవడం, యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.ఈ కేసులో నిందితుడికి పోలీసులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సాక్ష్యాలు తారుమారు చేయకుండా ఉండేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని బాధితురాలి తల్లిదండ్రులు కోరినట్లుగా న్యాయస్థానం పేర్కొంది. గతంలో జరిగిన ఓ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు ఆధారంగా న్యాయపరమైన దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా డాక్టర్లు చేపడుతున్న నిరసనలపై స్పందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత వైద్యులపై ఉన్నందున.. ఆందోళనలను విరమించాలని సూచించింది.కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌పై కోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించి, సెలవుపై పంపాల్సిందిగా ఆదేశించింది.

**నివేదిక సమర్పించండి: నేషనల్ మెడికల్ కమిషన్**

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసుపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని దేశ వైద్య విద్యా నియంత్రణ సంస్థ నేషనల్ మెడికల్ కమిషన్ కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించింది. నివేదికను పరిశీలించిన అనంతరం తమ నియమాలకు అనుగుణంగా లేదని భావిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

**గొంతు నులిపి..ముఖాన్ని గోడకేసి కొట్టి.. పాశవికదాడి..**

పశ్చిమ బెంగాల్‌లో ఒక జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలిని నిందితుడు గొంతునులిమి చంపాడని, ఆ పెనుగులాటలో ఆమె థైరాయిడ్ కార్టిలేజ్ విరిగిపోయిందని పోస్టుమార్టం నివేదికను బట్టి తెలుస్తోంది.అసహజ లైంగిక చర్య.. పాశవిక దాడి కారణంగా అంతర్గత అవయవాల వద్ద లోతైన గాయం అయినట్లు వెల్లడైంది. ఆగస్టు 9న తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఐదు గంటల మధ్యలో ఈ ఘటన జరిగినట్లు సంబంధిత వర్గాల సమాచారం ఆధారంగా మీడియా వర్గాలు పేర్కొన్నాయి.ఉదరభాగం, పెదాలు, వేళ్లు, ఎడమకాలు వద్ద గాయాలున్నాయని, ఆమె కేకలు వినిపించకుండా ఉండేందుకు తలను గోడకు అదిమిపట్టి ముక్కు, నోరు మూసివేసినట్లు ఆ నివేదికలో వెల్లడైంది. అతడి దాడిని అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నంలో ఆమె ముఖమంతా గోటి గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆమె కళ్లు, నోరు, అంతర్గత అవయవాల నుంచి రక్తస్రావం జరిగినట్లు ఆ నివేదికలో ప్రస్తావించారు. అయితే ఆమె కళ్లకు ఎందుకు గాయాలు అయ్యాయో నిర్ధరణ కాలేదు. ఇదిలా ఉంటే.. ఆమె మృతదేహాన్ని ఆసుపత్రి సెమినార్ హాల్‌లో గుర్తించారు. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు.ఈ కేసు తీవ్ర సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ సుదీర్ఘ సెలవులో వెళ్లాలంటూ కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఘోష్ నిన్న రాజీనామా చేసిన కొద్దిగంటలకే కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈ సమయంలోనే కోర్టు ఆదేశాలు వచ్చాయి. "ఆసుపత్రిలో పనిచేస్తోన్న వైద్యులకు ప్రిన్సిపలే గార్డియన్. ఆయనే ఎలాంటి జాలి చూపించకపోతే ఇంకెవరు చూపిస్తారు. ఆయన ఎక్కడా పనిచేయకుండా ఇంట్లోనే ఉండాలి" అని ఆదేశించింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను ఎందుకు రక్షిస్తున్నారని ప్రభుత్వం, పోలీసులకు ప్రశ్నలు వేసింది.

## తుంగభద్రపై తాత్కాలిక గేటు ఏర్పాటుకు కసరత్తు

బళ్లారి(జనంసాక్షి):కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇది ఇంజినీరింగ్ సాహసమేనని నిపుణులు చెబుతున్నారు. 19 నంబర్ గేటు స్థానంలో 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు ఉన్న భారీ గేటును అమర్చనున్నారు. ఒకవైపు నీరు వెళ్తుండగానే దీన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పనులను జిందాల్‌తో పాటు మరో రెండు సంస్థలకు అప్పగించారు. గేటు ముక్కలను తయారు చేసి తుంగభద్ర డ్యామ్ వద్దకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మూడు సంస్థలు తయారు చేసిన గేటు ముక్కలను ప్రవాహం మీద ఉంచి అక్కడే వెల్డింగ్ చేసి అతుకులు పెట్టనున్నారు. 8 అడుగుల ఎత్తులో భారీగా వెళుతున్న ప్రవాహం మీది నుంచి నీటిని అడ్డుకుంటూ గేటును కిందికి దించనున్నారు. నిండుగా ఉన్న ప్రాజెక్టునుంచి నీరు వెళుతుండగా గేటు అమర్చడం సాహసోపేతమైన చర్యగా నిపుణులు పేర్కొంటున్నారు.

# చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

- తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ఆర్మూర్, ఆగస్ట్ 13 ( జనం సాక్షి):** రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని,అధికారం కోల్పోయిన నేతలు, ప్రతిపక్ష బీజేపీ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.ఆర్మూర్ పట్టణ కేంద్ర పరిధిలోని పెర్కిట్, కోటార్మూర్ లలో 44,63 జాతీయ రహదారుల జంక్షన్ రోడ్డు వద్ద రాష్ట్రడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు స్థానిక ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు పట్టు శాలువాలతో పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించడానికి వెళ్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు మార్గ మధ్యలో ఆర్మూర్ నాయకులు ఘనంగా సత్కరించి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమల తరలింపుతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.నిరుపేద బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్,నిజాంసాగర్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ యాల్ల సాయి రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్న, ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, మండల అధ్యక్షుడు ఎస్కే. చిన్నారెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ లు కశ్యప్ స్వాతి సింగ్ బబ్లు, పండిత్ వినీత పవన్, మాజీ వైస్ చైర్మన్ మోతుర్కరి లింగాగౌడ్, ఆర్మూర్ మాజీ సర్పంచ్ కొంగి సదాశివ్, కాంగ్రెస్ నాయకులు జిమ్మి రవి, ఖందేష్ సత్యం, ఎన్వీ రవీందర్ రెడ్డి (చిట్టి), తదితరులు పాలొన్నారు.




## మాదకద్రవ్యాల దుర్వినియోగంపై
# ఉక్కుపాదం మోపాలి

- శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- మట్కా, పేకాట ఆనవాళ్ళు జిల్లాలో లేకుండా చూడాలి
- రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 13 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఉక్కు పాదం మోపాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి డా. జితేందర్ జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మల్టీ జోన్-2 ఐ.జి వి.సత్యనారాయణ తో కలిసి మొక్కలు నాటారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ సెక్షన్ లను, నూతనంగా ప్రారంభించిన సైబర్ ల్యాబ్, కాన్ఫరెన్స్ హాల్ లను చూపించడం జరిగింది. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన క్రైమ్ రివ్యూ సమావేశంలో ఎస్పీ డిపిఒ కార్యాలయాన్ని ఆధునీకరించిన తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపుతూ.., జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకున్న చర్యలు మరియు జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటు చేసిన ఎస్- నాబ్ గురించి డిజిపి కి వివరించారు. అనంతరం డిజిపి పోలీసు అధికారులు ఒక్కొక్కరితో మాట్లాడుతూ.. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, హిస్టరీ షీటర్స్, శాంతి భద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటం వలన పొరుగు రాష్ట్రాల నుండి ఎక్కువ అక్రమ రవాణా జరగటానికి అవకాశం ఉన్నందున వాహనాల తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ద్వారా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వాహనాల తనిఖీలలో భాగంగా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. జిల్లాలో మట్కా, పేకాట వంటి నిషేధిత ఆటలు ఆడడానికి వీలులేదని, ఎవరైనా మట్కా నిర్వహిస్తున్నట్లు గాని, గంజాయి సాగు, అక్రమ రవాణా చేస్తున్నట్లుగాని, మట్కా, పేకాట ఆడుతున్నట్లుగాని గుర్తించినట్లయితే అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని యస్.హెచ్.ఒ లకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు , బ్లింకింగ్ లైట్స్, బోలార్డ్స్ ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. అనుక్షణం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డయల్-100 కాల్స్ విషయంలో బ్లూకోర్ట్ సిబ్బంది త్వరితగతిన స్పందించాలని, అతి తక్కువ కాల వ్యవధిలో నేర స్థలాన్ని చేరుకున్నట్లైతే నేరం యొక్క గ్రావిటీని తగ్గించవచ్చు అని, నేరం జరగకుండ ఆపవచ్చు అన్నారు. అధికారులు సిబ్బంది పోలీసు స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, సత్: ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ఫిర్యాది సమస్యను ఓపికగా విని, వారి సమస్య పరిష్కారం దిశగా సూచనలు చేయాలన్నారు. అనంతరం ఉత్తమ పనితీరును కనబరిచిన రామ్ మోహన్ డియస్పి, ఇన్స్పెక్టర్ శివలింగం, ఇన్స్పెక్టర్ మల్లేశం, ఇన్స్పెక్టర్ రమేష్, ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, శ్రీకాంత్ ఎస్.ఐ, ఆసిఫ్ ఎస్.ఐ, హెడ్ కానిస్టేబుల్, ప్రభాకర్ జానకిరామ్, ఆర్.ఐ. హన్మిరెడ్డి ఆర్.ఐ. రాజశేఖర్ రెడ్డి ఎ.ఒ. కళ్యాణి సూపర్డెంట్ వెంకటేశం, విజయ్ పవార్ సిసి లకు డిజిపి రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోన్-2 ఐ.జి వి.సత్యనారాయణ ఐ.పి.యస్, అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, నారాయణఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, జిల్లా ఇన్స్పెక్టర్స్, ఎస్.ఐ.లు పాల్గొన్నారు.



## శోభిత,నాగచైతన్యలపై
# విడాకుల కామెంట్స్

- జ్యోతిష్యుడు వేణుస్వామికి షాక్
- 22న హాజరు కావాలంటూ నోటీసులు

**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. నాగచైతన్య, శోభిత ధూళిపాళ విడిపోతారంటూ చేసిన వ్యాఖ్యలపై నోటీసులు ఇచ్చింది. మరోవైపు వేణుస్వామికి మద్దతుగా ఆయన భార్య వీణా వాణి వీడియో విడుదల చేసింది. మీడియాపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల నాగచైతన్య, శోభిత ధూళిపాళ నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వేణుస్వామి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. 2027లో ఇద్దరు విడిపోతారంటూ వ్యాఖ్యానించారు. గతంలో సమంత, నాగ చైతన్య జంట సైతం విడిపోతారంటూ బయటపెట్టారు. ఆ తర్వాత పలు విషయాలపై జాతకాలు చెప్పినా ఏ ఒక్కటి జరుగలేదు. ఇదిలా ఉండగా.. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. గతంలో సినిమాల విడుదల, రాజకీయాలు ఇలాంటి వ్యాఖ్యలు చేసి అభాసుపాలైనా ఆయనకు బుద్ధి రాలేదని.. వ్యక్తిగత విషయాలపై నలుగురిలో మాట్లాడకూడదనే జ్ఞానం లేకుండా వేణుస్వామి వాళ్లు విడిపోతారంటూ వ్యాఖ్యానిస్తున్నారని విమర్శించారు. దీనికి స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిపించి వివరణ కోరుతామని పేర్కొన్నారు. టెలికాస్ట్ చేసిన యూట్యూబ్ ఛానెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది.

## ఆస్థికోసం కన్న తండ్రిని కడతేర్చే కుట్ర



- దాడికి పాల్పడిన కూతురు, అల్లుడు..
- ఆసుపత్రికి తరలించిన కుటుంబసభ్యులు..
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఓ కూతురు ఆస్థికోసం కన్నతండ్రినే కడతేర్చేందుకు కుట్ర పన్నింది. కూతురు, అల్లుడు, మరికొందరు కలిసి దాడికి పాల్పడ్డారు. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు వేల్పుల మల్లేష్ ఇద్దరు కూతుళ్లు ఉండగా, అతని చిన్న కూతురు మహేశ్వరి, దత్తత తీసుకున్న అల్లుడు లక్ష్మారెడ్డి, మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మల్లేష్ పై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఆస్థికోసం చిన్న కూతురు చేయించిన ఈ దాడిలో మల్లేష్ రెండు కాళు విరిగిపోయాయి. స్థానికుల సమాచారంతో 108 లో వేల్పుల మల్లేష్ ను భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తన తండ్రిపై చెల్లెలు అయిన మహేశ్వరి, ఆమె భర్త లక్ష్మారెడ్డి లు దాడి చేశారని పెద్దకూతురు రాజేశ్వరి, అల్లుడు జగన్ మోహన్ రెడ్డిలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, భూపాలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విలీన గ్రామాల్లో టాప్ కనెక్షన్లకు
# డబ్బులు వసూలు చేయడం అన్యాయం

- విలీన గ్రామాల డివిజన్ కు ఒక ట్రాక్టర్ ను మంజూరు చేయండి
- కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి):** కరీంనగర్ నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలకు సంబంధించిన డివిజన్లో ప్రజల నుండి కొత్తగా ఆన్లైన్ పేరిట ట్యాప్ కలెక్షన్స్ కు డబ్బులు వసూలు చేయడం అన్యాయమని, గతంలో గ్రామపంచాయతీ సమయంలో ప్రజలు నల్ల కనెక్షన్ తీసుకున్న కూడా ఇప్పుడు ఆన్లైన్ పేరుతో డబ్బులు వసూలు చేయడం సరికాదని, విలీన ప్రజలకు ఆర్థిక భారంగా మారిన ఈ నిర్ణయాన్ని విరమించుకొని, నూతనంగా మంచినీళ్ల కనెక్షన్ కోసం అప్లై చేసుకున్న వారికే ఆన్లైన్ చార్జీలు వసూలు చేయాలని బిజెపి ఒకటో డివిజన్ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ మంగళవారం రోజున జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. అలాగే నగరపాలక సంస్థలో ఇప్పుడు కొనుగోలు చేసే క్రొత్త ట్రాక్టర్ల లో విలీన గ్రామాల డివిజన్లకు ఒక్క ట్రాక్టర్ కేటాయించాలని కోరారు. గత ఎనిమిది నెలల నుండి కొత్తగా వేసిన కరెంటు పోల్స్ కు కొత్త లైట్స్ నగరపాలక సంస్థ నుండి రావడంలేదని, ఇట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కుక్కల బెడదతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , ప్రమాదాలకు గురి అవుతున్నారని కుక్కల బెడద లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం విలీన గ్రామాలకు అమృత్ పథకం ద్వారా 147 కోట్ల నిధులను మంచినీటి అవసరాల కోసం మంజూరు చేయడం జరిగిందని, ఇట్టి మంజూరు చేసిన నిధులతో విలీన గ్రామాలలో కొత్తగా వాటర్ ట్యాంకర్స్, ప్రతి వీధులలో కొత్త పైప్ లైన్లు త్వరగా ప్రారంభించి పనులను పూర్తి చేయించడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే డివిజన్లో మురికి కాలువల, సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఒకటో డివిజన్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## టెక్స్ టైల్ పార్క్ కార్మికుల
# సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- ఒకవైపు ఉపాధి లేక , మరోవైపు యారన్ సబ్సిడీ డబ్బుల కోసం అవస్థలు పడుతున్న కార్మికులు



**తంగళ్ళపల్లి ఆగస్టు 13(జనం సాక్షి) :** టెక్స్ టైల్ పార్క్ లో కార్మికులకు ఉపాధి కల్పించి యారన్ సబ్సిడీ డబ్బులు అందించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆగస్టు - 16 ఒక రోజు టెక్స్ టైల్ పార్క్ బంద్ , దీక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ పిలుపునిచ్చారు. టెక్స్ టైల్ పార్క్ లో ఒకవైపు ఉపాధి లేక మరోవైపు బతుకమ్మ చీరల 10% యారన్ సబ్సిడీ డబ్బులు రాక కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. టెక్స్ టైల్ పార్క్ లో కార్మికులకు రావలసిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు కాలయాపన చేయకుండా వెంటనే అందించాలని సంబంధిత చేనేత జౌళి శాఖ అధికారులకు,జిల్లా కలెక్టర్ కు హైదరాబాద్ చేనేత జౌళి శాఖ కమిషనర్ కుపలుమార్లు కలిసి వినతి పత్రాలు అందించిన కూడా సబ్సిడీ అందించడంలో కాలయాపన జరుగుతుందన్నారు.కార్మికుల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన టెక్స్ టైల్ పార్కులో యజమానులు ప్రభుత్వ ఆర్డర్లు వచ్చినప్పుడు మాత్రమే పరిశ్రమలను నడిపిస్తున్నారని లేకపోతే మూసి వేస్తున్నారని దీనివలన కార్మికులకు సరియైన ఉపాధి దొరకక చస్తూ బతికే పరిస్థితి నెలకొన్నదని ఉపాధి, సబ్సిడీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చుకోవడంలో భాగంగానే ఆగస్టు - 16 శుక్రవారం రోజున ఒక రోజు టెక్స్ టైల్ పార్క్ బంద్ , పార్క్ గేట్ ముందు దీక్ష కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమాలలో టెక్స్ టైల్ పార్క్ లో పనిచేస్తున్న కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, రాజశేఖర్, మహేష్, ఆంజనేయులు, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ కెడిసిఎ వారి ఆధ్వర్యంలో
# నేడు కరీంనగర్‌లో భారీ తిరంగా సైక్లింగ్ ర్యాలీ



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** సైక్లింగ్ చేయడం వలన ఎన్నో లాభాలు చేకూరుతాయని భారతదేశ స్వాతంత్ర్యం చాలా గొప్పనైనదని ముఖ్యంగా మన దేశ ప్రజలందరికి వారందించిన స్వాతంత్ర్యం ఒక గొప్ప అవకాశం లాంటిదని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి , అసోసియేషన్ అధ్యక్షులు క్యాప్టెన్ డా.బి.మధుసుదన్ రెడ్డి లతో కలిసి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో నేడు నిర్వహించబోయే తిరంగా సైక్లింగ్ ర్యాలీపై ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేడు భారతదేశం అన్ని రంగాలలో ముందంజలో ఉండడమే కాకుండా అగ్రదేశాలకు ధీటుగా శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్నదని, ప్రత్యేకంగా మన జాతీయ నాయకులు వీరోచితంగా పోరాడి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పైచేయి సాధించడమే ప్రదానంగా స్వాతంత్ర్యం సాధించి మన దేశ ప్రజలకు ఒక గొప్ప ఉపశమనం అందించారని తెలిపారు. మనదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడి ప్రత్యేక చొరవతో ప్రవేశపెట్టిన హర్గర్తిరంగాకు మద్దతుగా ఈ ర్యాలీని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్ట్స్ మైదానం నుండి ప్రారంభమై తెలంగాణ చౌక్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం దేశ భక్తిని ఇనుమడింపచేయడమే కాకుండా సైక్లింగ్ పట్ల ప్రత్యేక ఆసక్తి పెంచాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడతున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో 6వ తరగతి పై వారు వారి సైకిళ్ళతో పాల్గొనాలని దీని ద్వారా మనదేశ భక్తి భావాలను తెలియజేయడమే కాకుండా వివిధ దేశ నాయకుల విశిష్టతను వ్యాపింప చేయవచ్చని చెప్పారు. ఆసక్తి గలవారు నేడు ఉదయం 6:20 ని.లకు మైదానంలో ఉండాలని ఈ ర్యాలీ సామూహికంగా చాలా గొప్పగా చేపట్టడం జరుగుతుందని ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ వారు పలు వినూత్నమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా విస్తృతంగా అవగాహన కల్పించి సఫలీకృతులైనారని హర్షం వ్యక్తం చేస్తూ ప్రజలందరు సంఘం వారు చేపడుతున్న పలు కార్యక్రమాలకు చేయూతనిచ్చి చైతన్యం నింపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93982 30614 నందు సంప్రదించగలరని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ భాద్యులు, కోచ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కావేటి పరమేశ్వర్ గురుస్వామికి
# 'అయ్యప్ప సేవా రత్న' అవార్డు ప్రదానం



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కావేటి పరమేశ్వర్ గురు స్వామికి అయ్యప్ప సేవా రత్న అవార్డును ప్రధానం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో జరిగిన "అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ" జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది గురుస్వాములకు అయ్యప్ప సేవా రత్న అవార్డులను అందించారు. ఫౌండర్, మేనేజింగ్ ఫౌండర్ ట్రస్టీ పి.ఎన్.కే మీనన్, అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు ఆధ్వర్యంలో శబరిమల అయ్యప్ప దేవాలయ మాజీ మేల్ శాంతులు శశికుమార్, దామోదరన్ నంబూద్రీ అయ్యప్ప సేవా రత్న అవార్డును కావేటి పరమేశ్వర్ స్వామికి అందించారు. ఈ సందర్భంగా కావేటి పరమేశ్వర్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో కరీంనగర్ జిల్లాలో అయ్యప్ప మాలధారణ చేసే స్వాములు, అయ్యప్ప సేవ సమితి సభ్యుల ఆశీస్సులు, సహకారంతోనే ఈ అవార్డు లభించిందన్నారు. అవార్డు రావడం సంతోషకరంగా ఉందని, ముఖ్యంగా ఈ అవార్డును జీవిత భాగస్వామి కావేటి శైలజ, కరీంనగర్ అయ్యప్ప భక్తులకు అంకితమిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. నిరంతర అయ్యప్ప స్వామి నామస్మరణతో మరింతగా అయ్యప్పకు సేవ చేసుకోవడానికి, మాల ధారణ చేపట్టే అయ్యప్పలకు తగిన తోడ్పాటును అందించడానికి, సేవ చేయడానికి తగిన కృషి చేస్తానని గురుస్వామి కావేటి పరమేశ్వర్ ఈ సందర్భంగా తెలిపారు. తన సేవను గుర్తించి అవార్డును అందించిన కమిటీకి, సీనియర్ గురుస్వాములకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రాణదాతకే రక్షణ లేదు..!!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

వైద్యులను ప్రాణ దాత అంటారు. అలాంటి ప్రాణ దాతలకే ఇప్పుడు రక్షణ లేని పరిస్థితి దాపురించింది! కొల్కొతా లో మన ఇండిపెండెన్స్ డే కు సరిగ్గా ఆరు రోజుల ముందు,ఒక లేడీ డాక్టర్ పై అత్యాచారం, హత్య సంఘటన జరుగుతుంది. ఒక హత్య, అత్యాచారం కేసుల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ జైల్లో ఉన్న గుర్మిత్ అలియాస్ రాం రహీం 21 రోజుల పేరోల్ మీద, ఇండిపెండెన్స్ డే మరో రెండు రోజులు ఉండగా మంగళవారం విడుదల అవుతాడు, గతంలోనూ ఇలాగే బిల్కిస్ బాను పై అత్యాచారం, ఆమె హత్య కేసులో యావజ్జీవ శిక్షలు అనుభవిస్తున్న ఏడుగురిని బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం, ఇది పెద్ద సమస్యగా మారడం చూసాము. వారణాసి లో బీజేపీ ఐటి సెల్ కు చెందిన వ్యక్తులు యూనివర్సిటీ లోకి వెళ్లి ఒక యువతి మీద అత్యాచారం చేసి వెళ్ళిపోతారు.మనదేశం లో భేటీ పడావో, భేటీ బచావో అనే పాలకుల నినాదం వట్టి బూటకం అయిపోయింది. ఒక మహిళ ముఖ్యమంత్రి గా ఉన్న రాష్ట్రం లోని కోల్కొతా మహానగరంలో ఈ నెల 9 న జరిగిన సంఘటన ఇది!ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ లో ఒక మహిళా ట్రైని 31 సంవత్సరాల డాక్టర్ పైన అత్యాచారం, హత్య సంఘటన

**దేశంను కదిలించింది..**

దేశం మొత్తాన్ని కదిలించింది. దేశంలోని మహానగరాల్లో, చిన్న చిన్న పట్టణాల్లో ఇప్పటికే 2000 కు పైగా న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యులు ప్రదర్శనలు నిర్వహించారు. సంజయ్ రాయ్ అనే ఆసుపత్రికి కమిషన్ ల కోసం పేషన్ట్ లను భర్తీ చేసే ఒక బ్రోకర్ ఈ ఘోర కృత్యానికి పాల్పడ్డాడు!ఆసుపత్రి లోని మూడో అంతస్తులో





దినమంతా వైద్య సేవలు చేసి సెమినార్ హాల్ లో నిద్రిస్తున్న డాక్టర్ పై ఈ ఆకృత్యానికి పాల్పడ్డాడు! గతంలో ముంబయిలో ఒక నర్స్ పై కూడ ఇలాంటి ఆకృత్యం ఆసుపత్రి లోనే జరిగింది. కోల్కతా లో డాక్టర్ పై అత్యాచారం జరిపి చంపిన సంజయ్ రాయ్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఒక ఆసుపత్రి లో రోగులను అడ్మిట్ చేసి కమిషన్ లు తీసుకునే వాడు ఇలాంటి కృత్యానికి పాల్పడగలడని ఎవరు ఊహిస్తారు.

**వెంటనే స్పందించిన మమత**

రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ వెంటనే స్పందించి చర్యలకు ఆదేశించారు. డాక్టర్ కుటుంబ సభ్యులను కలిసి మమతా మాట్లాడారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మహిళా అభ్యర్థులు ఎంపీ లు గా గెలిచింది పశ్చిమ బెంగాల్ నుంచే, అది కూడ తృణమూల్ కాంగ్రెస్ వాళ్లే కావడం విశేషం! అలాంటి ప్రాంతంలో ఇలాంటి ఒక యువ డాక్టర్ మీద అత్యాచారం, హత్య ఆందోళనకరం అనకతప్పదు!దేశంలో గత పది ఏండ్ల నుంచి మహిళల మీద అత్యాచారాలు పెరిగాయి. మణిపూర్ లో ఇద్దరు యువతుల ను నగ్నంగా ఊరేగించి ఆ తర్వాత వారి మీద ఆకృత్యం సంఘటన, హత్రస్ లో దళిత యువతి పై అత్యాచారం, హత్య ఆమె శవాన్ని సైతం కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా పోలీసులు దహనం చేయడం ను ఎవరు మర్చిపోగలరు.



**కంటి రెప్పలను కాపాడుకుందాం**

ఈరోజు ఒకరి ప్రాణాలను కాపాడే డాక్టర్ ప్రాణానికే రక్షణ లేని పరిస్థితి ఉన్నది. 'సేవ్' సేవర్' అంటూ డాక్టర్స్ వీదుల్లోకి వచ్చి నినదించే పరిస్థితి వచ్చింది!మన కంటి రెప్పలు మన బిడ్డలు, వారు డాక్టర్లు కావచ్చు, లాయర్లు కావచ్చు, రైతు కూలీలు కావచ్చు, కలెక్టర్ లు, పోలీస్ లు జడ్జిలు, రెజ్లర్ లు కావచ్చు, రాజకీయాల్లో ఉండే వారు కావచ్చు వారు మన కంటి రెప్పలు!ఎస్ వారిని కాపాడుకుందాం!బ్రోకర్ దంధాలు చేసే వారు ఎంత ప్రమాదకరమైన వ్యక్తులో చూసారు కదా!డాక్టర్ లకు ఒక సూచన, పెషేంట్ ల కోసం బ్రోకర్లను, పోషించి,ప్రోత్సహించకండి!సేవ్ అవర్ సేవర్స్!మన బిడ్డలను మనమే రక్షించుకోవాలి!మహిళల మీద అత్యాచారాల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్,పశ్చిమ బెంగాల్, చెత్తిస్ గడ్, బీహార్, మహారాష్ట్ర లు ముందున్నాయి. మన దేశంను గతంలో కదిలించిన నిర్భయ సంఘటన లాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఎమ్మెల్యే లు, ఎంపిల మీద అత్యాచారాల లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినా పాలకులు మాట్లాడడం లేదు! పైగా ఇలాంటి దుష్కృత్యల మీద గొంతు ఎత్తిన వారి ని జైల్లో పెడుతున్నారు. జులుం చేస్తున్నారు.ఇంకా ఎంత కాలం?

## ఒక్కటై సాధిద్దాం...!

వలసవాదం ఓడి స్వాభిమానం నెగ్గి
నెత్తురు చిందించిన ఉద్యమ గర్వం
మూడు రంగులై ఎగిరి నింగికి ఎగిసి
ప్రజలే ప్రభువులన్న ఆశయాల
రాజ్యాంగాన్ని అందలమెక్కించుకొన్నాక
స్వాతంత్రం మూన్నాళ్ళ ముచ్చటని
అతివలపై ఆగని అత్యాచారాలు
ఆర్తనాదాలతో ఆక్రోశిస్తూ చెప్పాయి
తెల్లతోలు నల్లతోలు అయిందంతే!
సగటు భారతీయుడి అవలక్షణాలు
దేశ ముఖచిత్రాన్ని క్రమంగా మార్చాయి
అవినీతి వ్యవస్థ కుల గురువై
కులమత ప్రాంతాలు వేరు పురుగై
భిన్నాభిప్రాయాలు అడ్డు గోడలై
భిన్నత్వంలో ఏకత్వం పగటి కలై
చూపులు ముందుకి నడక వెనక్కి
అన్నట్టు మన ప్రగతి కదులుతోంది...
ఆర్థిక అసమానతలు అధిక జనాభా
ఇదే ఇన్నాళ్ళ ప్రగతి!
జెండా పండుగ రోజు నాటి వీరుల్ని
స్మరిద్దాం! అవరోధాల్ని అధిగమించేద్దాం!

**భీమవరపు పురుషోత్తమ్**
**9949800253**

## ఆ జలపాతం

పై నుండి దూకుతున్న నీళ్ళని చూస్తూ పిల్లలు
మురిసిపోయి కేరింతలు కోద్తుంటే
ఒంటరిగానో జతగానో తడుస్తూ స్నానాలు చేస్తూ
యువతీ యువకులు ఆనందాలు పోతుంటే
సెల్ఫీలు ఫోటోలు తీసుకుంటూ పెద్దలు
చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకుంటుంటే
ఆ జలపాతం పులకించిపోయింది
నీటిబొట్టులో విద్యులత ఆవిష్కరించి
నివాసాలను చీకటి ఆవాసాలను వెల్గిస్తుంటే
ఆ జలపాతమే పునీతమైంది

**కోటం చంద్రశేఖర్, 9492043348**

# చదువు పరమార్థం సంపాదనా?

**ప్రపంచాన్ని మార్చగల ఏకైక సాధనం "విద్య" అని నెల్సన్ మండేలా చెప్పిన మాట అక్షర సత్యం.విద్య యొక్క ప్రాశస్త్యాన్ని ప్రాచీన కాలంలోనే మన దేశం లోని అనేక మంది ప్రముఖులు చాటి చెప్పారు.విద్యలకు విలువలు జోడించడం,నైతిక ప్రవర్తన పెంపొందించడం భారతీయ సంస్కృతి లో ఒక భాగం.**

విద్యవలన జ్ఞానం పెరుగుతుంది. జ్ఞానం వలన ప్రపంచం ప్రగతి పథంలో సాగుతుందని విజ్ఞుల వాదన. "అన్నదానం పరం దానం, విద్యాదానమతః పరం...."అనే శ్లోకం అన్ని దానాలకంటే అన్న దానం ప్రధానమైనదని,అన్నదానం కంటే కూడా విద్యాదానం మరింత విశిష్టమైనదని సూచిస్తున్నది. అన్నదానం వలన తాత్కాలిక క్షుద్బాధ తీరుతుంది. కాని విద్యాదానం శాశ్వతమై సుశోభిల్లుతుందనే భావన నూటికి నూరుపాళ్ళు నిజం. విద్యవలన అన్నీ సాధించవచ్చు."విద్యాధనం"సకల సంపదలకు మూలధనం."విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పురుషాళికిన్, విద్య నృపాల పూజితము..." అనే శ్లోకం లో విద్య యొక్క గొప్పతనం వివరించబడింది.ఇంతటి ప్రాశస్త్యమైన విద్య వ్యాపార మయమై పోయింది. కేవలం ఉపాధి కోసం మాత్రమే విద్య...కోట్ల సంపాదనకే జ్ఞానం అన్నట్టుగా మారిపోయింది. పూర్వ కాలంలో విద్యను మూడవ నేత్రంగా భావించేవారు. విద్య అనగా తెలుసు కోవడం. మానవ జిజ్ఞాస కు మరింత పదును పెట్టేది విద్య. విద్య అనగా సత్యాన్వేషణకు మూలకారణమని, ఆరోగ్యవంతమైన మనసును సృష్టించేది మాత్రమే విద్య అని గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ అభిప్రాయం సర్వకాలాలకు వర్తిస్తుంది.



అజ్ఞాన తిమిర హరణం విద్య వలన మాత్రమే సాధ్యం. మానవుని బుద్ధిని వికసింపచేసి, సత్ప్రవర్తన ను పెంపొందించేదే నిజమైన విద్య అని భారతీయుల ఆరాధ్యదైవం "స్వామి వివేకానంద" చెప్పాడు. ఎవరి మనసైతే కల్మష రహితంగా ఉంటుందో, వారే నిజమైన విద్యావంతులు. మనలో నిగూఢమైన శక్తులను వెలికి తేసేది విద్య. విద్య వివేకాన్ని ప్రోది చేయాలి. సంస్కారమనే కోణాన్ని ఆవిష్కరింపచేయాలి. అయితే నేటి విద్యలు ఇలాంటి లక్షణాలను ప్రేరేపించడం లేదు. విద్యావంతులు సైతం సకల దుర్లక్షణధారులు గా పరివర్తన చెందడానికి కారణం విద్యా వ్యవస్థలోని లోపం. నైతిక ప్రవర్తన నేర్పని విద్యల వలన సమాజం అంధకార బంధురమై పోతున్నది. ఒకప్పుడు విద్యావిహీనులను పశు సమానులుగా భావించేవారు. అయితే నేటి సమాజంలో చదువు కున్న వారి కంటే,అనుభవ జ్ఞానం గల నిరక్షరాస్యులే నైతిక విలువలతో జీవించడం గమనార్హం. ఉగ్గుపాలతోనే వ్యాపారదృక్పథంతో ఆంగ్ల భాషను నేర్పించడం, మాతృభాషను విస్మరించడం వలన అనేక అనర్థాలు జరుగుతున్నాయి. మన భాషలోని నీతి గ్రంథాలు,పరభాషా వ్యామోహంతో తృణీకరించబడుతున్నాయి. అనాదిగా పాటిస్తున్న విలువలు హరించబడ్డాయి. మాతృ భాషలు మన సంస్కృతీ సాంప్రదాయాలకు, విలువలకు,మానవ సంబంధా లకు పెద్దపీటవేస్తుంటే,వాటిని కాదని కేవలం అర్థం కాని వయసులో,అర్థంకాని భాషలో విద్యను బోధించడం వలన నష్టమే తప్ప ఒనగూడే ప్రయోజనం శూన్యం.ఆంగ్ల భాషకున్న ప్రాధాన్యత విస్మరించలేని మాట వాస్తవం. అదే సందర్భంలో మాతృభాషను తృణీకరించడం ఆక్షేపణీయం.

సకల సమాచారం మాతృభాషలో లభ్యమవుతున్న నేపథ్యంలో "గూగూల్" సైతం మాతృభాషలకు విశేష ప్రాధాన్యత నిస్తున్న నేటి పరిస్థితుల్లో మాతృభాష పలకడానికి నామోషీ ఎందుకు? కనీసం ప్రాథమిక స్థాయి వరకైనా మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగించడం శ్రేయస్కరం.బాల్యం నుండే చెడుదారులు పడుతూ,యుక్తవయస్సులో అనేక ఘోరకృత్యాల్లో పాలు పంచుకుంటున్న నేటి తరం విద్యావంతుల పరిస్థితికి మూలకారణం అన్వేషించాలి. సకల సమస్యలనుండి సమాజాన్ని కాపాడే నిజమైన ఆయుధం నైతిక విలువలతో కూడిన విద్యాబోధన మాత్రమే. విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన గావించాలి. విద్యావ్యవస్థ సక్రమంగా ఉన్నప్పుడే అన్ని వ్యవస్థలు సజావుగా పనిచేస్తాయి. నేటి సమాజంలో చోటుచేసుకుంటున్న సకల అనర్థాలకు మూలకారణం విద్యను వ్యాపార వస్తువుగా మార్చడమే. నాలుగు గోడల మధ్య విద్యార్థులను బంధించి,మనసులేని రోబోల ప్రపంచాన్ని సృష్టించడం వలన జరిగే పరిణామాలను మనం చూస్తూనే ఉన్నాం. వివేకాన్ని ప్రేరేపించే విద్యావిధానం రూపుదిద్దుకోవాలి.మానవ సంబంధాలకు, నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలి. మనిషిని మనసున్న మనిషి గా చేసి, వివేకవంతమైన సమాజాన్ని సృష్టించడం లో ఉపాధ్యాయుల పాత్ర కీలక మైనది. ఉపాధ్యాయులే రాబోవు తరాలకు మార్గదర్శకులు. విద్యార్థులను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు బాధ్యతాయుతమైన పాత్రను నిర్వర్తించాలి.సకల గుణగణాలతో,అత్యంత క్రమశిక్షణ తో జీవితాంతం విద్యారంగానికి కృషిచేసిన మహనీయుల చరిత్రను ఆకళింపు చేసుకోవాలి. ప్రముఖ వ్యక్తుల దార్శనికతను,చిత్తశుద్ధిని, అంకిత భావాన్ని నేటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలి. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా దాని ఫలితం దేశ భవిత పై తీవ్ర ప్రభావం చూపగలదు. జాతికి జవసత్వాలు అందించగల నిజమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించాలి.



**సుంకవల్లి సత్తిరాజు**
**(సామాజిక విశ్లేషకులు,మోటివేషనల్ స్పీకర్,కాలమిస్ట్)**
**9704903463**


# దేశ విభజన భయానక స్మారక దినోత్సవం

***1947 ఆగస్టు 14 ఒక చీకటి రాత్రి, బ్రిటిష్ వారు విభజించు పాలించు అనే నినాదాన్ని నిజం చేసుకునే ఉద్దేశంతో దేశాన్ని విభజించారు. కోట్లాదిమంది కన్నీళ్లు కార్చిన రోజు. ప్రజల హృదయాలు బద్దలైన రోజు. కన్నీటి అలలు కాల్చిన కాలం, కోమల హృదయాలు చిత్రమైన కాలం, కుటుంబాలు విడిపోయి బంధాలు తెగిపోయిన కాలం, కన్నీటి సముద్రంలో మునిగిపోయిన కాలం.***



మతం పేరుతో రక్తం చిమ్మిన కాలం, మనుషులు మృగాలుగా మారిన కాలం, స్వర్గం కోసం నరకం నిర్మించిన కాలం, శాంతి కోసం యుద్ధం చేసిన కాలం. ఆగస్టు 14 చీకటి రాత్రి మరిచిపోలేని విషాదం గాధ కళ్ళు మూసుకున్న కనిపించే హృదయ విదారకమైన దృశ్యం. దేశ విభజన వల్ల కలిగిన బాధ నష్టం దుఃఖం, లక్షలాదిమంది ప్రజలు ఏడ్చిన కన్నీళ్లు, మనుషులు చిన్నాభిన్నమై భవిష్యత్తుపై ఆశలు పోగొట్టుకున్న రోజు. మతం పేరుతో జరిగిన హింస చిన్నపిల్లలు ముసలి వాళ్లు ఆడవాళ్లు కుటుంబ సభ్యులు అందరూ దిక్కు లేక వివిధ దేశాలలో తలదాచుకున్నారు.1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన సందర్భాన్ని మనం స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకుంటాం. కానీ, ఈ సంతోషకరమైన సందర్భంతో పాటు, దేశ విభజన వల్ల కలిగిన వేదన కూడా మన మనసుల్లో నిలిచిపోయింది. లక్షలాది మంది తమ ఇళ్లు, ఆస్తిపాస్తులు కోల్పోయి, ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో, భారత ప్రభుత్వం ఆగస్టు 14ని 'భయానక విభజన సంస్మరణ దినం'గా ప్రకటించింది.దేశ విభజనకు అనేక కారణాలు సామాజిక, మతపరమైన విభేదాలు హిందూ, ముస్లిం సముదాయాల మధ్య ఉన్న విభేదాలు, బ్రిటిష్ వారి పాలనలో వీటిని మరింత తీవ్రతరం చేయడం.రాజకీయ పార్టీల మధ్య పోటీ,కాంగ్రెస్, ముస్లిం లీగ్ వంటి పార్టీల మధ్య అధికారం కోసం జరిగిన పోటీ.బ్రిటిష్ వారి 'విభజించు పాలించు 'అనే విధానం, బ్రిటిష్ వారు భారతీయులను విభజించి తమ పాలనను కొనసాగించేందుకు ప్రయత్నించారు.విభజన భారతదేశాన్ని రెండు దేశాలుగా విభజించింది. ఈ విభజన వల్ల అనేక దుర్భర పరిణామాలు చోటుచేసుకున్నాయి.లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లు, ఆస్తిపాస్తులు కోల్పోయారు.రెండు దేశాల మధ్య యుద్ధాలు జరిగాయి.కోట్లాది మంది శరణార్థులుగా మారారు.సామాజిక సామరస్యం దెబ్బతిన్నది.విభజన సంస్మరణ దినం మనకు అనేక ముఖ్యమైన పాఠాలు నేర్పుతుంది.సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.విభజన వల్ల కలిగే నష్టాలను గుర్తు చేస్తుంది.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా చూసుకోవడానికి ప్రేరేపిస్తుంది.






విభజన వల్ల కలిగిన వేదనను మనం ఎన్నటికీ మరచిపోకూడదు. ఈ సంస్మరణ దినాన్ని సద్వినియోగం చేసుకొని, సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలి. భవిష్యత్తు తరాలకు ఈ విషయాన్ని తెలియజేసి, వారిలో జాతీయ ఏకతను పెంపొందించాలి.విభజన భయానక కాలం మన చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. ఈ సంస్మరణ దినం మనకు మరోసారి గుర్తుచేస్తుంది, విభజన వల్ల కలిగే నష్టాలు ఎంత తీవ్రంగా ఉంటాయో. అందుకే మనం సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిజ్ఞ చేయాలి. దేశ విభజన సమయంలో జరిగిన హింస ఎన్నటికీ మరువలేని హృదయ విదారకరమైన దృశ్యాలు. విభజన తర్వాత కొత్త దేశాన్ని నిర్మించుకొని అందరము కలిసి మెలిసి ఒకరికొకరు సహాయం చేసుకుని శాంతియుతంగా ఉండే ప్రయత్నం చేస్తున్నాం. భవిష్యత్తు తరాల కోసం మంచి పనులు చేయాలి విభజన వల్ల కలిగిన నష్టాన్ని ఎప్పటికీ మరిచిపోకూడదు. భారతదేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్క భారతీయ పౌరుడు దేశ భవిష్యత్తుకై కృషి చేయాలి. దేశానికి అవసరమైన శాంతి సమైక్యత ను కాపాడాలి. విభజన నుండి నేర్చుకున్న పాఠాలను జీవితంలో పాటించాలి. భారతదేశ అభివృద్ధి చెందాలని కోరుకుని దేశ అభివృద్ధికై ప్రతి ఒక్కరు కృషి చేయాలి. **(ఆగస్టు 14 దేశ విభజన భయానక స్మారక దినోత్సవం)**

పూసపాటి వేదాద్రి
**కవి సాహితీ విశ్లేషకులు**
**9912197694**



## చేధించరానిది... ఉంటుందా!?

పలుకడానికి
పెదవే కావాలా
సముద్ర ఘోషకు
పెదవి ఎక్కడిది!
కోకిలకు
ఏ సంగీతం తెలుసు
అనురాగానికి
రాగం అవసరమా!
ఎదురుచూపుకు
నిద్దుర ఉంటుందా
నిద్దుర లేని ప్రయత్నం
విజయం దరి చేర్చదా!

శోధించేవాడికి
చేధించరానిది ఉంటుందా!?

జగ్గయ్య.జి
9849525802

## గమనం

కవిగారి కలం
చిలికెను కవనం
రవి విసిరే కిరణం
పుడమికి ఆభరణం

కురిసింది వర్షం
జనమంతా హర్షం
ప్రకృతి పరవశం
వెలిసె పచ్చదనం

కర్షకుని హలం
చదునుగా పొలం
సిరులతో ధాన్యం
గుండె గరిసెన జీవం

రాజ్యానికి ఒక రోజు
పచారి కొట్టున తరాజు
ధనిక పేద బేరీజు
మానవాళి రివాజు

ఆలుమగల కలహం
సంధ్య లోపున
మాయం
నిత్యం సమస్యల
తోరణం
పరివర్తన కై ప్రభోదం

సంసారం ఒక
సమరం
సమరమే అమరం
అమరమే సుగమం
సుగమమే గమనం

**రచన నమిలకొండ**
**నాగేశ్వర్ రావు**
**8689553470**
**మేడ్చల్**

## గాయపరుస్తున్న గ్రామసింహాలు..!

నిన్న విశ్వాసానికి
మారుపేరైన శునకాలు
నేడు విషసర్పాలై
వీధుల్లో విచ్చలవిడిగా
తిరుగుతున్నాయి...
దారి కాచి హఠాత్తుగా
దాడి చేస్తున్నాయి..!
ఏంరోగమొచ్చిందో ఏమో
ఈ వీధికుక్కలకు...
ఈ గజ్జి కుక్కలకు...
ఈ పిచ్చికుక్కలకు...
నిర్దాక్షిణ్యంగా మీద పడి
రక్తం చిందేలా రక్కుతున్నాయి...
పిల్లలను పీక్కుతింటున్నాయి..!

గతంలో అరిచేవి మొరిగేవి కానీ
ఇప్పుడు కసిగా కరుస్తున్నాయి...
దారుణంగా దాడి చేస్తున్నాయి...
క్షణాల్లో ప్రాణాలను తీస్తున్నాయి..!

కారణం ఒక్కటేనట...
ఆదరణ లేకపోవడమట...
ఆహారం దొరకపోవడమట...
అది నిజం కాకపోవచ్చునట...
వైద్యుల ఊహలకు అంచనాలకు
శాస్త్రవేత్తల పరిశోధనలకు అందని
"వ్యాధి ఏదో " సోకి ఉండవచ్చునట..!
ఓ పిల్లలారా..! ఓ పెద్దలారా..!
ఓ వృద్ధులారా..! జరా జాగ్రత్త..!
అప్రమత్తంగా ఉండండి...
ఆయుధాలతో బయటికెళ్లండి...
ఓ జంతు ప్రమికులారా..!
ఈ కుక్కల దాడిని
అరికట్టే మార్గాలను ఆలోచించండి...
ఓ ప్రభుత్వ అధికారులారా..!
తక్షణమే వీధి కుక్కలదాడికి
బలైపోతున్న బడిపిల్లలను రక్షించండి..!

**"కవిరత్న" "సహస్రకవి"**
**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్..హైదరాబాద్**
**9110 784502**

# మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

**సిఐటియు అధ్యక్షులు**



**శంషాబాద్, ఆగష్టు 13 (జనంసాక్షి)**

రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతర మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం కార్మికులకు అండగా ఉంటానని మీ సమస్యను పరిష్కరించి జీతాలు పెంచుతానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈనాడు మాట తప్పి హరే రామ హరే కృష్ణ సంస్థకు మధ్యాహ్నం భోజన పథకాన్ని అప్పజెప్పే విధంగా ఆ సంస్థతో మాట్లాడి మాకు అన్యాయం చేస్తున్నారు. హరే రామ హరే కృష్ణ సంస్థకు అప్పజెప్పే పద్ధతిని రద్దు చేయాలి. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ధర్నా సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సీఐటీయూ నాయకులను చర్చలకు పిలిచి మాట్లాడాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలోకి దిగుతామన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ కు కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల నాయకులు. రాజేష్, భారతమ్మ, సావిత్రి, రవీందర్, సునీత, శివరాణి, శారదమ్మ, లక్ష్మీదేవి, లావణ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- గ్రామాల్లో స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క



**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి):**

గ్రామాల్లో స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాల బలోపేతంపై అదనపు కలెక్టరు జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మంగళవారం రాష్ట్ర బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు బాగా కష్టపడ్డారని తెలిపారు. మంచి పనితీరు కనబరిచిన సిబ్బందిని ఆగష్టు 15వ తేదీన సన్మానిస్తామని చెప్పారు. గతంతో పోలిస్తే ఎక్కువ పని జరిగిందని, కానీ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. మండలాల వారిగా రివ్యూలు చేసి సమగ్ర నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఇక నుంచి ప్రతి నెలా మూడు రోజుల పాటు 'స్వచ్ఛదనం - పచ్చదనం' డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. పారిశుధ్య లోపాలపై పత్రికల్లో వార్తలు వస్తే సరిదిద్దాలని అన్నారు. సర్పంచ్ ఎన్నికల వరకు అధికారులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని అన్నారు. జీపీ స్పెషల్ అధికారులు ఉదయం కనీసం మూడు గంటల పాటు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి రోజు సిబ్బంది అంటెండెన్స్‌తో పాటు వారు చేసిన పనుల వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫాంలు సిద్ధం చేసి పంపిణీ చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యత్వాన్ని కోటి మందికి చేర్చాలని అన్నారు. మహిళా శక్తి ప్రోగ్రాంలో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వామ్యం పెంచాలని సూచించారు. అధికారులు ఆవాస గ్రామాల్లో పర్యటించి మహిళా శక్తిలో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. మెదక్ జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పిడి డిఆర్డి శ్రీనివాసరావు జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెలా మూడు రోజుల పాటు 'స్వచ్ఛదనం - పచ్చదనం' డ్రైవ్ కొనసాగిస్తామన్నారు. పారిశుధ్యంపై దృష్టి సారిస్తామన్నారు. జీపీ స్పెషల్ అధికారులు ఉదయం కనీసం మూడు గంటల పాటు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి రోజు సిబ్బంది అంటెండెన్స్‌తో పాటు వారు చేసిన పనుల వివరాలను తెలియజేయాలని జిల్లా అధికారులకు సూచించారు. గ్రామాల్లో జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు చేపడుతున్నామని మంత్రి గారికి జిల్లా అదనపు కలెక్టర్ వివరించారు.

# చట్ట ప్రకారమే భూములు కొనుగోలు చేశాం

**ఎక్కడ కబ్జాలకు పాల్పడలేదు**
**జీనియస్ కన్స్ట్రక్షన్ యజమాన్యం వివరణ**

ఇబ్రహీంపట్నం, ఆగష్టు 13(జనం సాక్షి)

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అనాజ్ పూర్ గ్రామంలో సర్వే నెంబర్ 276, 277, 278, 279, 280, 281, 175 లో ఎకరాల పట్టా భూములున్నాయి. అలాగే సర్వే నెంబర్ 261, 271, 272, 273, 274లో మరో 40 ఎకరాల పట్టా భూమి ఉంది. అన్ని సర్వే నెంబర్లలో కలిపి మొత్తం 215 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. ఇట్టి పట్టా భూములను జీనియస్ కన్స్ట్రక్షన్స్ పేరుతో ఈ భూములను కొనుగోలు చేశాం ఇందులో ఒక గజం భూమి కూడా అసైన్మెంట్ భూమి లేదు. 1993లో ఈ భూములను డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు ఈ పట్టా భూములను రైతులనుంచి కొనుగోలు చేశారు. డాక్టర్ రాఘవేంవద్ర ప్రసాద్, కుటుంబ సభ్యుల నుంచి ఈ భూములను మేము జీనియస్ కన్స్ట్రక్షన్స్ పేరుతో కొన్నాం. మా కంపెనీలో మేము తప్పా మరెవరూ ఇందులో లేరు. నాగన్పల్లి గ్రామంలోని 189 సర్వే నెంబర్, అనాజ్ పూర్ 281 సర్వే నెంబర్లలో కొంత అసైన్మెంట్ భూములున్నాయి. రైతులు ఈ భూముల్లోకి వెళ్లేందుకు దారిలేదు. రైతులందరూ కలిసి దారి వేసుకుంటున్నారు. రైతులు తమ భూముల్లో కొంత ప్రభుత్వానికి సరెండర్ చేసి రోడ్డు వేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. రైతులతో కలిసి మా కంపెనీ జీనియస్ కన్స్ట్రక్షన్స్ కూడా రోడ్డు వేయడానికి సహకరిస్తోంది. అంతే తప్పా మా కంపెనీ ఒక్క గజం అసైన్మెంట్ భూమి తీసుకోలేదు. అలాంటి ఆలోచన కూడా మాకు లేదు. మా కంపెనీ ప్రతిష్టను దెబ్బతీయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు మాట్లాడుతూ..నాగన్పల్లి గ్రామంలోని 189 సర్వే నెంబర్, అనాజ్ పూర్ 281 సర్వే నెంబర్లలో రైతులు లక్ష్మయ్య గౌడ్, బాలరాజ్, నెట్టు బాలయ్య, సిహెచ్ బాలయ్య,బాలరాజు,ఎం అబ్బయ్య, రమణయ్య, యాదగిరి,లకు భూములున్నాయి. అట్టి భూముల్లోకి వెళ్లడానికి దారి లేదు. అందువల్ల ఆ భూముల్లో కొంత భాగాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేసి రోడ్డు వేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాం. ప్రభుత్వం ఈ రోడ్డుకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నాం. రోడ్డు వేయడానికి మాకు సహకరించాలని జీనియస్ కన్స్ట్రక్షన్స్ కంపెనీని కలిసి కోరాం. మా భూములను ఎవరూ ఆక్రమించలేదు. మేము ఎవరికీ అమ్మలేదు. లీజుకు కూడా ఇవ్వలేదు. రోడ్డు వేయడానికి జీనియస్ కన్స్ట్రక్షన్స్ కంపెనీ మిషనరీని వాడుకుంటున్నాం. మా పొలాలకు రోడ్డు లేకుండా చేయొద్దు, మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఫిర్యాదులు వస్తే సహించేది లేదు

**కలెక్టర్ వల్లూరి క్రాంతి**

**సంగారెడ్డిప్రతినిధి, ఆగస్టు 13(జనం సాక్షి)**

రుణమాఫీ విషయంలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో రైతు రుణమాఫీ, మహిళ శక్తి పథకాలపై బ్యాంకర్స్ వ్యవసాయ అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన రైతు రుణమాఫీ, డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసి రైతులకు నగదు రూపంలో డబ్బులు అందజేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలోని అన్ని రైతువేదికలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి రైతుల నుండి డాక్యుమెంట్స్ స్వీకరించాలని, రుణాలను రెన్యువల్ చేసి రైతులకు నగదు రూపంలో డబ్బులు అందించాలన్నారు. రుణమాఫీ డబ్బులు అందజేయడం రుణాలు రెన్యువల్ చేయడంలో ఎక్కువ పెండింగ్ ఉన్న డివిజన్లో త్వరితగతిన నగదు ను రైతు ఖాతాలలో జమ చేయాలన్నారు. కొత్త లోన్ వివరాలు, పాత లోన్ రెన్యువల్ వివరాలు బ్యాంకుల వారీగా అందించాలన్నారు. రుణమాఫీ డబ్బులు రైతులు ఖాతాలో జమ చేయడం ఆలస్యం అవ్వడంతో రైతుల నుండి రైతు సంఘాల నుండి ఫిర్యాదులు అందుతున్నాయి, అలాంటి సమస్యలు ఇకముందు రాకుండా రైతులు ఖాతాలో నగదు జమ చేయాలన్నారు.రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. మహిళా శక్తి కేంద్రాలు ఏర్పాటుకు బ్యాంకర్లు మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనందించాలన్నారు. 2024-25 సంవత్సరానికి లక్ష్యం రూ " 927.27 కోట్లకు గాను ఈనెల ఆగస్టు నాటికి రూ '345.47 కోట్లు, పూర్తి చేయడం జరుగుతుందని, ఇప్పటివరకు రూ '309 కోట్ల రూపాయల గ్రౌండ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయ అధికారి నరసింహ, ఎల్‌డిఎం గోపాల్ రెడ్డి, జడ్పిసిఓ జానకి రెడ్డి, మెప్మా గీత, డిప్యూటీ డిఆర్డిఓ డిప్యూటీ సంగారెడ్డిగా డిప్యూటీ డిఆర్డిఓ జంగారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, ఈడిఎస్సి కార్పొరేషన్ చారి, సంబంధిత బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# రైతు బజార్ ఫిష్ మార్కెట్‌లో మాఫియా

- రైతు బజారు ఫిష్ మార్కెట్‌లో వసూల్ రాజాలు
- బిఆర్ఎస్ నాయకులు చేసింది మాఫియా వ్యాపారం
- మండిపడుతున్న బండి రమేష్



**కూకట్ పల్లి ఆగష్టు 13(జనంసాక్షి):**

కూకట్పల్లి నియోజకవర్గంలో గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ నాయకుల మాఫియా వ్యాపార సామ్రాజ్యం నడిచిందని ఇకపై ఆ పప్పులు ఉడకవని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం హెచ్చరించారు. రోడ్డుమీద తోపుడు బండి వ్యాపారి దగ్గరనుంచి ఫుట్ పాత్ వ్యాపారులు, ఫ్లై ఓవర్ల కింద, నర్సరీ దగ్గరనుంచి రైతు బజార్, ఫిష్ మార్కెట్, అక్రమ నిర్మాణాలు, పార్కుల కబ్జాల వరకు ప్రతి దాంట్లో ఎమ్మెల్యే కృష్ణారావు అతని అనుచరులు గత పదేళ్లుగా పందికోకుల్లా దోచుకుతిన్నారని రమేష్ ధ్వజమెత్తారు. కెపిహెచ్బి కాలనీలోని ఫిష్ మార్కెట్లో అక్రమ దందా నడుస్తుందని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన స్థానిక నాయకులతో కలిసి మార్కెట్ ను పరిశీలించారు ప్రతి షాప్ కు వెళ్లి షాపు మీదేనా అంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. అయితే ఇక్కడున్న షాపుల్లో సగం కంటే ఎక్కువ మంది షాపు ఎలాట్ అయిన వారి కంటే బయట వారే ఉండటం నాయకుల దృష్టికి వచ్చింది రాజేష్ రాయ్ అనే బయట వ్యక్తి ఫిష్ మార్కెట్లో నాలుగు షాపులు తను లేకుండానే అద్దె వసూలు చేయడంపై బండి రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రమేష్ మీడియాతో మాట్లాడుతూ మత్స్యకారులు పేదవారి జీవనోపాధి ఏర్పాటు కోసం ప్రభుత్వం ఈ మార్కెట్ ను ఏర్పాటు చేస్తే గత టీఆర్ఎస్ పాలకులు తమ స్వార్థం కోసం చీమలు పెట్టిన పుట్టల్లో పాములు చేరినట్టు పేదవారి కోసం కేటాయించిన షాపుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం మత్స్యకారులకు రూ 1400, రూ .2000 చొప్పున షాపులు కేటాయిస్తే టిఆర్ఎస్ నాయకులు వాటిని రూ.15 వేలకు రూ. 20వేలకు వేరే వారికి అద్దెకిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న కేటాయింపులన్నీ రద్దు చేసి త్వరలో అసలైన మత్స్యకారులకు, పేదలకు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఇళ్ల మధ్యన కొనసాగుతున్న మద్యం దుకాణాన్ని రమేష్ పరిశీలించారు తమ వ్యాపారం కోసం మొత్తం రహదారినే మూసివేసి మద్యం దుకాణాన్ని నిర్వహించడంపై స్థానికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక్కడ పట్టపగలు రహదారిపైనే తాగుబోతులు మద్యం సేవిస్తూ హల్ చల్ చేయడంపై రమేష్ దుకాణదారుడి బండి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గోపాల్ నగర్‌లో పార్కు స్థలం పరిశీలన**

వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న గోపాల్ నగర్ పార్కు స్థలాన్ని కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ పరిశీలించారు. అయితే ఇక్కడ మొదటి లేఅవుట్, రెండో లేఔట్, ఫైనల్ లేఅవుట్ అంటూ కనీసం ఒక్క పార్కు కూడా లేకుండా భూపాకాసురులు మొత్తం మింగేశారు. ఎక్కడో ఒక మూలన కొద్ది స్థలం ఉంటే దాన్ని కూడా కొత్త లేఅవుట్ అంటూ మింగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న బండి రమేష్ ఆ స్థలాన్ని పరిశీలించారు. దీనిపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిసెట్టి దినేష్, గంధం రాజు, మైఖేల్, సంజీవ, శివ చౌదరి, బచ్చుమల్లి, ఫణి కుమార్ అరవింద్ రెడ్డి, పొడుగు అప్పారావు రజిత రేష్మ జోజమ్మ వనజ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి రండి..మోడీ ఆహ్వానం



- కోటపల్లి ఉపాధ్యాయులు లక్ష్మణ్ సాయి చరణ్‌కు అరుదైన గౌరవం
- పాఠశాల అభివృద్ధికి దాదాపు రెండు కోట్లు మంజూరు

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 13 (జనంసాక్షి)**

కోటపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో మా పాఠశాల ఎంపిక కావడం జరిగింది. ఆగస్టు 15న జరిగే దేశ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి రావాల్సిందిగా పిఎం ఆఫీసు నుంచి జెడ్‌పిహెచ్ఎస్ కోటపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు లక్ష్మణ్ విద్యార్థి సాయి చరణ్‌కు ఆహ్వానం అందింది. వారు మంగళవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. 14 .15 తేదీల్లో ఢిల్లీలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మొదటగా ఇండియా గేట్ వార్ మెమోరియల్ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం 543 పాఠశాలల్లో ఐదు పాఠశాలలను పిఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసింది వాటిలో వికారాబాద్ జిల్లా నుంచి జెడ్‌పిహెచ్ఎస్ కోటపల్లి ఖమ్మం నుంచి జెడ్‌పిహెచ్ఎస్ రఘునాథ్ పల్లి నిర్మల్ జిల్లా నుంచి కేజీవీబీ దస్తురాబాద్ నల్గొండ జిల్లా నుంచి కేజీవిబీ కంటనూరు కరీంనగర్ జిల్లా నుంచి తెలంగాణ మోడల్ స్కూల్ వీణవంక పాఠశాలలు ఎంపికయ్యాయి. ఒక్కొక్క పాఠశాలకు సుమారుగా రెండు కోట్ల నుంచి ఐదు కోట్ల వరకు పీఎం శ్రీ పథకం కింద నిధుల మంజూరు జరుగుతుంది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ..విద్యార్థులు మరింత ఉన్నతంగా విద్యాభ్యాసన చేయగలుగుతారు. లేబరేటరీల ఏర్పాటు వారి ఉన్నతి ఎంతగానో దోహదపడుతుంది. పాఠశాలల పథకం పిఎం శ్రీ కార్యక్రమంలో భాగమైన స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)ని అమలు 'పీఎంశ్రీ' పథకంతో పాఠశాలలు అభివృద్ధి చేస్తారు. విద్యరంగం మెరుగునకు చేస్తున్న కృషి సర్వదా అభినందనీయం. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో మా పాఠశాల ఎంపిక కావడం విద్యార్థులు మరింత ఉన్నతంగా విద్యాభ్యాసన చేయగలుగుతారు. లేబరేటరీల ఏర్పాటు వారి ఉన్నతి ఎంతగానో దోహదపడుతుంది. పాఠశాల దేశంలోనే ఎంపికైనందుకు చాలా గర్వపడుతున్నాం కోటపల్లి మండలంఉపాధ్యాయులు,విద్యార్థులు ,ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసినారు పాఠశాల ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి ,రామిరెడ్డి మోహన్, వెంకట నరసింహారెడ్డి, అంజయ్య, శివప్రసాద్, మల్లేశం, యాస్మిన్ బేగం, ఫాతిమా బేగం మొదల ఉపాధ్యాయులు కార్యక్రమానికి పాఠశాల తరఫున ఉపాధ్యాయులు లక్ష్మణ్ బయలాజికల్ సైన్స్ పదవ తరగతి విద్యార్థి సాయి చరణ్ ఢిల్లీకి పంపించారు.




## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

**మల్కాజిగిరి,ఆగస్టు 13 (జనంసాక్షి)**

వినాయక నగర్ డివిజన్ పరిధిలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మంగళవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి డివిజన్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై చర్చించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలాకాలముగా పెండింగ్‌లో ఉన్న కాకతీయనగర్ ప్రధాన రహదారి రోడ్డు, శివనగర్‌లో మిగిలిన బాక్స్ డ్రైనేజీ, వినాయక నగర్, ఆనంద్ బాగ్ కమ్యూనిటీ హాల్లను మల్టీ లెవెల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దాలని,ఎస్ఎన్డిపి ఫేస్2లో డివిజన్‌లో ఉన్న నాళాలను అభివృద్ధి చేయాలని,ప్రపోజల్‌లో పెట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాల్సిందే



**మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):**

విద్యార్థులలో జాతీయవాదం పెంపొందించడానికి..ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. బీజేవైఎం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు మెదక్ పట్టణంలో మంగళవారం తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారతదేశంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని,చిన్న వయస్సు నుండి విద్యార్థులలో జాతీయవాదం పెంపొందాలని, స్వతంత్ర సమరయోధుల చరిత్ర విద్యార్థులకు బోధించాలని, అన్ని మతాలను సమానంగా చూసేదే భారత దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు నాయిని ప్రసాద్, నందా రెడ్డి ,ప్రభాకర్ ,రంజిత్ ,కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, ఓబిసి మోర్చా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, బీజేవైఎం టౌన్ అధ్యక్షులు నిర్మల రాకేష్, సాయి సన్నీ, బిజెపి బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.

# రోగుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే సహించేదే లేదు..!

**కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**



**ఎల్బీనగర్, ఆగస్టు 13 (జనంసాక్షి)**

బియన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిల నిర్లక్ష్యం వల్ల రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారని బియన్‌రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డికి సమాచారం అందడంతో ఈ రోజు ప్రభుత్వ ఆసుపత్రుని కార్పొరేటర్ పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగుల పట్ల ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని,ఆసుపత్రిలో రోగులకు సరైన చికిత్స అందడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దవాఖానకు వచ్చే రోగులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ,పేరుకే ప్రభుత్వ ఆసుపత్రి అయినా, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నా కూడా రోగులకు అందుబాటులోకి తీసుకు రావడం లేదని ప్రజలకు అందుబాటులో లేని ప్రభుత్వ ఆసుపత్రి ఉన్న ఒకటే లేకున్నా ఒకటే అని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి

## మంత్రి సీతక్కను కోరిన ఎమ్మెల్యే గూడెం



**పటాన్ చేరు రూరల్ ఆగస్టు 14 (జనం సాక్షి)**

పటాన్ చేరు నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలలో నూతన రోడ్ల నిర్మాణాలు, రహదారుల మరమ్మతుల నిమిత్తం 60 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞాపన పత్రం అందించారు. మంగళవారం హైదరాబాద్లోని సచివాలయంలో మంత్రి సీతను కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ఆయన చర్చించారు. ప్రధానంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో నూతన కాలనీలో ఏర్పాటు అవుతున్న తరుణంలో రహదారుల నిర్మాణం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నూతన రహదారుల నిర్మాణానికి 43 కోట్ల రూపాయలు, రహదారుల మరమ్మత్తులకు 17 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క త్వరలోనే ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# హిందువులపై దాడులు సహించం

## జాతీయవాదం పెంపొందించడం కోసమే తిరంగా ర్యాలీ

### పేటలో భారీ తిరంగా ర్యాలీలో ఎంపి డి కే.అరుణ



నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

ప్రజల్లో జాతీవాదం పెంపొందించడం కోసమే ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో తిరంగా ర్యాలీ హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాలమూరు పార్లమెంట్ ఎంపి డికె.అరుణ అన్నారు.అలాగే బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు నాగు రావు నామాజీ, కే. రతంగ్ పాండురెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.శ్రీనివాసులుతో కలిసి- బీజేపీ యువమోర్చ, మహిళమోర్చ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా భారీర్యాలీ చౌక్ బజార్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, చిట్టెం నర్సిరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపి.మాట్లాడుతు స్వాతంత్ర్య సమరంలో మహనీయుల పోరాటాలను స్మరించుకున్నారు.దేశ ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందించేందుకే ఈ తిరంగా ర్యాలీ అన్నారు.బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషం, ఇలాంటి దాడులు సరికావని ఖండించారు. 2047 కల్లా ఈ దేశాన్ని విశ్వ గురుగా వికసిత్ భరత్ సంకల్పమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రధాని మోదికి మనమంతా అండగా ఉండాలని కోరారు.బంగ్లాదేశ్ లో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులు దారుణం అన్నారు. ముఖ్యంగా అక్కడ హిందువులపై జరుగుతున్న దాడుల్ని ప్రజలంతా పార్టీలు మతాలు,కులాలకు అతీతంగా మనమంతా సమిష్టిగా ఖండించాలన్నారు. మానవతకు, జాతీయ సమైక్యతను దెబ్బ తీసే ఇలాంటి సంఘ విద్రోహశక్తుల దాడులకు సహించబోమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఐక్యంగా ఉన్న భారత్‌లోకి చొరబడేందుకు కొందరు యత్నిస్తున్నారని అలాంటి కుట్రలను సాగనియకుండ మోడీ ప్రభుత్వం సరిహద్దుల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన మనమంతా ఐక్యంగా ఉండాలి జాతీయ సమైక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోవర్ధన్ గౌడ్, ఎ.వెంకట్ రాములు, కెంచే శ్రీనివాసులు, జిల్లా నాయకులు భాస్కర్, లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్,సిద్ది వెంకట్ రాములు, సత్య యాదవ్, జి.రఘువీర్ యాదవ్ ,మండల,పట్టణ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫార్మ్స్ సకాలంలో అందించాలి



### జిల్లా అదనం కలెక్టర్ మయాంక్ మిట్టల్

**మఖ్తల్ ఆగస్టు 13 (జనంసాక్షి)**

విద్యార్థులకు సరిపడా స్కూల్ యూనిఫార్మ్స్ సకాలంలో అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. మంగళవారం ఊట్కూరు గ్రామపంచాయతీ పరిధిలో స్కూల్ యూనిఫార్మ్స్ కుట్టు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ యూనిఫార్మ్స్ సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఊట్కూరు గ్రామపంచాయతీ మండల పరిధిలోని ఎంపీడీవో, ఎంపీవోతో సమావేశమై పాఠశాలలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. వర్షపు నీరు ఇంకుడు గుంతల ద్వారా ఇంకిపోయేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ, అడిషనల్ డిఆర్డిఎ, ఎంపీడీవో, ఎంపీఓ తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



### జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి):**

జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మంగళవారం తెల్లవారు జామున 03:30 నిమిషాల సమయంలో చేగుంట ఎస్సై ఆర్.బాల్ రాజు తన సిబ్బందితో కలిసి మాసాయిపేట గ్రామ శివారులోని శేరి ఈ పంజాబీ దాబా సమీపంలో నేషనల్ హైవే 44 రోడ్డు పై వాహనాల తనిఖీ చేస్తుండగా మాసాయిపేట గ్రామానికి చెందిన మోతి జనార్ధన్ మాసాయిపేట్ వైపు నుండి చేగుంట వైపు వెల్లుచుండగా ఎస్ఐ అట్టి వ్యక్తిని ఆపగా అతను మోటర్ సైకిల్ వదిలి పెట్టి పారిపోవుటకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఎస్ఐ వారి సిబ్బందితో అతని కలిసి పట్టుకొని విచారించగా మాసాయిపేట్ గ్రామస్తులు అయిన అతని స్నేహితులు రేవల్లి లక్ష్మణ్, చింతల జగన్ ఏ పని చేయకుండా తిరుగుతూ ఉన్నారు. వారికి కల్లు మరియు మద్యం తాగే అలవాటు గలదని మరియు ఇతర జల్సాలకు డబ్బులు అవసరమై సులభంగా డబ్బులు సంపాదించాలని అందుకు మోటర్ సైకల్లు దొంగతనం చేసి వాటిని అమ్మి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని సుమారు ఒక సంవత్సరం నుండి చేగుంట, రామాయంపేట, తూప్రాన్, మెదక్ టౌన్, నిజాంపేట్, మేడ్చల్ మరియు హైదరాబాద్ ఏరియాలో ఇండ్ల ముందు పార్క్ చేసిన మరియు రైల్వే స్టేషన్ల ముందు పార్కింగ్ చేసిన బైకులను దొంగతనం చేసుకొని వచ్చి వారికి పరిచయం ఉన్న సిర్నాపల్లి గ్రామానికి చెందిన వడ్ల శ్రీకాంత్‌కు ఆరు బైక్ లను అమ్మగా వచ్చిన డబ్బులను వారి జల్సాలకు వాడుకొనమని, 8 బైక్‌లను తర్వాత అమ్ముదామని మాసాయిపేట్ గ్రామంలోని మోతే జనార్దన్ ఇంటి సమీపంలో ఉన్న చెట్ల పొదలు దాచి పెట్టినట్లు నేరం అంగీకరించినట్టు తెలిపారు. 15 బైక్‌లను స్వాదినం చేసుకొని నేరస్తుడైన మోతే జనార్ధన్ ను అరెస్టు చేసి జుడిసియల్ రిమండ్ కు పంపుతున్నట్లు, మిగతా నేరస్తులను త్వరలోనే పట్టుకుని వారిని కూడా రిమాండ్‌కి పంపిస్తామని ఎస్పీ తెలిపారు. ఇట్టి చోరీ జరిగిన 8 మోటర్ సైకిళ్ల విలువ 5 లక్షల రూపాయల విలువ ఉంటుందని ఎస్పీ వివరించారు.



## పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా

### ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మాగనూర్ ఆగస్టు 13 (జనం సాక్షి):**

మాగనూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా పాఠశాలకు కావాల్సిన నీటి సదుపాయం కోసం కొత్తగా బోరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మూత్రశాలలు సమస్యను త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు.

# స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతర ప్రక్రియ

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, ఆగస్టు13 (జనంసాక్షి):**

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ఆపకుండా నిరంతరం కొనసాగించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ (సీతక్క) జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఇటీవల జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం కార్యక్రమాన్ని ఇకముందు కూడా కొనసాగించి గ్రామాలను పరిశుభ్రంగా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందని సూచించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శిస్తూ ఎక్కడా చెత్తా చెదారం లేకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన గ్రామ పంచాయతీ నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఇందిర మహిళా శక్తి కింద షెడ్యూల్డు కులాలు, తెగల ప్రాంతాల్లో ఇంకా ఎవరైనా స్వయం సహాయక బృందాలు సభ్యత్వం లేని వారిని గుర్తించి సభ్యత్వం చేర్పించాలని సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు శిక్షణ ఇచ్చి, చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. ఆగష్టు 5 నుండి 9 వరకు నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని బాగా నిర్వహించిన మండలాలను, గ్రామ పంచాయతీలను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు ఇవ్వాల్సిందిగా సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వనపర్తి జిల్లాలో జరిగిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం వివరాలు వెల్లడించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆదేశించారు. చెత్తను రోడ్డు పైన, బయట పడేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని డిపిఓను ఆదేశించారు. గ్రామ రహదారి పొడవునా, లే అవుట్ ఖాళీ స్థలంలో మొక్కలు నాటించాలసి ఆదేశించారు. మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ ఇచ్చి యూనిట్లు నెలకొల్పే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, పిడి డిఆర్డిఓ ఉమాదేవి, జెడ్పి సీఈవో యాదయ్య, డిపిఓ, రమణమూర్తి, అడిషనల్ డిఆర్‌డిఓ నాగేంద్ర, జిల్లా వైద్యశాఖ తరపున డాక్టర్ సాయినాథ్ డిఎల్పిఓ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి



### సఖీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద గల సఖీ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. కేంద్రంలోని స్టాఫ్ రూమ్, కౌన్సిలింగ్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. సఖి కేంద్రం మొదటి అంతస్తుల గల షీ టీం కార్యాలయాన్ని పరిశీలించి, షీ టీం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను అక్కడున్న కానిస్టేబుల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత సఖి కేంద్రం మీటింగ్ హాల్‌లో సిబ్బందితో మాట్లాడారు. కేంద్రానికి రెగ్యులర్‌గా వచ్చే ఫిర్యాదులు -కేంద్రం ద్వారా చూపిన పరిష్కారాల గురించి అక్కడి నిర్వాకులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల నివారణకు చేపడుతున్న చర్యల గురించి ఆమె ఆరా తీశారు. బాల్య వివాహాలను అరికట్టి, వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత రెండు నెలలుగా ఎన్ని ఫోక్సో కేసులు నమోదయ్యాయని అడిగి తెలుసుకున్నారు.అలాగే లైంగిక వేధింపుల కేసుల వివరాలను పరిశీలించారు. కేంద్రానికి వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సఖి కేంద్ర నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్ కు ఎన్ని కాల్స్ వస్తున్నాయని, వాటికి చూపిన పరిష్కారం ఏమిటని ప్రశ్నించారు. హెల్ప్ లైన్ కు వచ్చే కాల్స్ ఫిర్యాదులపై అలసత్వం చూపవద్దని తెలిపారు. సఖి, చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్‌కు సంబంధించిన జూలై నెల ఫైల్స్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సుభాష్ రోడ్‌లో గల బాల సదనాన్ని కలెక్టర్ సందర్శించారు. బాలసదనంలో ఎంతమంది చిన్నారులు ఉన్నారని ?పాఠశాలకు ఎలా పంపిస్తున్నారనీ అడిగి తెలుసుకున్నారు. సదనంలోని చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డబ్ల్యుఓ జయ బాయి, సఖి కేంద్రం నిర్వాహకురాలు క్రాంతి రేఖ, బాలసదనం నిర్వాహకురాలు కవిత పాల్గొన్నారు.




## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 13 )జనం సాక్షి)**

ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హర్ గర్ తీరంగా కార్యక్రమం జిల్లా కన్వీనర్ డికె. స్నిగ్ధా రెడ్డి ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో విద్యార్థులు, యువకులతో భారీ ర్యాలీ, జాతీయ గీతాలపాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా హర్ గర్ తీరంగా కన్వీనర్ డికె. స్నిగ్ధా రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారతదేశం ఆర్థిక వ్యవస్థ సుభీక్షంగా సురక్షితంగా అత్యంత పటిష్టమైన రక్షణ వ్యవస్థను కలిగి ఉందని నరేంద్ర మోడీ భారతదేశాన్ని విశ్వగురుస్థానంలో ఉంచుటకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో 75 ఏళ్ళ భారత స్వాతంత్ర్య మహోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవలని, ప్రతి ఇంటిపై గర్వంగా జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట రాములు, రాష్ట్ర మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మీర్జా పురం వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, కౌన్సిలర్ రజక జయశ్రీ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు అనిల్, ఐటి సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ, లత్తి పురం రామి రెడ్డి, గీత రెడ్డి, డబ్బిలేటి నరసింహ, బిజెవైఎం నాయకులు తరుణ్, గాంజా సాయి , తిరుమల్, మోహన్ రెడ్డి, రాజశేఖర్, పవన్ ,విరేష్ రెడ్డి కోట్ల,ప్రదీప్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని విడియో సమావేశ మందిరంలో మంగళవారం 'రోడ్డు సేఫ్టీ కమిటీ 'అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బోర్డులు, సూచికలు, సైన్ బోర్డులు, రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మూల మలుపుల దగ్గర హెచ్చరికల బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ,ఏర్పాటు చేసి, రోడ్డు గుంతలను పూడ్చి వేయాలన్నారు. స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేసి, మద్యం తాగి వాహనాలు నడిపే వారి పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, రోడ్డు మరమ్మత్తులలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక పౌరుడు తెలుసుకోవాలని, రోడ్డు భద్రత పై బాధ్యత కల్గి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. ప్రతి 3 నిమిషాలకు రోడ్డు ప్రమాదాల వల్ల ఒకరు చనిపోతున్నారని తెలిపారు. కొద్ది పాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని గ్రహించాలని అన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. రోడ్డు పై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రతగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు నిబంధనలను,సూచనలను పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, పోలీసు, ఎక్సయిజ్, జాతీయ రహదారుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులను అభినందించి రివార్డ్‌లు అందజేసిన ఎస్పీ

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధన్వాడ, మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులలో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష (లైఫ్) పడింది అని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అభినందించారు అని ఎస్పీ తెలిపారు. అట్టి కేసుల ఇన్వెస్టిగేషన్ అధికారులను సిఐలు రామ్ లాల్, శ్రీకాంత్ రెడ్డిలను డిజిపి అభినందించి ప్రశంసా పత్రాలను అందించడం జరిగిందని తెలిపారు. నారాయణపేట జిల్లాలో నారాయణపేట, దామరగిద్ద ధన్వాడ మరికల్ పోలీస్ స్టేషన్ల లలో ఈ ఆరు నెలల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ మొత్తం12 కేసులలో నేరస్తులకు శిక్ష పడడం జరిగింది అని ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. అందులో బాగా పనిచేసి అధికారులను డీఎస్పీ ఎన్ లింగయ్యను, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆకుల బాలప్ప, విజయ్ శ్రీధర్ లను సిఐలు శివశంకర్, రాజేందర్ రెడ్డి, దస్రు నాయక్‌లను ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, రమేష్, మురళీ, బాల వెంకటరమణ లను కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఈ ఎస్సై శంకరయ్య, కోర్టు డ్యూటీ అధికారులు విజయ్ కుమార్, అరవిందు వీరప్ప, ఎచ్ సి. నరసింహ లను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించి రివార్డులు అందించడం అని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు సిబ్బందిని గుర్తించడం జరుగుతుందని వారికి ప్రోత్సాహకరంగా రివార్డులు అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ప్రజల కోసం అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు ఎల్లవేళల సేవలు అందించాలన్నారు.




## మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

### ఈఎల్ఎస్ఏ జడ్జి రమేష్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.లలిత కుమారి

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 13 (జనం సాక్షి)**


మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అందరిపై ఉందని ఈఎల్ఎస్ఏ జడ్జి రమేష్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.లలిత కుమారి అన్నారు. మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం, మాదక ద్రవ్యాలు నిర్మూలన సంయుక్త అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి మండలంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల, కోతులపూర్ జడ్పీహెచ్ఎస్ ,మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాదక ద్రవ్య నిర్మూలన ,లింగ సమానత్వం, ఆరోగ్యం, విద్య, ఉద్యోగ అభివృద్ధి,హెల్ప్ లైన్ నంబర్స్ 100, 181, 1098 గురించి విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో అందరి బాధ్యత వహించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఆడపిల్ల ప్రాముఖ్యతను తెలియజేస్తూ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్ చంద్ర, అధికారులు, మహిళా పోలీసులు, సీఐ, సీనియర్ సిటిజన్ అధికారి వెంకటేశం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, ప్రిసిపల్స్, పంచాయతీ సెక్రటరీలు పాఠశాల సిబ్బంది అంగన్వాడీ టీచర్స్ ఆశ తదితరులు పాల్గొన్నారు.




# ‘కాలం కేన్వాస్ మీద’

**– అనిశెట్టి రజిత కవిత్వం– సింగరాజు రమాదేవి**

1984లో గులాబీలు జ్వలిస్తున్నాయి అనే కవిత్వ సంపుటితో మొదలైన అనిశెట్టి రజిత సాహితీ ప్రయాణం ఆరు కవితా సంపుటాలు, అనేక దీర్ఘ కవితలు, హైకూలు, నానీలు, వందలకొలదీ సాహిత్య సామాజిక వ్యాసాల రచనలతో పాటు, అనేక గ్రంథాలకు సంపాదకత్వంతో నేటి వరకూ కొనసాగుతూనేఉంది. పలు పత్రికలకు సంపాదక వర్గంలో సభ్యులుగా, రుద్రమ ప్రచురణల ప్రచురణ కర్తగా, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక అధ్యక్షులుగా? ఇలా అనేక పాత్రలలో ఆమె విస్తారమైన సాహితీ, సామాజిక రంగ కృషి అందరికీ పరిచయమే. ఇక ఆమె పొందిన ప్రముఖ పురస్కారాల జాబితా కూడా పెద్దదే. సుభద్రాకుమారీ చౌహాన్ అవార్డు, వీరాంగన సావిత్రీబాయి ఫూలే ఫెలోషిప్ అవార్డు, శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి పురస్కారం, డాక్టర్ బోయి భీమన్న పురస్కారం, రొట్టమాకు రేవు కవిత్వ పురస్కారం, ఫ్రీవర్స్ ఫ్రంట్ ‘ కుందుర్తి ఆంజనేయులు అవార్డు ఇలా అనేకం.తాజాగా ఆమె వెలువరించిన ‘కాలం కేన్వాస్ మీద’ అనే ఈ కవిత్వ సంపుటి ఆమె రచించిన ఏడవ కవిత్వ సంపుటి. ఈ సంపుటిలో యాభై కవితలు ఉన్నాయి. వైవిధ్యమైన వస్తువులతో, విభిన్నమైన తన శైలిలో, తన అనుభవాలను, అనుభూతులను, ఆవేదనలను, బహుళ అస్తిత్వ గళాలను, అణచివేతను, అసమానతలను, తనకు పరిచయమైన వ్యక్తులతో తన అనుబంధాన్నీ? అన్నీ తన కవితల్లో పదునైన మాటలకు, లోతైన తాత్వికత జోడిరచి పదిలపరిచారు.కవితా సంపుటి శీర్షికగా ఉన్న కవిత ‘కాలం కేన్వాస్ మీద’ కవితలో “నేనిప్పుడు ఒక నైమిశారణ్యంలో సేదతీరాలని/ విశ్వయాత్రతో విస్మృతినై తప్పిపోవాలని / కాలం కేన్వాస్ మీద తుమ్మెదలా వాలి ఒక చుంబన మకరందాన్ని ఆస్వాదించాలని/ ఒక సృష్టిని అధ్యయన మథనం చేస్తూ / కాలానికి ఊయలగట్టి రుతురాగమై ఊగాలని / పిల్లనగ్రోవి నుండి వీచే గాలిపాటనై/ నిర్మోహంగా ఆత్మదీపాన్ని ఆలింగనం చేసుకోవాలని (ఉంది)” అన్న ఆకాంక్షలో అంతులేని భావుకతతో పాటు లోతైన తాత్వికత కనిపిస్తుంది. ఈ సంపుటిలో ఇలాంటి కవితలు ఎన్నో! ముందుగా వ్యక్తుల నుండి స్ఫూర్తి పొంది రాసిన కవితలు చూద్దాం!బాల్యంలో ఎవరికైనా తన తండ్రి హీరోలాగా కనబడతాడు. వాళ్ళని తెలియకుండానే అనుకరిస్తారు, అనుసరిస్తారు. కొంచెం పెద్దయ్యేకొద్దీ వాళ్ళని ఇంకా బాగా అర్థం చేసుకునే అవకాశం దొరుకుతుంది. అలా తన తండ్రి గురించి రజిత గారు రాసిన కవిత ‘మా నాన్నే విశాల ప్రపంచం!’ అందులో ఇలా చెప్తారు.“బతుకు వ్యవసాయంలో కష్టాలతో / అలంకృతుడైన మా నాన్న / నిఖార్సైన కార్మికుడూ కర్షకుడు / అనుబంధాలని ఆవిష్కరించినవాడు / మాకు మా నాన్నే ఈ సుందర సువిశాల ప్రపంచం అనిపిస్తాడు.”ఇలా ఒక కూతురు తన తండ్రి గురించి ఆరాధనతో, ప్రేమతో రాసుకున్న పంక్తులు మన హృదయాంతరంగాలను కూడా సూటిగా తాకుతాయి. అయితే తన తండ్రి అనే కాదు, రజిత తాను విన్న, చూసిన, కలిసి నడిచిన అనేకమంది వ్యక్తుల వల్ల స్ఫూర్తి పొందారు. మంచిని, గొప్పతనాన్ని ఎక్కడున్నా చర్చించి, గుర్తించి, మన్నించి, దాన్ని స్వీకరించి ప్రేరణ పొందటమే కాక ఆ విషయాన్ని ఎటువంటి భేషజం లేకుండా ఒప్పుకుని, ఆ అనుభవాలకి కవితా రూపం ఇచ్చారు. తన సొంత తండ్రి తరువాత తన తండ్రి సమానంగా భావించిన కాళోజీపై రెండు కవితలు రాశారు.మా నాయన విశ్వమానవుడు, ఆకాశమంత మనిషి. అందులో కాళోజీ గురించి? “ప్రజా కవీ! పౌర హక్కుల రవీ!” అని పిలుస్తూ?
“పొగడ్తలకు లొంగని ధిక్కారం / పురస్కారాలకు తలవంచని సంస్కారం / అతడొక మహా సైన్యం” అంటారు. పైగా “ఆకాశమంత మనిషిని దేనితో కొలుస్తాం, మనసుతోనే కదా! / అంతెత్తు మనిషిని ఎంతెత్తుకెదిగితే చూస్తాం / అరాచకాలపై కన్నెర్ర జేస్తేనే కదా / ‘నా’ నుండి ప్రయాణంలో ‘మనం’ వరకూ చేరుకుంటేనే కదా / జనం మనం అని తెల్సుకుంటేనే కదా” అంటూ కాళోజీ ఆశయాలకి అసలైన నివాళి ఎలా ఇవ్వాలో కూడా చెప్తారు.అబ్దుల్ కలాం, సినారె, ఉద్యమకారిణి పొద్దుటూరు జయశ్రీ, సాహితీ మిత్రులు వేణు సంకోజు? ఇలా అనేకమంది ప్రముఖులు, సన్నిహితులపైన కూడా కవితలు రాశారు రజిత.ఈ సంపుటిలోని ‘ఆమె పాదం’, ‘రెండో సగానివి’, ‘పితృస్వామ్యంలో’ అనే కవితలు స్త్రీ వాదిగా, స్త్రీ పక్షపాతిగా, పితృస్వామ్య వ్యతిరేకిగా అనిశెట్టి రజిత స్వరాన్ని పదునైన మాటలతో, స్పష్టమైన భావజాలంతో సాక్షాత్కరింపజేస్తాయి. ఆడపిల్లల పట్ల సమాజంలోఉన్న వివక్షని ఎత్తి చూపుతూ?
“సత్సాంప్రదాయాల పుట్టినిల్లీ దేశం / స్త్రీని పూజించే పుణ్యభూమీ దేశం / అయినా ఆడజన్మలు అంతరిస్తుంటాయి / ఏడుపు పాటలుగా ధ్వనిస్తుంటాయి” అంటారు.‘పితృస్వామ్యం’ కవితలో “సతీత్వం వెంటనే దహించేస్తుంది / విధవత్వం మెల్లిగా చంపేస్తుంది / ధర్మ శాసనాల ఉచ్చుల్లో బంధించి / హింసిస్తుంది పురుషస్వామ్యం” అంటూ “యుగయుగాల వైఫల్యం పితృస్వామ్య వ్యవస్థది / మరో దారి లేదు? రావాలిక మాతృస్వామ్యం” అంటారు. హైదరాబాద్ నగరంపై ప్రేమతో, అక్కడ మతాల మధ్య నెలకొన్న సామరస్య సంస్కృతి, చార్మినార్ వంటి చారిత్రక కట్టడాల పట్ల గర్వం, ఉర్దూ భాషపై మక్కువతో రాసిన కవిత “విశ్వ ప్రేమ కావ్యం”. హైదరాబాద్ నగర సంస్కృతిలో భాగమైన ఉర్దూ, తెలుగు సమ్మేళనం ఈ కవితలో కనపడుతుంది. కరోనాపై రాసిన రెండు కవితలు ‘మాఫ్ కరోనా’, ‘జాగో జనతా, భాగో కరోనా’ కవితల్లో కూడా ఈ ఉర్దూతో సమ్మిళితమైన తెలుగు భాషా ప్రయోగం కనపడుతుంది. ఇది తెలంగాణ ప్రాంత ప్రత్యేక అస్తిత్వానికి ప్రతీకగా కూడా భావించవచ్చు. ఇక పల్లెల్లో మూలాలు కలిగి అక్కడే తమ బాల్యం గడిపిన వారు పల్లెతో గల అనుబంధాన్ని జీవితాంతం మరచిపోరు. ‘ఊరు బంధం’, ‘ఆ పల్లె జాడ ఏడ’? ఈ రెండు కవితల్లో వస్తువు అదే. ‘ఊరు బంధం’ కవితలో ఊరి గురించి చెబుతూ “ఊరంటే ఉట్టి మట్టి కాదు / మట్టీ, మనిషీ ఉత్పత్తీ / ఊరంటే జనజీవన తంత్రం / సూర్యునితో కలెదిర్గె శ్రమయంత్రం? మనిషికి ఊరు చిరునామా / ఊరు బంధాల సంబంధాల కల్నేత / ఊరు ఊర పిశికెలు అల్లుకున్న గూడు / ఊటబాయిల ఊరే తేట నీరు? ఊరంటే చెట్లు పనిముట్ల స్నేహం / మనిషిని ఎనిషి పట్టించుకునే ఆరాటం! ? ఊరు సబ్బండ జాతుల సంస్కృతి / మనిషి ప్రకృతితో జతకట్టే నియతి!” ఇలా ఈ కవిత మొత్తం పల్లె జీవనం ఎలా ప్రకృతికి దగ్గరగా ఉంటూ, కాల నియమాలను పాటిస్తూ, ఆధునికతకు దూరంగా, మనిషితనానికి దగ్గరగా ఉండేదో చాలా ఆప్యాయంగా? అబ్బురంగా చెప్తారు. అయితే అది ఒకప్పటి మాట. ఏ మాత్రం లాభసాటిగా లేని వ్యవసాయం, మంచి బడులు, కాలేజీలు, మౌలిక సదుపాయాలు కరువై, యువతకి ఉపాధి కల్పించలేని పల్లెల పరిస్థితులు, యువతని, కుటుంబాలని పల్లె నుండి పట్నాలకు, నగరాలకు వలస పంపాయి. ‘ఆ పల్లె జాడ ఏడ’ కవితలో నేటి పల్లెల దుస్థితి పట్ల బాధ, తన బాల్యం నాటి పరిస్థితి ఇప్పుడు పల్లెల్లో లేదన్న ఆవేదన వ్యక్తపరుస్తారు.“పల్లె రా బిడ్డా అని చేతులు జాపి అవ్వోలె పావురంగా పిలిచేది / కాళ్ళకి నీళ్ళిచ్చి పల్కరిచ్చి / గుడ్లనీరు ఊరంగ తడిమేది? / ఇదేంది గిప్పుడు గా పల్లెలు వన్నె దప్పి మాసిపోయినయి / ఊల్లె మన్సులు కానరాక / సడీసప్పుడు లేక బావురుమంటానయి? బుగులుగమ్మి మనాది పట్టిన దేశం నా పల్లె జాడ ఏదనో జెప్పుండ్రని నోరార్సుకుపోంగ అడుగుతాంది” అంటారు.
కొంతకాలం క్రితం, చిన్నారి పాప శ్రీహితపై జరిగిన హత్యాచారంపై ఒక మనసున్న మనిషిగా స్పందిస్తూ, మానవత్వం కరువైన సమాజాన్ని నిందిస్తూ రాసిన కవితలు ‘అంతా అయిపోయింది పాపా’, ‘చిన్నారీ’.
“మేము నిర్లజ్జగా ఒప్పుకుంటున్నం / ముసుగేసుకున్న శవాలమని / పట్టించుకోనితనం అనే పాపిష్టి రోగం సోకిన రోగులమని” అంటూ ఎవరికి ఏమైనా తమకేమీ పట్టనట్టు ఉండే నేటి సమాజపు స్పందనా రాహిత్యాన్ని పదునైన మాటలలో వ్యక్తీకరిస్తారు.‘నల్లకలువల కొలను’ ఈ సంపుటిలో ఈ కవిత ఒక విశిష్టమైన కవిత!
“ఏడు గుర్రాల స్వారీ చెయ్యగల నల్ల సూర్యుళ్ళు మా తల్లులు / వెన్నునంటిన దొక్కలతో / వంగి నాట్లు వేస్తున్న దైన్యాలు” అంటూ మొదలవుతుంది ఈ కవిత! సాధారణంగా పురుషులనే సూర్యుడితో పోలుస్తారు. ఇక్కడ తల్లులని నల్ల సూర్యుళ్ళతో పోల్చటం కవి భిన్న దృక్పథానికి ప్రతీక.“ఊచకోతలకు రాలిన రక్తపుష్పాలు / తిరుగుబాట్లను దున్నిన రక్తక్షేత్రాలు / ఆధిపత్యాలను అడ్డుకున్న సవాళ్ళు / పోటెత్తిన బహుజన సాగరాలు / అగ్ని కొలనుల్లోని నల్లకలువలు” అంటారు. అంటే బహుజన అస్తిత్వం, బహుజన పోరాటంపై ఒక స్పష్టమైన వైఖరితో, శక్తివంతమైన రాజకీయ చైతన్యంతో రాసిన కవితగా దీనిని చెప్పొచ్చు.“పాలనాధికారమే చివరి తాళం చెవి / అది గుర్తిస్తేనే దక్కేది రాజ్యాధికారపు నిధి” అంటూ బహుజనుల రాజ్యాధికార కాంక్షకి మద్దతు ప్రకటిస్తారు. ఇక్కడ నల్ల కలువలు అంటే స్త్రీలు అనే కాకుండా, బహుజన సమూహం మొత్తాన్ని సంబోధిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆర్యుల ఆధిపత్య భావజాలంపై తిరుగుబాటు ప్రకటిస్తూ, “దగాపడ్డ జనగీతం చైతన్యమై పడగెత్తుతుంది / ఇక తిరుగు వలస పట్టండిరా” అని హెచ్చరికతో ముగుస్తుంది ఈ కవిత. ‘పండగొచ్చిందని’ కవిత మరియు ‘పంటకారుల ఉగాది’ కూడా బహుజన అస్తిత్వంతో రాసిన కవితలే. ‘ఏ దేవుడు రాసిండు’ కవిత పెట్టుబడిదారీ వ్యవస్థలో నలిగిపోతున్న బడుగు బతుకుల గురించి తీవ్రమైన ఆగ్రహ స్వరంతో “ఈ పతనానికి కారణమెవ్వరు / ఈ నాశనానికి మూలం ఎక్కడ? వ్యాపార మృగాలు ఏలుతున్న ఈ కబేళా వ్యవస్థలో మతి తప్పనోళ్ళు ఉంటారా” అని ప్రశ్నిస్తారు. రాయబడని కావ్యం కూడా అణచబడ్డ అస్తిత్వ ఆక్రోశమే! “రాస్తూ రాస్తూ ఉండగానే నా కావ్యం అపహరణకు గురయ్యింది / అలుక్కుపోయిన అక్షరాలు కనిపించకుండా ఎలబారిపోయాయి / సిరాలేని ఖాళీ కలంలో డొల్లడొల్లగా భావగీతం కాగితపు పడవలా తేలిపోతూ రాస్తుండగానే



మునిగిపోయిన నా కావ్యం!” అంటారు. “పుట్టక ముందే నా కవితను కానరాకుండా కబళిస్తుంటే / రక్తపుటేరై పారుతూ నేను / రక్తపుష్పమై తేలుతూ కావ్యం అని రాయబడని కావ్యం” గురించి ఆర్ద్రంగా రాస్తారు.
కవులు, భావుకులు నిత్యం అంతర్ముఖులై ఆత్మ పరిశీలన, ఆత్మాన్వేషణ చేస్తూ ఉంటారు. దానికి మౌనమే మొదటి మెట్టు! అలాంటి కవితే ‘మౌనంలోకి ప్రవహిస్తూ?’ ‘మౌనంతో ప్రేమలో పడినప్పుడల్లా నేనో నిశ్శబ్ద ప్రవాహంలా మారిపోతుంటాను / బ్రతుకు రుచిని తెలుసుకునేందుకు / మౌనంగా మృత్యువును పరామర్శిస్తుండాలి / అప్పుడప్పుడూ మౌనం వైద్యంలా మనలోకి ఆర్ద్రంగా ప్రవహిస్తుండాలి”.
‘ఎచటకి పోతానీ కాలం’ కవిత ఒక వేదనాభరిత స్వరం! “కాలనియమాలు లేని కర్కశత్వాలకి దేహగాయాల సలపరింతలు? మనిషితనం తోడుండే మందేది” అని ప్రశ్నిస్తారు. “జీవితం కోల్పోయిన తనం / నా ఉసురుల పొగమంచు సెగల్లో / ఊపిరాడక కొల్లగొట్టుకుపోతూ / గాలానికి చిక్కిన చేపను / ఎచటికి పోతానీ కాలం” అని దీనంగా అడుగుతారు. ‘నదిలా సాగాల్సిన జీవితం’ కవితలో కూడా “ఊపిరాడక బందబారిన చెరసాలలో / ఉరికొయ్యకు వేళ్ళాడే స్వప్న శిలను / శిల్పంగా నన్ను చెక్కుకోలేని ఉలిని” అంటారు నిస్పృహ నిండిన స్వరంతో?
మన పయనంలో వరుసగా పరాజయాలు ఎదురవుతున్నప్పుడు, మనం నమ్మిన విలువల పట్ల, మనం ఎంచుకున్న బాట పట్ల సంశయం కలగటం సహజం! అలాంటి ఒక సందర్భమే “కలమా? కత్తా? ఏది మనం పట్టాల్సింది అనే సందేహం!
“అనుకోని ఆయుధం ఒకటి / కలం గుండెల్లో కెలికి గాయం చేసి మీసాలు మెలేస్తుంది / మెదళ్ళలో కదలికలు తెచ్చే కలం / మెడలను తెగ్గోస్తే కత్తి. శక్తివంతమైనదేదో?? విలువల పువ్వులన్నీ / కొమ్మల నుండి దూకి ఆత్మహత్యలు చేసుకుంటాయి / చీకటితో ఓడిన చిరుదీపాలు లొంగిపోయి ఆరిపోతాయి? మరణ శాసనాలు ఉక్కుపాదాల కింద / సగం జీవంతో, సగం శవంలా మానవ హక్కులు! / కలమా, కత్తా, ఏది మనం పట్టాల్సింది?!”
“ఆశ్ నిరాశ్ కే దో రంగోంసే దునియా తూనే బనాయి? నయ్యా సంగ్ తూఫాన్ బనాయా మిలన్ కె సాత్ జుదాయి” అన్న ఒక ప్రముఖ కవి షకీల్ బధాయునీ హిందీ సినీ గీతంలో పంక్తులు గుర్తుకు వచ్చాయి ఈ సంపుటిలోని కవితలు చదివాక. ఈ కవితల్లో కూడా, నిరాశతో, నిర్వేదంతో కూడిన క్షణాలు, మనసుతో, శరీరంతో, పరిస్థితులతో అంతర్యుద్ధం చేసి మళ్ళీ ఆశని, శక్తిని, పోరాట పటిమని కూడగట్టుకుని సానుకూల దృక్పథంతో, కొత్త ఉత్సాహంతో చురుకుగా అడుగులు వేసే సందర్భాన్ని చూస్తాం.ఆశ, నిరాశల యుద్ధంలో, ఈ అంతర్మథనంలో గెలిచిందెవరో అని సహజంగానే మనకు సందేహం కలగవచ్చు. దానికి సమాధానం ఈ సంపుటిలోని రెండు కవితలు? మొదటిది “ఏదో ఒక రోజు” అన్న కవిత! “గుప్పెడంత గుండె నుండి శిశిరాన్ని తరిమేస్తాను / తవుటం బెట్టిన తోటలా నిరీక్షిస్తూ ఉగాది అడుగుల చప్పుడు కలను కంటాను / శుభసూచకం, జయహో అంటూ మేల్కొని ఏదో ఒక రోజు అన్న ఆలాపనతో ఆనంద గీతమౌతాను” అని గొప్ప ఆశావహ దృక్పథంతో నిరాశని తరిమికొడతారు. ఇక ఈ కవితా సంపుటి వెనుక కవర్ పేజీ మీద ఉన్న ‘అంతర్గానం’ కవితా పంక్తులలో మనకు ఇంకా స్పష్టమైన సమాధానం దొరుకుతుంది. “నేనిప్పుడు నా మనో దేహాల బూజుల్ని దులపరించుకుని మనిషిని కావాలి / కవినై, గాయకినై, శిల్పినై కొత్తగా నవజాత శిశువులా ఆవిష్కృతం కావాలి! ఆ స్వప్నాలు స్వప్న శిలలై మాసిపోకుండా / వసంత కాల మేఘ గర్జనలతో కలిసి / కాకలీ కాంతి స్వనాల వానగా కురుస్తూ / కోకిలల కోసం చిగురుటుయ్యాలలు కట్టాలి” అంటూ సమాజంపై గొప్ప ప్రేమతో, కొత్త ఉత్సాహంతో, భవిష్యత్తు పట్ల ఆశాభావంతో ‘రేపు’ని ఆహ్వానిస్తారు. పడకుండా ఉండడం గొప్ప కాదు, పడ్డాక అలాగే ఉండిపోకుండా ప్రయత్నంతో తిరిగి లేచి పరుగు తియ్యటమే గొప్ప అని పెద్దలు అంటారు. ఆ పోరాట స్ఫూర్తికి, ఆశావహ దృక్పథానికి ప్రత్యక్ష నిదర్శనం ఈ సంపుటిలోని చాలా కవితలు!

# పట్టించుకునే వారెవరు? అజమాయిషి ఎవరిది?

- బీసీస్టడీసర్కిల్‌పై జిల్లా అధికారి నియంత్రణ కరవు
- మూడేళ్లలో పట్టుమని పదిసార్లు కూడా కన్నెత్తి చూడని వైనం




**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వెనుకబడిన తరగతుల కు చెందిన నిరుద్యోగుల పాలిట వరంగా ఏర్పాటుచేసిన బీసీ స్టడీ సర్కిల్ పై పర్యవేక్షణ పూర్తి స్థాయిలో కొరవడినట్లు కనిపిస్తోంది. దీంతో సరి సర్కిల్ భారం మొత్తం కాంట్రాక్టు పద్ధతిలో డైరెక్టర్ గా పనిచేస్తున్న శ్రీలత పైనే పడుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ తో పాటు, ఎస్సీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎస్సీ స్టడీ సర్కిల్ సైతం ఏర్పాటు చేసింది. అయితే ఈ రెండు స్టడీ సర్కిళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ వీటిలో పాలన విధానం మాత్రం వేరువేరుగా ఉంది. దానికి కారణం ఏమిటో మాత్రం ఎవరికీ అంతుపట్టడం లేదు.

అంతా స్టడీ సర్కిల్ డైరెక్టరే..!

బీసీ స్టడీ సర్కిల్ లో పాలనా విధానం జిల్లాలో ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎస్సీ స్టడీ సర్కిల్ లో హానరరీ డైరెక్టర్ ఉన్నప్పటికీ స్టడీ సర్కిల్ లో జరిగే ప్రతి అంశంపై జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. ఆ అధికారి నోటిపై చేసిన తర్వాతనే ఏ ఫైల్ అయినా కదులుతుంది. బీసీ స్టడీ సర్కిల్లో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఈ స్టడీ సర్కిల్ వైపు కన్నెత్తి అయినా చూడడం లేదు. గత మూడేళ్ల కాలంలో పట్టుమని పదిసార్లు అయినా స్టడీ సర్కిల్ ను అధికారికంగా సందర్శించ లేదంటే అతిశయోక్తి కాదు. స్టడీ సర్కిల్ సందర్శించిన రోజులు అతి స్వల్పంగా ఉన్నాయి. వాటిలోనూ జిల్లా కలెక్టర్, జెసి వంటి అధికారులు వచ్చిన సందర్భంలోనే జిల్లా బీసీ అధికారి స్టడీ సర్కిల్ కు వచ్చినట్లు తెలిసింది. ఇక్కడ విచిత్రం ఏమిటంటే ఎస్సీ స్టడీ సర్కిల్లో నిరుద్యోగుల శిక్షణకు సంబంధించి ఎలాంటి పత్రిక ప్రకటన ఇవ్వాలన్న, ప్రచారం చేయాలన్న జిల్లా అధికారి ప్రమేయంతో ఉంటుంది. బీసీ స్టడీ సర్కిల్ లో మాత్రం ఈ నిబంధన కనిపించడం లేదు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ నేరుగా పత్రికా ప్రకటన ఇవ్వడం, ప్రచారం చేయడం వంటివి చేస్తున్నారు. ఒక ఇనిస్టూషన్ను నియంత్రించే అధికారి సుదీర్ఘకాలం ఒకే దగ్గర పని చేస్తే ఇలాంటి పరిణామాలే చోటు చేసుకుంటాయి అనడానికి ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్ ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. దీనిపై జిల్లా కలెక్టర్, బీసీ అభివృద్ధి శాఖ రాష్ట్ర అధికారులు స్పందించి స్టడీ సర్కిల్ పాలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# విలీన గ్రామాల నుంచి నల్లా కనెక్షన్ వసూళ్లు సరికాదు

- దబ్బులు వసూలు చేయడం అన్యాయం
- కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద 147 కోట్ల నిధులను మంచినీటి సరఫరా కోసం మంజూరు చేసింది.
- విలీన గ్రామాల డివిజన్ కు ఒక ట్రాక్టర్ ను మంజూరు చేయండి.
- కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):** కరీంనగర్ నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలకు సంబంధించిన డివిజన్లో ప్రజల నుండి కొత్తగా ఆన్లైన్ పేరిట ట్యాప్ కలెక్షన్స్ కు డబ్బులు వసూలు చేయడం అన్యాయమని, గతంలో గ్రామపంచాయతీ సమయంలో ప్రజలు నల్ల కనెక్షన్ తీసుకున్న కూడా ఇప్పుడు ఆన్లైన్ పేరుతో డబ్బులు వసూలు చేయడం సరికాదని, విలీన ప్రజలకు ఆర్థిక భారంగా మారిన ఈ నిర్ణయాన్ని విరమించుకొని, నూతనంగా మంచినీళ్ల కనెక్షన్ కోసం అప్లై చేసుకున్న వారికే ఆన్లైన్ చార్జీలు వసూలు చేయాలని బిజెపి ఒకటో డివిజన్ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ మంగళవారం రోజున జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. అలాగే నగరపాలక సంస్థలో ఇప్పుడు కొనుగోలు చేసే క్రొత్త ట్రాక్టర్ల లో విలీన గ్రామాల డివిజన్లకు ఒక్క ట్రాక్టర్ కేటాయించాలని కోరారు. గత ఎనిమిది నెలల నుండి కొత్తగా వేసిన కరెంటు పోల్స్ కు కొత్త లైట్స్ నగరపాలక సంస్థ నుండి రావడంలేదని, ఇట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కుక్కల బెడదతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , ప్రమాదాలకు గురి అవుతున్నారని కుక్కల బెడద లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం విలీన గ్రామాలకు అమృత్ పథకం ద్వారా 147 కోట్ల నిధులను మంచినీటి అవసరాల కోసం మంజూరు చేయడం జరిగిందని, ఇట్టి మంజూరు చేసిన నిధులతో విలీన గ్రామాలలో కొత్తగా వాటర్ ట్యాంకర్స్, ప్రతి వీధులలో కొత్త పైప్ లైన్లు త్వరగా ప్రారంభించి పనులను పూర్తి చేయించడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే డివిజన్లో మురికి కాలువల, సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఒకటో డివిజన్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నల్లవజ్రం జాతీయస్థాయి పురస్కారం




**అందుకున్న కనకం రమణయ్య..**

**గోదావరిఖని, జనంసాక్షి :**జాతీయస్థాయి జానపద గాయకులు, నృత్య కళాకారులు, గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు, జీడీకే. ఓసీపీ–త్రీలో ఈ.పీ.ఫిట్టర్‌గా పనిచేస్తున్న కనకం రమణయ్య ఈనెల 10,11 తేదీలలో తారా ఆర్ట్స్ అకాడమీ హైదరాబాదు వారు ఎన్టీపీసీలో నిర్వహించిన జాతీయస్థాయి కళోత్సవాలలో కనకం రమణయ్య నల్లవజ్రం జాతీయస్థాయి కీర్తి పురస్కార్‌ను సంస్థ అధ్యక్షులు సంకె రాజేష్, ఏసీపీ ప్రతాప్‌రాజు, టీవీ, సినీ నటులు లోహిత్‌కుమార్, సాగర్, సినీ గాయకులు ప్రణయ్‌కుమార్ తదితరుల చేతులమీదుగా అందుకున్నారు.కనకం రమణయ్య గత 30 సంవత్సరాలుగా కళా రంగంలో రాణిస్తూ ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలలో బహుమతులను అందుకున్నాడు.సింగరేణి జయంతి వేడుకలు రక్షణ నాటికలు ఆరోగ్యమే మహాభాగ్యము పర్యావరణ పరిరక్షణ టెలి ఫిల్ములు మొదలగు కార్యక్రమాలలో పాల్గొని కార్మికులను చైతన్యపరిచినాడు .కోల్ ఇండియా కల్చరల్ పోటీలలో మూడుసార్లు జానపద బృంద నృత్యంలో పాల్గొని బంగారు పతకాలను సాధించినాడు.గత కొన్ని సంవత్సరాలుగా గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షునిగా పనిచేస్తూ ప్రపంచ సంగీత దినోత్సవం వేడుకలు జానపద దినోత్సవ వేడుకలు నృత్య దినోత్సవం నా టక రంగ దినోత్సవం మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినాడు. తెలంగాణ ప్రభుత్వము భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నాలుగుసార్లు పౌరాణిక యక్షగాన శాస్త్రీయ జానపద కళోత్సవాలను ఘనంగా నిర్వహించి ఎంతోమంది ప్రతిభగల కళాకారులను అవార్డులతో సత్కరించినాడు. 2009వ సంవత్సరంలో మలేషియా తెలుగు సంఘం వారి పిలుపుమేరకు మలేషియాలో దీపావళి సంబరాలు అనే కార్యక్రమంలో కూడా పాల్గొని తన ప్రదర్శనలు ఇచ్చినాడు.కనకం రమణయ్య ఇన్ని సంవత్సరాలుగా చేస్తున్న కళాసేవను గుర్తించి తారా ఆర్ట్స్‌అకాడమీ వారు ఈ యొక్క అవార్డుతో సన్మానించినందులకు తారా ఆర్ట్స్‌అకాడమీ సెలక్షన్ కమిటీకి మరియు వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్ గారికి కనకం రమణయ్య ధన్యవాదాలు తెలియజేసినారు.రమణయ్యకు ఈ పురస్కార్ రావడం పట్ల కళాకారులు సిరిపురం శ్రీనివాస్ మేకప్ అంజన్న బోడకుంట వెంకట్రాం నాగుల శ్రీనివాస్ గద్దల శశిభూషణ్ ఎల్ వెంకటేశ్వరరావు మొదలగువారి తోపాటు సింగరేణి అధికారులు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## పూర్వ జీఎం శ్రీనివాస్‌ను సన్మానించిన ఏఐటీయూసీ నాయకులు

**గోదావరిఖని, జనంసాక్షి :**సింగరేణి ఆర్‌జీ–వన్ ఏరియా పూర్వ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కార్పోరేట్‌కు సేఫ్టీ జనరల్ మేనేజర్‌గా అయిన సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్‌జీ–వన్ బ్రాంచి ఆద్వర్యంలో శాలువా కప్పి, పూల బోకె అందించి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీనివాస్, ఎస్ వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు తో పాటు ఆయా గనుల పిట్ కార్యదర్శులు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణి వ్యాప్తంగా కార్మిక నేత జనక్‌ప్రసాద్ జన్మదిన వేడుకలు..

**గోదావరిఖని, జనంసాక్షి :**సింగరేణి వ్యాప్తంగా కార్మిక నేత జనక్‌ప్రసాద్ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్మిక నేత, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున సేవా కార్యక్ర మాలు నిర్వహించారు.1953లో ఖమ్మంలో పుట్టి మందమర్రి, గోదావరిఖని ప్రాంతంలో నాలుగున్నర దశాబ్దాలుగా పారిశ్రామిక ప్రాంతంలో కార్మిక హక్కుల కోసం పోరాడుతూ ఐఎన్‌టీయూసీ జాతీయ కార్మిక నేతగా ఎదిగారు.1978లో సింగరేణిలో సామాన్య క్లర్క్‌గా ప్రస్థానం మొదలుపెట్టి సిక్కా స్థాపించి, అనంతరం 19 క్రాఫ్ట్ సంఘాలను ఏకం చేస్తూ సాజాక్‌ను ఏర్పాటు చేసి,జాతీయ కార్మిక సంఘాలకు ధీటుగా యాజమాన్యంతో అగ్రిమెంట్ చేసే పరిస్థితి తీసుకొచ్చారు.ఉమ్మడి ఏపీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా మూడేళ్లు , అదిలాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శిగా పదవులు నిర్వహించడమే కాకుండా అప్పటి దేశ ప్రధాని రాజీవ్‌గాంధీతో సన్నిహిత సంబంధం ఉండేది. 1980 నుంచి వైఎస్‌ఆర్‌తో ఉంటూ వైఎస్‌ఆర్ నమ్మిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు.1995లో వేజ్ బోర్డు కోసం జరిగిన పోరాటంలో సమ్మె



చేసి రెండు రోజుల పాటు వరంగల్ జైల్ ఉన్నారు. సింగరేణి బీఎఫ్ఐఆర్‌కు వెళ్ళినప్పుడు ప్రధానమంత్రితో మాట్లాడి 400 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాన్ని సింగరేణికి ఇప్పించి అనేక వేల మంది కార్మికుల ఉద్యోగాలు కాపాడిన ఘనత జనక్ ప్రసాద్‌ది. జేబీసీసీఐ పర్మనెంట్ వేజ్‌బోర్డ్ సభ్యులుగా ఎన్నికై కార్మికుల కోసం 19శాతం ఇంక్రిమెంట్ రావడంలో కృషి చేశారురాష్ట్రంలో ఉన్న కోటి పది లక్షల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు వేతన సవరణ కోసం వేచి చూస్తున్న తరుణంలో కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే జనప్రసాద్‌కు ఈ పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.సింగరేణి కార్మిక వర్గం నుండి రాష్ట్రంలో ఉన్న కోటి పది లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పక్షాన వారికి జన్మదిన శుభాకాంక్షలు.

# రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణలకు ఊరట

## ధిక్కరణ కేసును మూసేసిన సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**యోగా గురు రామ్‌దేవ్ బాబా కు భారీ ఊరట లభించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలను రూపొందించారని పతంజలి ఆయుర్వేద్ ఎండీ ఆచార్య బాలకృష్ణ, యోగా గురు బాబా రామ్‌దేవ్‌లపై నమోదైన ధిక్కరణ కేసును సుప్రీంకోర్టు మూసివేసింది. ఈ ప్రకటనలకు సంబంధించి రామ్ దేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని కోర్టుకు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. కొవిడ్ వ్యాక్సినేషన్, అల్లోపతికి వ్యతిరేకంగా పతంజలి ప్రచారం చేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ హిమా కోహ్లీ, అమానుల్లాతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పంతజలిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆరోపించిన తప్పుదోవ పట్టించే ప్రకటనలను పతంజలి ప్రింట్ మీడియాలో ప్రచురించింది. జనవరి 3, 2024న జరిగిన విచారణలో పతంజలిపై ధిక్కార చర్య తీసుకున్నందుకు బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ధిక్కార నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో.. ఇద్దరిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు కోరారు. ఆ క్షమాపణలను కోర్టు తిరస్కరించింది. తప్పుడు ప్రకటనలపై క్షమాపణలు కోరుతూ పత్రికల్లో యాడ్స్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మళ్లీ 7న విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పతంజలిని మందలించింది. ఆ తర్వాత విచారణలో బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు వ్యక్తిగత హాజరు నుంచి సర్వోన్నత న్యాయస్థానం మినహాయింపును ఇచ్చింది. అనంతరం మే 14న తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం.. నేడు తీర్పు వెలువరించింది. కోర్టు ధిక్కరణ కేసును ముగిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా న్యాయస్థానం హెచ్చరించింది.

# నిద్రలేచింది మొదలు.. పనిలో నిమగ్నమవ్వాలి

- ఏ గ్రామ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండాలి
- వ్యవసాయశాఖ ఏఈవోలకూ ఇదే వర్తిస్తుంది
- ఖచ్చితంగా వారి పరిధిలోని క్లస్టర్లోనే ఉండి పనిచేయాలి
- వచ్చే సోమవారం నాటికి ఇది అమలుకావాలి
- గ్రామ కార్యదర్శులపై ఎంపీడీవోల పర్యవేక్షణ తప్పనిసరి
- వారి పనితీరును ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలి



**ఖమ్మం రూరల్, (జనంసాక్షి) :**
నిద్రలేచింది మొదలు.. పనిలో నిమ్మగమవ్వాలి.. ఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండి పనిచేయాలి. అప్పుడే గ్రామంలో నెలకొన్న సమస్యలు... స్థానిక స్థితిగతులపై పట్టుకలిగి ఉంటారు... పాలేరు నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పలు పంచాయతీ కార్యదర్శులపై ఫిర్యాదుల అందాయి... మొదటి తప్పుగా మందలించి వదిలేయడం జరుగుతుంది. ఇదే పునరావృతం అయితే ఊరుకునేది లేదు... వారికి ట్రాన్స్ ఫర్ అనేది ఉండదు... శాఖాపరమైన చర్యలకు పూనుకోవాల్సి ఉంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గ్రామ కార్యదర్శులను హెచ్చరించారు. అలాగే వ్యవసాయ శాఖ ఏఈవోలు కూడా వారు పనిచేసే క్లస్టర్ పరిధిలోనే నివాసం ఉండాలని సూచించారు. ఓ గ్రామంలో నివాసం ఉంటూ మరో గ్రామంలో లేదా వేరే మండలం నుంచి ఇంకో మండలంలోని ఏదైనా గ్రామంలో పనిచేసే వారు తక్షణమే వారు పనిచేసే గ్రామాలకు నివాసం వెళ్లాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా ఇది అమలు కావాలని డీపీవోకు సూచించారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఖరీఫ్ పంటల సాగు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత నియోజకవర్గంలోని మేజర్ గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శుల నుంచి ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశ అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీల్లో డైనమిక్గా పనిచేసే కార్య దర్శు లను నియ మిం చాలన్నారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా లాంటి మేజర్ గ్రామ పంచాయతీల్లో అవసరాన్ని బట్టి మరో పంచాయతీ కార్యదర్శిని కూడా నియమించాలని సూచించారు. రాబోవు ఏడాదిలోపు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్య తీరుతుందని... అత్యవసరమైనవి తన దృష్టికి తెస్తే తక్షణమే నిర్మాణం చేపట్టేలా చూస్తానని పేర్కొన్నారు. పలువురు సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి పాఠశాలలకు 200మీటర్ల లోపు కూడా మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చారని వాటి వివరాలను సేకరించి వారిపై చర్యలకు ఉపక్రమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**- ప్రజలను వేధిస్తే.... టార్గెట్ చేస్తా...**

ఎవరి పని వారు చేసుకుంటూ పోతే ఎవరిని మందలించనని... కానీ ఏదైనా పనికోసం ప్రజలు ఆయా గ్రామల్లో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది దగ్గరికి వచ్చినప్పుడు వారికి ఆ పనిచేయకుండా వారి దగ్గర ఏదైనా ఆశించి ఇబ్బందులకు గురిచేసినట్లు తన దృష్టికి వస్తే ఆ సిబ్బందిని కానీ ఆ అధికారిని కానీ ఖచ్చితంగా టార్గెట్ చేస్తానని హెచ్చరించారు. ఆయా గ్రామపంచాయతీ పరిధిలో వికలాంగుల, వృద్ధాప్య, వితంతు మొదలగు పెన్షన్ కు అర్హులైన వారిని గుర్తించాలని, అనర్హులకు ఒకరికి కూడా పెన్షన్ ఇవ్వొద్దని అన్నారు. అర్హులకు ఎంతమందికి ఇవ్వడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని పొరపాటున ఒక అనర్హుడికి ఇచ్చినా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆ అనర్హుడిని ఉదాహరిస్తూ అర్హత లేని వారు ఇంకెందరో పెన్షన్ తమకూ ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తారన్నారు. కావున వాటి మీద దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అంగన్ వాడీలు, ఆశావర్కర్లను సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ తన సొంత ఖర్చుతో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తానని త్వరలోనే అవి పూర్తవుతాయని తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడుతూ రైతు రుణమాఫీ ఎంతమందికి అందింది. ఇంకెంత మందికి అందాలనే జాబితాను రూపొందించాలన్నారు. అందనివారికి ఏ రిమార్క్ కింద అందలేదో అనేది కూడా చెప్పాలన్నారు. పామాయిల్ సాగు, ఖరీఫ్ పంటలపై దృష్టిసారించాలని సూచించారు. రైతు వేదికల వద్ద రైతు సోదరులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీపీవో, డీఎల్ పీవో, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, ఇతర శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్తపు మడుగులో పసి ప్రాణం..

**మానవత్వం మరిచి బ్రిడ్జిపై నుండి రాళ్లగుట్టపై పడేసిన గుర్తుతెలియని వ్యక్తులు**





**భద్రాచలం, ఆగష్టు 13 (జనంసాక్షి)**
భద్రాచలం పట్టణంలో ఉలిక్కిపడే ఘటన మంగళవారం చోటుచేసుకుంది.అప్పుడే పుట్టిన మగ శిశువును పాత బ్రిడ్జినుండి గోదావరి మధ్యలో ఉన్న రాళ్లగుట్టపై ప్లాస్టిక్ కవర్లో చుట్టి గుర్తు తెలియని వ్యక్తులు విసిరేశారు. సాయంత్రం 6 గంటల సమయంలో అటుగా పడవలో వెళుతున్న జాలరి ప్రసాద్ రక్తపు మడుగులో ఉన్న పసికందును చూసి, ఆందోళన చెంది ఈ విషయాన్ని పట్టణ పోలీసులకు సమాచారం తెలియజేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ విజయలక్ష్మి పసికందు మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించడం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తుంది. కాగా పసికందు మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవలు విస్తరించాలి..

**వంద మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసిన చేతన ఫౌండేషన్..**



**లక్ష్మీదేవిపల్లి ఆగష్టు 13 (జనంసాక్షి):**
'చేతన ఫౌండేషన్' దశాబ్ద కాలంగా చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్య క్రమాలు అభినందనీయమని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందమంది పాఠశాల పిల్లలకు రూ.25 వేల విలువచేసే స్కూల్ బ్యాగులను మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, వీరిని ఆదర్శనంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు స్వచ్ఛంద సేవాసంస్థలు, ఆర్థిక స్తోమత ఉన్న వ్యక్తులు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ సేవలు మారుమూల పల్లెలకు చేరే పరిస్థితి లేనప్పుడు సేవాసంస్థలు తోడ్పాటు ఒకింత ఆసరాగా నిలుస్తుందన్నారు. చేతన ఫౌండేషన్ సేవలను మరింతగా విస్తరించాలని, అందుకు సహరిస్తామని తెలిపారు. పదేళ్లుగా వరదాబాదుతులకు, వికలాంగులకు, పేద విద్యార్థులకు సహాయం అందించడంతోపాటు ఉచిత వైద్య శిబిరాలు, స్వయం ఉపాధికి సంహారం అందిస్తూ చేతన సంస్థ తమ సేవలకు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీపతి, దారా శ్రీను, కోడి లింగయ్య, కుంజా రాంబాబు, సేవాసంస్థ ఆర్గనైజర్లు ఎస్ కె రషీద్, రూప్లా నాయక్, రవి కుమార్, దాతలు భూక్యా రాంబాబు, దొబ్బల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కట్టడికి చర్యలు

**డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో కోర్టు ఉత్తర్వులు ప్రకారం సీజ్ చేసిన 1 కోటీ 41 లక్షల 25 వేల విలువ గల కేజీల గంజాయి దగ్ధం**

**జిల్లా యస్.పి శరత్ చంద్ర పవార్**



**నల్గొండటౌన్, ఆగష్టు 13(జనంసాక్షి):**
మాదక ద్రవ్యాల నిర్ములనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ గంజాయి రవాణా పైన జిల్లా పోలీసుల ఉక్కుపాదం మోపడం తో పాటు అక్రమ గంజాయి నివారణ పైన నిరంతర నిఘా పెడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలలో 43 కేసులలో 565 కేజీల గంజాయిని సీజ్ చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిర్మానుషంగా జనావసానికి దూరంగా ఉన్నటువంటి నార్కట్ పల్లి మండలం గుమ్మల బావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ నందు నేడు జిల్లా యస్.పి, డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో నిర్వీర్యం చేయడం జరిగింది.ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు అక్రమ గంజాయి సరఫరా చేయు వారి పైన ప్రత్యేక నిఘా పెడుతూ అత్యధికంగా విజయపురి పోలీసు స్టేషన్ పరిదిలో 2 కేసులలో 323 కేజీలు, కేతపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 98 కేజీలు సీజ్ చేయగా మొత్తం 43 కేసులలో 565 కిలోల గంజాయిని సీజ్ చేసి నిర్వీర్యం చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లా పరిధిలో అక్రమ గంజాయి, డ్రగ్స్ రవాణా మరియు వినియోగం అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నమని మత్తు పదార్థాల రవాణా మీద ఎన్నొ దాడులు నిర్వహిస్తూ, ఎంతో మందిని అరెస్టు చేసి జైలు పాలు చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.యువత డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలి యువత తెలిసి తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత యొక్క బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని అన్నారు. నిషేధిత డ్రగ్స్ వాడడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు,ఇతర నేరాలకు పాల్పడుతూ కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. నిషేధిత డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు.జిల్లాలో యువతలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పట్ల కళాశాలల్లో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల జీవితం నాశనం చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ఎవరైనా అక్రమ గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు అని,జిల్లా పోలీసులు నిరంతరం నిఘా ఉంటుంది అని అన్నారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 8712670266 కి సమాచారం తెలపాలని కోరారు.



## నిండుకుండలా మారిన పులిచింతల

**చింతలపాలెం (జనంసాక్షి) :**
సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలం, వజినేపల్లి గ్రామ పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు వారం రోజుల్లోనే నిండుకుండలా మారింది.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 33.80 టిఎంసిల నీటితో జలకలఉంది సంతరించుకుంది.విద్యుత్ కేంద్రానికి 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 169.22 అడుగుల వరకు నీరు ఉంది.

# యువత గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

## కలెక్టర్ నారాయణ రెడ్డి




**చిట్యాల ఆగస్ట్ 13(జనం సాక్షి):**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్ మహమ్మారి బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడానికి ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలి అని అన్నారు.గంజాయి డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడం లక్ష్యమన్నారు దీనికి అందరూ సహకరించాలన్నారు గంజాయి కి సంబంధించినటువంటి సమాచారమైన 87126 70266 నెంబర్ కు సమాచారం అందించాలన్నారు యువత విద్యార్థులను చైతన్యం చేస్తున్న డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ని అభినందించారు భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు దానికి జిల్లా యంత్రాంగం తరపున ఎల్లప్పుడూ సహకారం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మం పాటి శంకర్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్యఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు రమావత్ లక్ష్మణ్ నాయక్ బుడిగ వెంకటేష్ స్పందన పావని సంపత్ నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి

**ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ సి.నారాయణరెడ్డి**





**నల్లగొండ బ్యూరో, ఆగస్టు13, (జనంసాక్షి):**
ప్రభుత్వ ,ప్రైవేట్ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా వైద్యులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు.మంగళవారం ఆయన నల్గొండ జిల్లా మునుగోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్, టెస్టింగ్ రిపోర్ట్స్ ను పరిశీలించారు.వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రభలెందుకు అవకాశం ఉందని, అందువల్ల ఈ అంశంపై ఎక్కువ దృష్టి సారించాలని, ఎవరైనా జ్వరం,జలుబు,ఇతరత్రా వ్యాధులతో ఆసుపత్రికి వచ్చినట్లయితే తక్షణమే వారికి చికిత్స అందించాలని,సీజనల్ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి ప్రసవానికి వచ్చిన వారి వివరాలను,నమోదైన గర్భిణీ స్త్రీల వివరాలను ఆయన పరిశీలించారు.అంతేకాక ఫోన్ ద్వారా వారితో మాట్లాడి సాధారణ ప్రసవం జరిగిందా లేక సిజేరియన్ అయ్యిందా అని అడిగి తెలుసుకున్నారు.పి హెచ్ సి లో డాక్టర్లు,సిబ్బంది ఎలా చేసుకున్నారని అడిగారు.డాక్టర్ తో మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు ఆపరేషన్ లేకుండా సాధారణ ప్రసవాలు జరిగే విధంగా వైద్యులు కృషి చేయాలని అన్నారు. ఇందుకుగాను ముందుగానే ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎం, నర్సులు గర్భిణీ స్త్రీలను ముందు నుండి కౌన్సిలింగ్ చేయాలని,సాధారణ ప్రసవం జరిగేలా వారిని చైతన్యం చేయాలని అన్నారు.ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే ఆపరేషన్ తప్పనిసరిగా చేస్తారని,అలా కాకుండా వాటిని తగ్గించుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని సూచించాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగదిని,పరిసరాలను పరిశీలించారు.మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మోడల్ పాఠశాలగా ఎంపిక చేయడం జరిగిందని,మోడల్ పాఠశాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అంచనాలు రూపొందించి పంపించాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులను చదువుతోపాటు, క్రీడల పట్ల ప్రోత్సహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుదు, ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం దగ్గరలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు.ఈ వసతిగృహంలో రెండు గదులు తప్ప తక్కినవి శిథిలావస్థలో ఉండడం గమనించి తక్షణమే భవన మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని పంచాయతీరాజ్ ఈ ఈని ఆదేశించారు.అప్పటివరకు పక్కనే ఉన్న స్త్రీ శక్తి భవన్లోకి మార్చాలని తెలిపారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# అవయవ దానంతో నలుగురి జీవితాల్లో వెలుగు



**రామన్నపేట, ఆగష్టు 13, (జనంసాక్షి):**
రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి కుటుంబం అవయవాలు దానం చేయడానికి ముందుకు వచ్చింది. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రాస అశోక్ (39) గత మూడు రోజుల క్రితం కొత్త డీజే బాక్సులు తీసుకురావడానికి వాళ్ల బామ్మర్దులు ఇతను కలిసి హైదరాబాద్ కు వెళ్లారు. టాటా ఏసీ వాహనంలో బాక్సులు తీసుకుని వస్తున్న క్రమంలో మార్గమధ్యం గజ్వేల్ సమీపంలో స్పీడ్ బ్రేక్ వద్ద వాహనం వెనుక కూర్చుని ఉన్న ముగ్గురు ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా రాస అశోక్ కు తలకు తీవ్ర గాయం కావడంతో యశోద హాస్పిటల్ లో చేర్పించారు. బ్రెయిన్ డెడ్ అయి యశోద హాస్పిటల్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. అశోక్ మరణం ఊరికే పోకుండా మరో నలుగురి జీవితాలకు వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ భార్య, కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవదానం చేశారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. దుఃఖ శోకంలో ఉన్న కుటుంబం ముందుకు వచ్చి అవయవాల దానం కి సహకరించిన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ ప్రగాఢ సానుభూతి తెలిపి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హాస్పటల్ వారు అధికారిక లాంచనాలతో గౌరవ వందనం స్వీకరించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధర్ డైరీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి, డాక్టర్లు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



రాస అశోక్

# ఐ ఫోన్ 16 వచ్చేస్తోంది!



**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (జనంసాక్షి) :** మీరు ఆపిల్ ఐ-ఫోన్ సొంతం చేసుకోవాలని తలపోస్తున్నారా..? కొన్ని నెలలుగా ఐ-ఫోన్ 14, ఐ-ఫోన్ 13, ఐ-ఫోన్ 15 స్మార్ట్ ఫోన్లపై కొన్ని నెలలుగా ఆపిల్ పలు రకాల ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించింది. ఈ డిస్కౌంట్లు, ఆఫర్లు ఎంతో ఆకర్షణీయంగానూ ఉన్నాయి. రెగ్యులర్ ఫోన్ ధరతో పోలిస్తే రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకూ డిస్కౌంట్ లభిస్తోంది. త్వరలో ఐ-ఫోన్ 16 సిరీస్ ఫోన్లు మార్కెట్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో 2023, అంతకంటే పాత మోడల్ ఫోన్లపై డిస్కౌంట్లను స్మార్ట్ ఫోన్ ప్రేమికులు సొమ్ము చేసుకోవచ్చు. అయితే, పూర్తి స్థాయిలో డిస్కౌంట్లు అందుకోవాలంటే కొంతకాలం వేచి ఉండాల్సి రావచ్చు. ఫ్లిప్ కార్ట్ తోపాటు బ్యాంకు ఆఫర్లతో కలుపుకుని ఐ-ఫోన్ 15 ధర రూ.79,900 నుంచి రూ.63 వేలకు దిగి వచ్చింది. గత వారం రూ.44,600లకే అందుబాటులో ఉంది. ఇక గత నెలలో ఐ-ఫోన్ 14 ప్లస్ ఫోన్ బ్యాంకు ఆఫర్లతో కలుపుకుని రూ.54,999లకు లభించింది. దీనికి తోడు స్మార్ట్ ఫోన్ల ఉపకరణాలపై దిగుమతి సుంకం తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో ఐ-ఫోన్ 15 ప్రో మ్యాక్స్, ఐఫోన్ 15 ఇతర ఐ-ఫోన్లపై రూ.6,000 వరకూ ధర తగ్గించింది ఆపిల్. యూనియన్ బడ్జెట్ లో దిగుమతి సుంకం 20 నుంచి 15 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. తదనుగుణంగా ఆపిల్ తన ఐ-ఫోన్లపై 3-4 శాతం ధరలు తగ్గించింది. దీంతో ఐ-ఫోన్ 13 ఫోన్ రూ.59,900 నుంచి రూ.57,600, ఐ-పోన్ 14 రూ.69,900 నుంచి రూ.69,600, ఐ-ఫోన్ 14 ప్లస్ రూ.79,900 నుంచి రూ.79,600, ఐఫోన్ 15 ఫోన్ రూ.79,900 నుంచి రూ.79,600, ఐఫోన్ 15 ప్లస్ ఫోన్ రూ.89,900 నుంచి రూ.89,600లకు దిగి వచ్చాయి. ఇక ఐ-ఫోన్ 15 ప్రో ఫోన్ ధర రూ.1,34,900 నుంచి రూ.1,29,800 (రూ.5,100 ఆఫర్), ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ ధర రూ.1,59,900 నుంచి రూ.1,54,000 (రూ.5,900)లకు దిగి వచ్చాయి. వీటితోపాటు బ్యాంకు ఆఫర్లు, ఈకామర్స్ ప్లాట్ ఫామ్స్ డిస్కౌంట్లు అదనం.

## విపణి

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 407 | ₹ 49 |
| వరంగల్ | ₹ 407 | ₹49 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

₹70,310 (24 క్యారెట్లు) | ₹64,450 (22 క్యారెట్లు)

చెన్నై

₹64,450 (22 క్యారెట్లు) | ₹70,310 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 88,100

## కొత్తగా ఎయిరిండియా విమాన సర్వీసులు ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** టాటా సన్స్ అనుబంధ ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ దేశీయ విమాన ప్రయాణ నెట్‌వర్క్ బలోపేతం దిశగా అడుగులేస్తున్నది. కోల్‌కతా, చెన్నైలతోపాటు కొత్త రూట్లలో ఆరు రోజువారీ విమాన సర్వీసులు నడుపనున్నది. కోల్ కతా నుంచి రెండు, చెన్నై నుంచి మూడు, గువాహటి- జైపూర్ సెక్టార్ మధ్య ఒక విమాన సర్వీసు నడుపుతామని ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ మంగళవారం తెలిపింది. చెన్నై-భువనేశ్వర్, చెన్నై-బాగ్డోగ్రా, చెన్నై-తిరువనంతపురం, కోల్‌కతా- వారణాసి, కోల్‌కతా - గువాహటి, గువహాటి- జైపూర్‌లకు విమాన సర్వీసులు నడుపుతుంది. కోల్‌కతా - వారణాసి విమానం ఉదయం 7.40 గంటలకు టేకాఫ్ అవుతుంది. వారణాసికి 9.05 గంటలకు చేరుతుంది. తిరిగి 9.40 గంటలకు వారణాసిలో టేకాఫ్ అయి కోల్ కతాకు 11.10 గంటలకు చేరుతుంది. కోల్ కతా -గువాహటి విమాన సర్వీసు మధ్యాహ్నం 12.10 గంటలకు టేకాఫ్ అయి గువాహాటికి 1.25 గంటలకు చేరుతుంది. తిరిగి గువాహాటి నుంచి మధ్యాహ్నం 1.55 గంటలకు టేకాఫ్ అయి కోల్ కతాకు సాయంత్రం 4.35 గంటలకు చేరుతుంది. గువాహటి-జైపూర్ మధ్య ఎక్స్‌క్లూజివ్‌గా ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ కొత్త సర్వీసును ప్రారంభిస్తున్నది. చెన్నై - తిరువనం తపురం మధ్య వారంలో రెండు విమాన సర్వీసులు నిర్వహి స్తున్నప్పటికీ, డిమాండ్ పెరుగుతుండటంతో మరో సర్వీసు ప్రారంభిస్తోంది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ రోజువారీగా 82 విమానాలతో 380కి పైగా విమాన సర్వీసులు నిర్వహిస్తున్నది.

## రూ.73 వేలకు చేరువలో బంగారం..

- ఫ్లాట్‌గా వెండి ధరలు..!




**ముంబై, ఆగస్టు 13 (జనంసాక్షి) :** దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు తిరిగి పెరుగుతున్నాయి. మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.500 వృద్ధితో రూ.72,850లకు చేరుకున్నది. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా దేశీయ మార్కెట్లోనూ బంగారానికి డిమాండ్ పెరిగింది. సోమవారం 10 గ్రాముల బంగారం (24 క్యారట్స్) ధర రూ.72,350 వద్ద స్థిర పడింది. 99.5 స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.500 పెరిగి రూ.72,500 వద్ద నిలిచింది. రిటైలర్లు, జ్యువెల్లర్ల నుంచి డిమాండ్ పెరగడం వల్లే బంగారం ధర పెరుగుదలకు కారణం అని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు కిలో వెండి ధర మంగళవారం ఫ్లాట్ గా కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 1.30 డాలర్లు పెరిగి 2,502.70 డాలర్లకు చేరుకున్నది. పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తున్నందు వల్లే బంగారం ధర పెరుగుతున్నదని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడం దీనికి కారణం అని పేర్కొన్నారు. మరోవైపు యూఎస్ ట్రెజరీ బాండ్లు బలహీన పడటంతోపాటు వచ్చేనెల 18న జరిగే యూఎస్ ఫెడ్ రిజర్వ్ సమావేశంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి ధర దిగి వచ్చి 27.81 డాలర్లకు పరిమితమైంది.

NPCI
भारतीय राष्ट्रीय भुगतान निगम
NATIONAL PAYMENTS CORPORATION OF INDIA
BHIM
BHARAT INTERFACE FOR MONEY

## భీమ్ సీఈఓగా లలితా నటరాజ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 (జనంసాక్షి) :** డిజిటల్ పేమెంట్స్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకూ తనకు అనుబంధంగా పని చేస్తున్న యూపీఐ బేస్డ్ పేమెంట్ ఆప్ 'భారత్ ఇంటర్ ఫేస్ ఫర్ మనీ (భీమ్) ను విడదీస్తున్నట్లు ఎన్పీసీఐ తెలిపింది. రోజురోజుకు డిజిటల్ లావాదేవీలకు పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా భీమ్' యాప్‌ను ప్రత్యేక అనుబంధ సంస్థగా ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది.

భీమ్ యాప్‌కు ఎన్పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ గా పేరు పెట్టింది. ఈ భీమ్ యాప్ నిర్వహణ కోసం ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లలితా నటరాజ్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా నియమించింది. సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా రాహుల్ హండా వ్యవహరిస్తారు.

ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంకు లో డిజిటల్ పార్టనర్ షిప్స్, డిజిటల్ అక్విజిషన్స్ అండ్ పేమెంట్స్ విభాగం అధిపతిగా లలితా నటరాజ్ సేవలందించారు. ఇక రాహుల్ హండా తొలుత ఓఎన్డీసీలో పని చేశారు. గత మార్చిలో భీమ్ బిజినెస్ అధిపతిగా ఎన్పీసీఐలో చేరారు. దేశీయ యూపీఐ ఎకో సిస్టమ్‌లో గూగుల్ పే, వాల్‌మార్ట్ బ్యాక్డ్ ఫోన్‌పేతోపాటు పేటీఎం సంస్థలు ఆధిపత్యం ప్రదర్శిస్తున్న వేళ.. 'భీమ్' యాప్ ను విడిగా ఒక సంస్థగా ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే, కేవైసీ నిబంధనలను సరిగ్గా అమలు చేయకపోవడంతో ఆంక్షలు విధించడంతో ఇటీవల పేటీఎం మార్కెట్ వాటా పడిపోయింది.

యూపీఐ పేమెంట్స్ మార్కెట్ వాటా పెంచుకోవాలన్న లక్ష్యంతోనే ఎన్పీసీఐ.. భీమ్ యాప్ ను విడదీసి ఉండొచ్చునని భావిస్తున్నారు. నేషనల్ పేమెంట్స్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ)లో ఎన్పీసీఐ భీమ్ సర్వీసెస్ సంస్థ మూడో ప్రధాన సంస్థ కానున్నది. భారత్ ఆవల యూపీఐ లావాదేవీల నిర్వహణకు నేషనల్ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్), దేశీయంగా బిల్లు చెల్లింపుల ఎకో సిస్టమ్ కోసం నేషనల్ భారత్ బిల్ పే లిమిటెడ్ (ఎన్బీబీఎల్) సంస్థలను ఎన్పీసీఎల్ నిర్వహిస్తోంది.

## జాతీయం అంతర్జాతీయం

## ఎసిబి వలలో రంగారెడ్డి జాయింట్ కలెక్టర్



**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. ఆయనతో పాటు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపునకు జాయింట్ కలెక్టర్ రూ.8 లక్షల లంచం డిమాండ్ చేశారు. డబ్బును సీనియర్ అసిస్టెంట్ ద్వారా జేసీ తీసుకున్నారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి జేసీ, సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారు. మరోవైపు నాగోల్‌లోని జేసీ భూపాల్‌రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఇంటిలో రూ.16లక్షల నగదు, కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అన్నారు. జాయింట్ కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడానికి ఏసీబీ బృందం సోమవారం రాత్రి ఎంతో చాకచక్యంగా పని చేసిందని కొనియాడారు.

## ట్రైనీ వైద్యురాలి హత్యాచార కేసులో వెలుగులోకి షాకింగ్ విషయాలు

- ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రికి ఫోన్
- పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**కోల్‌కతా, ఆగస్ట్13 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ - హాస్పిటల్‌లో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో తాజాగా మరికొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. గురువారం రాత్రి హత్య జరగగా.. శుక్రవారం ఉదయం వైద్యురాలి తండ్రికి కాల్ చేసి సమాచారం అందించారు. అయితే కాల్ చేసిన వ్యక్తి 'మీ కూతురు ఆత్మహత్య చేసుకుంది' అని చెప్పాడంటూ వైద్యురాలి తండ్రి చెప్పారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చూడగా సెమినార్ హాల్‌లో సగం బట్టలు, గాయాలతో తన కూతురు నిర్జీవంగా ఉందని ఆయన వివరించారు. ఈ మేరకు పోలీసుల విచారణలో ఆయన వెల్లడించారు.'మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అంటూ ఫోన్ చేశారు. మీ కూతురు ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. ఆ తర్వాత మేము ఆసుపత్రికి చేరుకున్నపుడు వాస్తవం ఏంటో తెలుసుకున్నాం' అని మీడియాకు వెల్లడించారు. సదురు అధికారి తన పేరు చెప్పలేదని అని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ యాజమాన్యం అసలు విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. కాగా పోలీసు విచారణ ప్రకారం.. వైద్యురాలు గురువారం రాత్రి డ్యూటీలో ఉన్నారు. హత్యకు ముందు మరో నలుగురు తోటి వైద్యులతో కలిసి డిన్నర్ చేశారు. దీంతో ఆమెతో డిన్నర్ చేసిన వ్యక్తులతో కూడా మాట్లాడి మరిన్ని వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఆసుపత్రికి చేరుకున్న తర్వాత కూడా మృతదేహాన్ని చూసేందుకు అనుమతించలేదని వైద్యురాలి తల్లి మీడియాతో చెప్పారు. ' నా కూతుర్ని చూడనివ్వాలని వాళ్ల కాళ్ల మీద పడ్డాను. అయినా చూడనివ్వలేదు. మధ్యాహ్నం 2 గంటలకు నా కూతురిని చూసేందుకు అనుమతి ఇచ్చారు' ఆమె వాపోయారు. కాగా హత్యకు ముందు గురువారం రాత్రి వైద్యురా లు తన తల్లికి ఫోన్ చేసిందని, అన్నం తిని పడుకోమని చెప్పిందని కుటుంబ సభ్యులు చెప్పారు. అంతలోనే రాత్రి ఈ ఘోరం జరిగిపోయిందని వివరించారు. వచ్చే ఏడాది ఆమెకు పెళ్లి చేయాలనుకు న్నామని వివరించారు.

## మోడీ బినామీ ఆదానీ

- ఆదానిని కాపాడుతున్న మోడీ
- ఈ ప్రయత్నాలను క్షేత్రస్థాయిలో ఎండగడతాం
- పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల వెల్లడి



న్యూఢిల్లీ,ఆగస్ట13(ఆర్ఎన్ఎ): ఆదాని మోడీ గ్రూప్, ఆదాని మోడీ బినామీ అంటూ ఎపి పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యలు చేశారు. ఆదానిని కాపాడే విషయంలో మోడీ చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతాం అన్నారు. క్షేత్రస్థాయిలోకి మోడీ అవినీతిని తీసుకెళ్లేలా కార్యాచరణ ఉండబోతోందని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఎన్నికల సన్నద్ధత, సంస్థాగత విషయాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన వివిధ అంశాలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌లు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సమావేశం చర్చలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలపై జూన్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో రివ్యూ చేశారని వైఎస్ షర్మిల అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చ జరిగిందన్నారు. దేశ వ్యాప్త కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. సవివరంగా, ప్రజాస్వామ్య బద్ధంగా అందరి అభిప్రాయాలను గౌరవించే సంప్రదాయం ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే ఉందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో జరిగిన పరిణామాలపై చర్చ జరిగిందన్నారు. కులగణన అంశంపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ లేవనెత్తిందని తెలిపారు.


భారత రాజ్యాంగాన్ని బీజేపీ గౌరవించడం లేదని విమర్శించారు. బీజేపీ ఏకపక్ష నిర్ణయాలపై దేశ వ్యాప్త పోరాటాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ మైనారిటీల మనోభావాలను దెబ్బ తీసిందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ మీద బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. వక్ఫ్ చట్ట సవరణతో మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా చర్యలు తీసుకుందని వ్యాఖ్యలు చేశారు. సెబీ ఆదాని అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. సెబీని తన గుప్పెట్లో పెట్టుకొని ఆదానిని కాపాడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో రాజ్యాంగవ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. కులగణనపై గ్రామస్థాయిలో పోరాటాలు చేయబోతోందని తెలిపారు. అవినీతిరహిత పాలన అంటూ బీజేపీ గొప్పలు చెబుతోందని.. కానీ ఆదాని - మోడీల అవినీతిని రాహుల్ గాంధీ ఎప్పుడో ఎండగట్టారన్నారు.

## లంచం తీసుకోవాలంటేనే వణుకు పుట్టాలి

- ఎసిబి డిజి సివి ఆనంద్ ట్వీట్



**హైదరాబాద్, ఆగస్ట్13 (జనంసాక్షి) :** అవినీతికి పాల్పడే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని తెలంగాణ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. లంచం తీసుకుంటామనే ఆలోచన రాకుండా పని చేస్తున్నామని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా తెలియ చేయాలని అన్నారు. గత రాత్రి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కు చెందిన జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన విషయాన్ని షేర్ చేస్తూ ఎక్స్ ఖాతాలో సీవీ ఆనంద్ ట్వీట్ చేశారు. 14 గుంటల భూమిని ధరణి పోర్టల్‌లో నిషేధిత భూముల జాబితా నుండి తొలగించుటకుగాను సీనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుం టుండగా పట్టుబడ్డారు. తదుపరి ఆ మొ త్తాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందచేశారు. ఫిర్యాదుదారుని నుండి నగర శివార్లలో డబ్బు తీసుకోవటం.. ఆపై క్షణీక్షీ దగ్గర జాయింట్ కలెక్టర్‌కు అందేలా జాగ్రత్త తీసుకున్నప్పటికీ, ఎసిబి టీమ్ రాత్రంతా ఎంతో చాకచక్యంగా అప్పటికప్పుడు ప్రణాళికలు మార్పు చేసుకుంటూ ఇద్దరిని ట్రాప్ చేశారని సీవీ ఆనంద్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ధరణి వెబ్‌సైట్‌లోని నిషేధిత జాబితా నుంచి తన భూమిని తొలగించాలని జక్కిడి ముత్యంరెడ్డి అనే రైతు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డిని కోరారు. అయితే ఈ పనిచేసేందుకు ఆయన రూ.8 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో రైతు ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పథకం ప్రకారం.. ఆ మొత్తాన్ని సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి తీసుకుంటుండగా పట్టుకున్నారు. సీనియర్ అసిస్టెంట్‌ను అధికారులు విచారించగా జేసీ భూపాల్‌రెడ్డి చెబితేనే డబ్బులు తీసుకున్నానని అధికారులకు చెప్పారు.జేసీకి అతనితో ఫోన్ చేయించారు. పెద్దఅం బర్‌పేట ఓఆర్‌ఆర్ వద్దకు ఆ డబ్బును తీసుకురావాలని చెప్పాడు. దీంతో మదన్‌మోహన్‌తోపాటు అక్కడికి వెళ్లిన ఏసీబీ అధికారులు.. అతని నుంచి డబ్బులు తీసుకుని తన కారులో పెట్టుకుంటుండగా జేసీ భూపాల్ రెడ్డిని పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసిన అనంతరం.. ఇరువురి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో నాగోల్‌లోని భూపాల్ రెడ్డి ఇంట్లో రూ.16 లక్షల నగదు, కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.



## బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం

- పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు.
- తనను కలిసిన బాన్సువాడ నియోజకవర్గం పార్టీ శ్రేణులతో కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 13 (జనంసాక్షి) :** బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు నందినగర్ నివాసంలో కేటీఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడారు. పోచారం శ్రీనివాస్ రెడ్డినీ అన్ని రకాలుగా గౌరవించిన పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందన్నారు. ఐతే కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదని వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందని... మార్పు పేరుతో జనాన్ని ఏమారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బాన్సువాడ బై ఎన్నికల్లో కచ్చితంగా పోచారం ను ఓడిస్తామని చెప్పారు. త్వరలోనే ప్రశాంత్ రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులు సహా తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ వీడలేదని...బీఆర్ఎస్ కు కార్యకర్తలే కొండంత అండ అని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. బై ఎన్నికల్లో కచ్చితంగా పార్టీ మారిన వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెబుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గులాబీ జెండా మీద గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ వీడినా... గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బిఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని పార్టీ శ్రేణులు కేటీఆర్ కు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
14 ఆగష్టు 2024
తెలంగాణ

## చేపూర్ వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**ఆర్మూర్, ఆగస్టు 13(జనం సాక్షి):** ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో స్మశాన వాటిక తో పాటు ఆలయాలకి వెళ్లే వివాదాస్పద రోడ్డు స్థలాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం పరిశీలించారు.చేపూర్ గ్రామంలో స్మశాన వాటికకు చెందిన స్థలాన్ని విజయ్ అనే వ్యక్తి కబ్జా చేసి మొక్కజొన్న పంట వేశారని గ్రామస్తులు కొన్ని నెలల నుంచి ఆందోళన చేస్తున్నారు.జంబికి వెళ్లే ఆలయ రోడ్డును కబ్జా చేయడం వలన స్మశాన వాటిక రోడ్డు నుంచి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు కలెక్టర్ కు వివరించారు.మరోవైపు తన వ్యవసాయ భూమిలో పంట సాగు చేస్తున్నానని ఎలాంటి కబ్జా కు పాల్పడలేదని విజయ్ దంపతులు కలెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మరో మారు ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి ఆర్డిఓ ఇరుపక్షాల వాదనలు, విజ్ఞాపన పత్రాలు స్వీకరిస్తారని చెప్పారు.ఆయన వెంట ఆర్డిఓ రాజా గౌడ్, ఏసీపీ బస్వారెడ్డి, తహసిల్దార్ గజానన్, సీఐ రవికుమార్, ఆర్ ఐ అశోక్ సింగ్, మండల పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్, గ్రామ కార్యదర్శి హరీష్ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జనంసాక్షి):** సిఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సిఎంఆర్ డెలివరీ పై సివిల్ సప్లై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాసిల్దారులు రైస్ మిల్లును నిరంతరం పర్యవేక్షణ చేస్తూ డెలివరీ వేగవంతమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా డెలివరీ కాకపోతే రైస్ మిల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమీక్ష సమావేశంలో ఇంచార్జ్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానందం, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాసిల్దార్లు కిష్టయ్య, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

## సాలూర మండల యువ నాయకునికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పట్టం..

**●పార్టీ కోసం కృషి చేసిన చీల శంకర్ కు దక్కిన ఫలితం ● మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నమ్మిన బంటుగా గుర్తింపు**



**బోధన్, ఆగస్టు 13 ( జనంసాక్షి ) :** సాలూర మండలం హున్స గ్రామానికి చెందిన యువ నాయకుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడిగా సేవలందించిన మాజీ ఎంపీటీసీ చీల శంకర్ కు బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి అందించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం గత దశాబ్దాలుగా కృషి చేస్తున్న యువ నాయకుడికి మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సముచిత న్యాయం చేసినట్లు అధికార పార్టీ వర్గాలే కాకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం బహటంగా చెప్పుకోవడం విశేషం. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన చిన్న స్థాయి కార్యకర్త నడి పెద్ద స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరినీ తన మనసులో గుర్తుపెట్టుకొని వారికి న్యాయం చేసే దిశగా అడుగులు వేయడం ఆయనకే సాటి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. అయితే ఉమ్మడి బోధన్ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం యూత్ కాంగ్రెస్ నాయకుడిగా గుర్తింపు సాధించిన చీల శంకర్ కు పార్టీ అధిష్టానం ఎంపీటీసీ టికెట్ స్థానాన్ని అందించగా ఆ ఎన్నికలలో విజయం సాధించిన చీల శంకర్ హున్స ఎంపీటీసిగా ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులకు గట్టి పోటీ అందించడంతో పాటు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై ఆందోళన చేపట్టిన ఘనత సైతం చీల శంకర్ కు దక్కుతుంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి నమ్మిన బంటుగా గుర్తింపు సాధించడంతోపాటు ఆయన ఆదేశాలను బోధన్ ఉమ్మడి మండలాలలో తూచా పాటిస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రత్యేక దృష్టి సారించారని చెప్పవచ్చు. ప్రజా సమస్యల పరిష్కారంలో నేనున్నా అంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్య పరిష్కారం కోసం ఎందాకన్నా వెళ్లే నాయకుడిగా ఉమ్మడి బోధన్ మండలాల్లో గుర్తింపు సాధించిన వ్యక్తిగా చీల శంకర్ ప్రజల మన్ననలను అందుకున్నారు. బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేసులో ఎంతోమంది ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కోసం చీల శంకర్ చేసిన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే, మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి ఎట్టకేలకు బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా చీల శంకర్ కు అవకాశం కల్పించారు. ఏది ఏమైనా కిందిస్థాయి కార్యకర్త నుండి నేడు బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్థాయి వరకు ఎదిగిన చీల శంకర్ ను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఉన్నత పదవులను అందించడంలో బోధన్ ఎమ్మెల్యే, మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి చూపిన చొరవను ప్రతీ ఒక్కరూ కొనియాడుతున్నారు.

**సుదర్శన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటా బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్**

నాపై నమ్మకం ఉంచి బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియమించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని చీల శంకర్ లావణ్య దంపతులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలను పాటిస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చీల శంకర్ జనంసాక్షి తో తెలిపారు. ఆయన వెంట గంగజి శంకర్, నరేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, గడ్డం శ్రీను, ప్రకాష్, అశోక్, శివ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన బిజెపి నేతలు..



**తంగళ్ళపల్లి ఆగస్టు 13(జనం సాక్షి).** తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామం లోని గురుకుల పాఠశాల (కళాశాల) ను బిజెపి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో మండల బిజెపి నేతలు సందర్శించారు.ఈ సందర్భంగా గురుకులంలో ఉన్న సమస్యలను ఆరా తీశారు.పాఠశాలలో ఉన్న వసతులు భోజనం,కిచెన్ టాయిలెట్స్,సదుపాయాలను పరిశీలించారు.పారిశుద్ధ్య నిర్వహణ,కూరగాయలు వాడి పోయి ఉన్నాయని,అస్తవ్యస్తంగా హాస్టల్ గదులు,చెత్తాచెదారం ఎక్కడికక్కడే తిష్ట వేసిందని, టాయిలెట్స్ నుండి దుర్వాసన వెదజల్లుతోందని, పాఠశాల పరిసర ప్రాంతాలు చుట్టూ పిచ్చి మొక్కలు ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.దీనివల్ల విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలి,ప్రమాదాల బారిన పాడే అవకాశం ఉందని, సమస్యల పట్ల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని బిజెపి నేతలు పేర్కొన్నారు.విద్యార్థులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పతమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని గురుకులాల్లో చేర్పిస్తే విద్యార్థులు సౌకర్యాలతో, విద్యార్థుల బాగోగులు ఎప్పటి కప్పుడు పరిశిలించుటకు అధికారులు వారం వారం ఆకస్మిక తనిఖీలు చెయ్యాలని అన్నారు.వీరి వెంట బిజెపి ప్రధాన కార్యదర్శి కాళీ చరణ్, ఉపాధ్యక్షులు ఇటికల రాజు, మహేందర్, అలాగే నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయంలో సాంప్రదాయాలకు వ్యతిరేకంగా వ్యవహరించవద్దు..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జనంసాక్షి).** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.ఆలయ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా చేయవద్దని మంగళవారం ఆల ఈవోకు భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీ అధికంగా ఉందనే నెపంతో శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించే ఒడిబియ్యంను అమ్మవారి ముందర కాకుండా బయట ఒడిబియ్యం సమర్పించాలని దేవాలయ అధికారులు నిర్ణయం సరయినది కాదన్నారు. వందల సంవత్సరాల నుండి వస్తున్న సాంప్రదాయాలను పక్కకు పెట్టడంను మేము వ్యతిరేకిస్తున్నమని,ఈ విషయంపై ఆలయ ఈవోతో మాట్లాడడం జరిగిందని, గతంలో లాగా భక్తులు ఓడిబియ్యం అమ్మవారి ముందు పోసేందుకు సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట భాజపా పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, పిన్నింటి హనుమాన్లు , ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇప్పలపల్లి గురుకుల పాఠశాలలో ఏసీబీ ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**రాజన్నసిరిసిల్ల బ్యూరో. ఆగస్టు 13 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం ఉదయం ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పాఠశాల రికార్డులతో పాటు వంట గదులు ఫుడ్ ఐటమ్స్ తనకి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీలలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఉన్నత అధికారులు ఆదేశం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. గతంలోనూ గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు, ఫుడ్ మెనూ సరిగ్గా పాటించడం లేదనే ఆరోపణ రావడం గమనార్హం.

## ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని డీజీఎంకు వినతి



**యైటీంక్లయిన్ కాలని ఆగస్టు 13 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలో డి–గ్రేడ్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని డీజీఎం (ప) జీ. రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం జీఎం కార్యాలయంలో డీజీఎంని కలిసి 2021 సం.రం నుండి పెండింగులో వున్న డి–గ్రేడ్ ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డి–గ్రేడ్ ఆపరేటర్స్ కోరారు. 2017 నోటిఫికేషన్ ద్వారా ఆపరేటర్లగా ఉద్యోగం పొందిన డి–గ్రేడ్ నుండి సీ–గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. మాతోపాటు సంస్థలో వివిధ డివిజన్‌లలో పని చేస్తున్న ఆపరేటర్లు సీ–గ్రేడ్ ప్రమోషన్ పొంది వారు ఇప్పుడు డి–గ్రేడ్ ప్రమోషన్ పొందేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు. దీనిని దృష్టిలో వుంచుకుని ఆర్జీ–2 యాజమాన్యం తమ ప్రమోషన్ల వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్. మల్లేష్, ఎ. సత్యనారాయణ, టీ. కిరణ్ కుమార్, డి. శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, క్రాంతి, మల్లేష్, శ్రీనివాస్, సాగర్,కిరణ్ కుమార్, సదానందం, జంపన్న, బి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- **నూతన ఇసుక రీచ్ ఆప్రోచ్ రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**
- **సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు..**



**సుల్తానాబాద్,ఆగస్టు 13(జనంసాక్షి) :** మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలంలో విస్తృతం గా పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, నూతన ఇసుక రీచ్, తహసిల్దార్ కార్యా లయాన్ని సందర్శించారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్లా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాల పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం రెగ్యులర్ గా శుభ్రం చేయాలని అన్నారు.గట్టేపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ సూచించారు.సుల్తానాబాద్ పర్యటన సందర్భంగా అవెన్యూ ప్లాంటేషన్ ను కలెక్టర్ పరిశీలించారు. నీరుకుల, గట్టెపల్లి గ్రామాలలో నూతన రోడ్లకు ఇరువైపులా ఎత్తైన మొక్కలతో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు.సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల, గట్టెపల్లి గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయబోయే ఇసుక రీచ్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇసుక రీచ్ లకు అవసరమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సుల్తానాబాద్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పెండింగ్ జరిగిన దరఖాస్తుల వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట సుల్తానాబాద్ తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సచిన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జనంసాక్షి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. మైదానాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. జెండా ఏర్పాట్లు, మైదానం సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. శకటాలు తిరిగే ప్రదేశమును, స్టాళ్ల ప్రదర్శన ఏర్పాటు చేసే స్థలాలను చూశారు. వేదిక, సభకు హాజరయ్యే వారు కూర్చోవడానికి సిట్టింగ్ ఏర్పాట్లు పగడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించాలన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయడానికి నేటి లోపు ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డి.ఎస్.పి నాగేశ్వరరావు, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన పారదర్శకమైన వైద్య సేవలు అందించాలి

**●కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**●పీఎస్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**





**రాజన్నసిరిసిల్లబ్యూరో ఆగస్టు 13 (జనంసాక్షి):** వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన పారదర్శకమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సిరిసిల్ల పట్టణం పీఎస్ నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా చేశారు. ఔట్ పేషెంట్ రిజిష్టర్, ల్యాబ్, ఫార్మసీ, ఇన్ పేషెంట్ బెడ్స్, తదితర వాటిని పరిశీలించారు. పతీరోజూ ఎంత మంది రోగులు ఆరోగ్య కేంద్రానికి వస్తారు..? ఎలా వైద్యం అందిస్తారు..? ఎన్ని శాంపిల్స్ ను టీ హబ్ కు పంపిస్తారు అనే వివరాలను సంబంధిత మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు.వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని, వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. డెంగ్యూ కేసులపై కలెక్టర్ ఆరా తీశారు. ఎన్ని కేసులు రిజిష్టర్ అయ్యాయి.. ఎంత మంది మెరుగయ్యారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఏఎన్ఎం లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని కోరారు. క్రమం తప్పకుండా ఏఎన్సీ చెకప్ లు చేయాలని ఆదేశించారు. తనిఖీలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, సిబ్బంది ఉన్నారు.



## కలుషిత నీరు కలవకుండా శాశ్వత పరిష్కార మార్గం చూడండి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం**

**సుల్తానాబాద్,ఆగస్టు 13(జనంసాక్షి) :** ప్రజలకు అందిస్తున్న త్రాగు నీటిలో కలుషిత నీరు కలుస్తోందన్న ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంచినీటి భావిని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమాలతో కలిసి పరిశీలించారు. గత కొన్ని రోజులుగా మురుకు నీరు రావడంతో సుల్తానాబాద్ ప్రజలకు త్రాగటానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఇట్టి విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి పలువురు తీసుకు వెళ్లడంతో స్వయంగా జిల్లా కలెక్టర్ మంచినీటి బావి సందర్శించి కలుషిత నీరు బావిలో కలవకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష ఆదేశించారు. ఈ సందర్భంగా గాజుల లక్ష్మి రాజమల్లు మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని సరఫరా చేయడం కోసం పలు చర్యలు చేపట్టునున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా త్రాగునీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

## పేదల ఇళ్లు కూల్చడం బాధాకరం..

**● సీపీఎం పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ..**



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం కార్పొరేషన్ పేదల ఇళ్లను కూల్చడం బాధాకరమని పలువురు వాపోయారు. మంగళ వారం తెల్లవారుజామున గోదావరిఖని గంగానగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్మించిన ఇళ్లను కార్పొరేషన్ సిబ్బంది కూల్చివేయడం అత్యంత హేయమైన చర్యగా పలువురు భావించారు. సీపీఎం పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ గత రెండు సంవత్సరాల క్రితం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ పోరాటంలో భాగంగా గోదావరిఖనిలోని గంగానగర్లో 350 మంది ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు.ఎస్‌టీపీ నిర్మాణం కోసం రూ.100 కోట్లతో మంజూరు అయ్యాయని, ఆ ప్లాంట్లను గంగానగర్‌లోనే నిర్మించాల్సి ఉందన్న సాకుతో రామగుండం కార్పొరేషన్ అధికారులు కూల్చివేదయం దారుణమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.పేదల ఇండ్లు తొలగించడం బాధాకరం. అదే సందర్భంలో మునిసిపల్ అధికారులు వారికి కావలసిన ప్లాంట్ నిర్మాణానికి అవసరమయ్యే స్థల సేకరణ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. వారు చేసిన సర్వేలో పేదలు వేసుకున్న 140 ఇండ్లు ఉన్నాయి వాటిని తొలగించాలని ఎమ్మెల్యే కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ సిపిఎం పార్టీ నాయకత్వానికి చెప్పడం జరిగింది. వెంటనే కలెక్టర్ చొరవ తీసుకొని మునిసిపల్ కమిషనర్‌తో సిపిఎం పార్టీ నాయకత్వాన్ని చర్చలకు పిలిచారు. ఈ చర్చలు ఏసీపీ ఆఫీసులో పలు దఫాలుగా ఆగస్టు 12వ తేదీన జరిగాయన్నారు. అదే సందర్భంలో ఇండ్లు కోల్పోతున్న 140 మంది కుటుంబాలను ఆదుకోవాలని, దీంతో పాటు వారికి పక్కనే స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని, మట్టి పోయించాలని, రోడ్లు, కరెంటు,మంచినీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా ఇంటి నెంబర్లు ఇప్పించా లని, ఇంటి పట్టాలు ఇప్పించాలని కోరడం జరిగింది. దీంతో అమెరికాలో ఉన్న ఎమ్మెల్యే మక్కాన్సింగ్ సాను కూలంగా స్పందించి తప్పకుండా ఇండ్లు కోల్పోతున్న వారందరికీ న్యాయం చేస్తానని, అక్కడే ఉన్న ఖాళీ స్థలం వారికి కేటాయించి ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా సహకరిస్తామని, ఇందిరమ్మ ఇంటి పథకం అమలు చేయిస్తామని మొదటి ప్రాధాన్యత వీరికే ఇస్తామని ఫోన్ ద్వారా తెలిపి తన ప్రతినిధులుగా చర్చలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజును పంపించడం జరిగింది.ఈ విషయాన్ని గంగానగర్లో ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న వారందరితో నిన్న రాత్రి జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఏసిపి డిసిపి మహంకాళి స్వామి దీటి బాలరాజు ఎస్ బి ఏ సి పి తదితరులు వచ్చి సిపిఎం పార్టీ పెట్టిన డిమాండ్లను అంగీకరించడం జరిగింది. దీంతో మున్సిపల్ వారు ఇండ్లు తొలగించడానికి ఇండ్ల కోల్పోతున్నవారు స్వచ్ఛందంగా మున్సిపల్ అధికారులకు సహకరించారు.

# పారాలింపిక్స్ ముందు భారత్‌కు షాక్

## స్వర్ణ పతక విజేతపై 18 నెలల నిషేధం!




2024 పారిస్ పారాలింపిక్స్‌కు ముందు భారత్‌కు భారీ షాక్ తగిలింది. టోక్యో పారా ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రమోద్ భగత్‌పై సస్పెన్షన్ వేటు పడింది. డోపింగ్ నిరోధక నిబంధనలను ఉల్లంఘించినందుకు 18 నెలల పాటు సస్పెన్షన్ విధిస్తున్నట్లు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది. దీంతో 2024 పారిస్ పారాలింపిక్స్‌కు ప్రమోద్ దూరం కానున్నాడు. టోక్యో పారాలింపిక్స్ పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 కేటగిరీలో ప్రమోద్ గోల్డ్ మెడల్ గెలిచాడు. 'బ్యాడ్మింటన్ ప్లేయర్ ప్రమోద్ భగత్‌ను 12 నెలల వ్యవధిలో మూడుసార్లు డోపింగ్ పరీక్షకు హాజరు కావాలని కోరాం. ఒక్కసారి కూడా అతడు హాజరు కాలేదు. తాను రాలేకపోవడానికి గల కారణాలను వెల్లడించడంలో విఫలమయ్యాడు. నిబంధనలు ఉల్లంఘించినందుకు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ (కాస్) డోపింగ్ నిరోధక విభాగం ఈ ఏడాది మార్చి 1 ప్రమోద్‌ను స్పెండ్ చేసింది. తన సస్పెన్షన్ ఎత్తివేయాలని కాస్‌ను ప్రమోద్ కోరాడు. దానిని 29 జూలై 2024న కాస్ కొట్టివేసింది' అని బీడబ్ల్యూఎఫ్ ఓ ప్రకటనలో పేర్కొంది.

# ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలి



పారిస్ ఒలింపిక్స్ 2024లో దేశ పతాకధారిగా నిలవడం గర్వించదగ్గ విషయమని పిస్టల్ షూటర్ మను భాకర్ అన్నారు. పారిస్‌లో రెండు పతకాలు సాధించిన భారత పిస్టల్ షూటర్ మను భాకర్ ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలపై కన్నేసింది. పతకాలు సాధించేందుకు తాను ఎంతో కష్టపడ్డానని చెప్పారు. భవిష్యత్తులో తాను ఒకే ఒలింపిక్స్‌లో రెండు కంటే ఎక్కువ పతకాలు సాధించగలిగితే అది గొప్ప అని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే.. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన చూపించగలం.. తద్వారా భవిష్యత్తులో భారత్‌కు మరిన్ని ఒలింపిక్ పతకాలు సాధించాలని కోరుకుంటున్నానని మను భాకర్ చెప్పారు. 22 ఏళ్ల మను ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచింది. ఆమె మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లలో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్య పతకాలను సాధించింది. ఆమె 25 మీటర్ల పిస్టల్‌లో స్వల్ప తేడాతో కాంస్యం గెలుచుకోలేకపోయింది. కాగా.. పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలో వెటరన్ హాకీ గోల్ కీపర్ పిఆర్ శ్రీజేష్‌తో కలిసి మను భారతదేశ పతాకధారిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మను భాకర్ మాట్లాడుతూ.. "ఇది జీవితంలో ఒకసారి జరిగే అనుభవం" అని చెప్పింది. దీనిని తాను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపింది. శ్రీజేష్ భయ్యాతో తనకు చాలా మంచి అనుబంధం ఉందని.. ఆయన తనకు చిన్నప్పటి నుంచి తెలుసని చెప్పారు.. అతను చాలా స్నేహపూర్వకంగా, సహాయకారిగా.. మర్యాదగా ఉంటాడని పేర్కొంది. అలాగే పారిస్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో శ్రీజేష్ తనకు మంచి సపోర్ట్ అందించాడని చెప్పుకొచ్చింది. ఇదిలా ఉంటే.. మను భాకర్ మూడు నెలల విరామం తీసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో ఆమె అక్టోబర్‌లో జరగనున్న ప్రపంచకప్‌కు దూరంగా ఉంటుంది. ఆమె కోచ్ జస్పాల్ రాణా మాట్లాడుతూ.. ఆమె మూడు నెలల విరామం తీసుకుంటున్నందున అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడే అవకాశం లేదన్నారు. ఆమె చాలా కాలంగా కష్టపడుతోంది కాబట్టి ఇది సాధారణ విరామం అని అన్నారు. కాగా.. అక్టోబర్ 13 నుంచి 18 వరకు ఢిల్లీలో షూటింగ్ ప్రపంచకప్ జరగనుంది. అయితే.. 2026లో జరిగే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంటుందని జస్పాల్ తెలిపారు.

# కోహ్లీ రూ. 30 కోట్లకు పైగా అమ్ముడుపోతాడు

## వేలం నిర్వాహకుడు హ్యూ ఎడ్మిడెస్ కీలక వ్యాఖ్యలు




ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో చాలాసార్లు వేలం నిర్వహించిన ప్రముఖ వేలం నిర్వాహకుడు హ్యూ ఎడ్మిడెస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రపున ఆడుతున్న విరాట్ కోహ్లీ 2025 ఐపీఎల్ వేలంలోకి వస్తే.. అతను ఈజీగా 30 కోట్ల రూపాయలకు పైగా పొందగలడని హ్యూ ఎడ్మిడెస్ చెప్పారు. కాగా.. విరాట్ కోహ్లి తన కెరీర్ ప్రారంభం నుండి ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున ఆడుతున్నాడు. ఆ జట్టు కూడా అతనిని ప్రతీసారి రిటైన్ చేసుకుంటుంది. కాగా.. విరాట్ కోహ్లీ ఇప్పటి వరకు వేలంలో పాల్గొనలేదు. ఐపీఎల్ 2008లో కూడా అతన్ని 19 డ్రాఫ్ట్ నుండి ఆర్సీబీ సొంతం చేసుకుంది. అప్పటి నుండి.. అతను ఆర్సీబీ తరుపునే ఆడుతున్నాడు. ఫ్రాంచైజీ కూడా అతనిని వదిలిపెట్టడం లేదు. అయితే.. 17 సీజన్లలో ఆ జట్టు ఒక్క టైటిల్ కూడా సాధించలేకపోయింది. కానీ ఇప్పటికీ జట్టు విరాట్ కోహ్లీపై నమ్మకం ఉంచుకుంది. ఇప్పటివరకూ ఆర్సీబీ ఇతర ప్లేయర్లను వదిలేసినా.. విరాట్‌ను అస్సలు వదిలిపెట్టలేదు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు కూడా ఆర్సీబీ విరాట్‌ను రిటైన్ చేస్తుంది. క్రిక్‌బ్లాగ్‌కి చెందిన అరవింద్ కృష్ణన్‌తో హ్యూ ఎడ్మిడెస్ మాట్లాడుతూ.. విరాట్ కోహ్లీ వేలంలోకి వస్తే అతను రూ. 30 కోట్లకు పైగా పొందగలడని చెప్పారు. 'విరాట్ కోహ్లీని వేలంలో ఉంచడం అతిపెద్ద గౌరవంగా భావిస్తున్నానని.. ధరను బట్టి చూస్తే రూ. 30 కోట్లకు పైగా పలుకుతాడని భావిస్తున్నాను'. అని అన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు. లీగ్ చరిత్రలో 8000 పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 38.67 స్ట్రైక్ రేట్‌తో 132 పరుగులతో 8004 పరుగులు చేశాడు. టోర్నీ చరిత్రలో విరాట్ 7 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీలు సాధించాడు.

# లెజెండరీ క్రికెటర్‌ది సహజ మరణం కాదు

## అసలు విషయం చెప్పేసిన సతీమణి!



ఇంగ్లండ్ లెజెండరీ క్రికెటర్ గ్రాహం థోర్ప్ ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆగష్టు 5న అనారోగ్య సమస్యలతో థోర్ప్ చనిపోయారని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) పేర్కొంది. అయితే థోర్ప్ అనారోగ్య కారణాలతో మరణించలేదని, ఆత్మహత్య చేసుకున్నారని ఆయన సతీమణి అమండా తాజాగా చెప్పారు. అనారోగ్య సమస్యలు తన కుటుంబానికి ఇబ్బందిగా మారాయని భావించి బలవన్మరణానికి పాల్పడ్డారని వెల్లడించారు. గత శనివారం ఫర్న్‌హామ్ క్రికెట్ క్లబ్, చిప్‌స్టెడ్ క్రికెట్ క్లబ్ మధ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు గ్రాహం థోర్ప్ జ్ఞాపకార్థం ఓ వేడుక నిర్వహించారు. ఈ వేడుకకి థోర్ప్ భార్య అమండా.. కుమార్తెలు కిట్టి, ఎమ్మా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమండా మాట్లాడుతూ%ూ% 'గత రెండేళ్లుగా థోర్ప్ తీవ్ర మానసిక సమస్యలతో బాధపడ్డారు. మే 2022లో ఆత్మహత్యకు ప్రయత్నించారు. దాంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చాలా రోజులు ఉండాల్సి వచ్చింది. తాను ఎంతగానో ప్రేమించే భార్య, కూతుళ్లు ఉన్నప్పటికీ ఆయన కోలుకోలేకపోయారు. తన భార్య, పిల్లలు సుఖంగా ఉండాలని ఆత్మహత్య చేసుకున్నారు. చాలా బాధగా ఉంది' అని చెప్పారు. గ్రాహం థోర్ప్ 1993 నుంచి 2005 మధ్య ఇంగ్లండ్ తరపున 100 టెస్టులు, 82 వన్డేలు ఆడారు. టెస్టుల్లో 6744 రన్స్ చేశారు. ఇందులో 16 సెంచరీలు ఉండగా.. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 200 నాటౌట్. వన్డేల్లో 2380 పరుగులు బాదారు. ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన థోర్ప్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 341 మ్యాచ్‌ల్లో 21937 పరుగులు చేశారు. సర్రేతో ఆయన 17 ఏళ్ల కెరీర్‌ను కొనసాగించారు.

# భారత్‌కు రాకుండా.. జర్మనీ వెళ్లిన నీరజ్ చోప్రా!




భారత స్టార్ జావెలిన్ త్రోయర్, గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్ 2024లో రజత పతకం సాధించిన విషయం తెలిసిందే. పారిస్ ఒలింపిక్స్ పోటీలు ఆదివారం ముగియగా.. నీరజ్ స్వదేశానికి రాకుండా జర్మనీకి వెళ్లాడు. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ అసోసియేషన్ వర్గాలు ధ్రువీకరించాయి. నీరజ్ జర్మనీకి వెళ్లాడని.. కనీసం మరో 45 రోజుల వరకు భారత్‌కు తిరిగి వచ్చే అవకాశం లేదని అతని కుటుంబీకులు ఒకరు తెలిపారు. తన గాయానికి శస్త్రచికిత్సకు సంబంధించి వైద్య సలహా తీసుకోవడానికి, డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనాలా? వద్దా? అని నిర్ణయించుకోవడానికి జర్మనీ వెళ్లినట్లు తెలుస్తోంది. 'నీరజ్ చోప్రా పారిస్ నుంచి జర్మనీ వెళ్లాడు. మరో 45 రోజుల వరకు అతడు భారత్‌కు వచ్చే అవకాశం లేదు. నాకు పూర్తి వివరాలు వివరాలు తెలియదు గానీ.. వైద్యుడిని సంప్రదించడానికి అక్కడికి వెళ్లాడు. నీరజ్ కండిషన్‌ను బట్టి డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనాలా? వద్దా అనేది కోచ్, ఫిజియో నిర్ణయిస్తారు' అని జావెలిన్ త్రోయర్ నీరజ్ కుటుంబీకులు ఒకరు తెలిపారు. గతంలో కూడా గాయం గురించి జర్మనీలోని వైద్యుడిని నీరజ్ సంప్రదించాడు. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కొన్నిరోజులు అక్కడి సార్‌బ్రూకెన్‌లో శిక్షణ పొందాడు. డైమండ్ లీగ్ ఫైనల్ సెప్టెంబర్ 14న బెల్జియంలోని బ్రసెల్స్‌లో జరగనుంది.



# 20 బంతుల్లో 5 వికెట్లు

ఇంగ్లండ్‌లో జరిగిన హండ్రెడ్ లీగ్‌లో న్యూజిలాండ్ పేసర్ టిమ్ సౌథీ మెరుపు దాడితో అందరి దృష్టిని ఆకర్షించాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బర్మింగ్‌హామ్ ఫీనిక్స్, ట్రెంట్ రాకెట్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ట్రెంట్ రాకెట్స్ జట్టు టిమ్ సౌథీ ధాటికి తడబడింది. డేంజరస్ బౌలింగ్‌తో దాడి చేసిన టిమ్ సౌథీ కేవలం 20 బంతుల్లో 13 డాట్ బాల్స్ వేశాడు. 12 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు కూడా తీశాడు. సౌథీ గట్టి ధాటికి ట్రెంట్ రాకెట్స్ జట్టు 100 బంతుల్లో 118 పరుగులు చేసింది. 119 పరుగుల సులువైన లక్ష్యంతో బరిలోకి దిగిన బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ తరపున ఓపెనర్ బెన్ డకెట్ 30 పరుగులు చేయగా, లియామ్ లివింగ్‌స్టోన్ 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. జాకబ్ బెతెల్ 93 బంతుల్లో అజేయంగా 38 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో బర్మింగ్‌హామ్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఓటమితో ట్రెంట్ రాకెట్స్ జట్టు హండ్రెడ్ లీగ్ నుంచి నిష్క్రమించింది. ఇప్పటి వరకు ట్రెంట్ రాకెట్ 7 మ్యాచ్‌లు ఆడగా 3 మ్యాచ్‌లు గెలిచి 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. దీని ద్వారా, 2024 హండ్రెడ్ లీగ్ నాకౌట్ దశకు చేరుకోవడంలో విఫలమైంది.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



**ఖమ్మం, ఆగస్టు 13, (జనంసాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కారించుకొని ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో చేపట్టనున్న ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం పెరేడ్ గ్రౌండ్ సందర్శించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందిగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్ తదితర అంశలపై అధికారులతో చర్చించారు. జెండా ఆవిష్కరణ,ముఖ్య అతిథి ప్రసంగం, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, ఆనంతరం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు అందించే ప్రసంసాపత్రాల ప్రదానం లను అధికారులు పర్యవేక్షణ చేయాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ. నరేష్ కుమార్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, ఏసీపీ సి. సుశీల్ సింగ్, డిఆర్డీవో విద్యాచందన, డిఇఒ సోమశేఖరశర్మ, ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, ఎస్బీ ఏసీపీ ప్రసన్న కుమార్, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, ఆర్ఎంఓ రాజశేఖర్ అర్బన్ తాసిల్దార్ సిహెచ్ స్వామి, ఆర్ఐ కామరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు..!

## బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయింపు





### మొదటి దశలో ప్రధాన ఆలయ విస్తరణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జనంసాక్షి).**

రాజ రాజ నరేంద్రుడు, చాలక్యుల కాలంలో నిర్మించిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి త్వరలోనే అడుగులు పడనున్నాయి. ఆనాడు వారు నిర్మించిన ఆలయాన్ని 1970 సంవత్సరంలో ఆధునికరణ చేశారు. ఆనాటి నుండి నేటి వరకు ఆలయ అభివృద్ధిలో భాగంగా రాజ గోపురాలను నిర్మించారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని రాజన్న ఆలయ అభివృద్ధికి ఏట రూ 100 కోట్లు ఇస్తాననే హామీ ఇచ్చినప్పటికి కార్య రూపం దాల్చలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి మొదటి దఫగా రూ .50 కోట్ల నిధులను వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయించారు. ఆది శ్రీనివాస్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రెండుసార్లు ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ప్రాంత వాసి కావడం ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్లో రూ. 50 కోట్లు కేటాయించడంతో ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయనే విశ్వాసం ప్రజల్లో నెలకొంది. రూ 50 కోట్లు మంజూరు కాగానే అట్టి నిధులు ప్రధాన ఆలయం అభివృద్ధి చేసేందుకే వాడాలన్న సంకల్పంతో ఇటీవల కాలంలో ఆలయ స్థపతి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి ఆలయ నమూనాను తయారు చేయాలని, దీన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అక్కడి నుండి శృంగేరి పీఠాధిపతుల అనుమతులు తీసుకొని ప్రధాన ఆలయాన్ని మొదటి దఫగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రణాళికలు సిద్ధం చేపిస్తున్నారు.

### 24 గుంటల ఆలయం.. 5 ఎకరాల విస్తరణ

ప్రస్తుతం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయ 24 గుంటల స్థలంలోమాత్రమే ఉండటంతో భక్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న ఆలయంలో ప్రధాన మొక్కుబడి కోడె మొక్కులు. స్థలం ఇరుకుగా ఉండడంతో కోడే మొక్కలు చెల్లించే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతుండగా పలు సందర్భాల్లో కోడెల తొక్కిసలాటలో భక్తులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి. మహాశివరాత్రి, శ్రీరామ నవమితో పాటు పలు పర్వదినాల్లో భక్తులు వేల సంఖ్యలో తరలి వస్తుంటారు. ఆలయం ఇరుకుగా ఉండడం ఇబ్బందులు అవుతున్న క్రమంలో రాజన్న ఆలయ ప్రాంగణాన్ని 5 ఎకరాల విస్తరణలో ఏర్పాటు చేసేందుకు ఆలయ స్తపతి, సంబంధిత ఇంజనీర్ శాఖ అధికారులు నమూనా చిత్రాలను తయారు చేస్తున్నారు. వీటిని ప్రభుత్వ విప్ స్వయంగా శృంగేరి మఠం పీఠాధిపతుల వద్దకు తీసుకెళ్లి అనుమతి తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి దశలో ప్రధాన ఆలయం పనులు చేపట్టనుండటంతో పూర్తిస్థాయిలో ఆలయాన్ని అభివృద్ధికి చేయడానికి సరిపడా మరిన్ని నిధులు వెచ్చిస్తేనే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం సాధ్యమవుతుంది. తద్వారా ఆలయ అభివృద్ధి జరిగి ఇబ్బందులు తోలగనున్నాయి.

# ప్రమాద రహిత రక్షణ మోకులతో శిక్షణ

- కల్లు గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కడం సులభతరం
- జిల్లా ఎక్సైజ్ సూపరింటెంట్ సైదులు, బిసి వెల్ఫేర్ జిల్లా అధికారి పి యాదగిరి



**భువనగిరి ప్రతినిధి ,ఆగస్టు 13 (జనం సాక్షి)**

కల్లుగీత కార్మికులకు తాటి చెట్టు ఎక్కి కల్లు గీయడం సులభతరం కానుంది అని జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ సైదులు, బీసీ సంక్షేమ అధికారి పి యాదగిరి లు పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లాలో ప్రమాద రహిత రక్షణ మోకులను అందించనుంది అన్నారు. కంతమయ్య రక్షణ కవచంతో గౌడలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వృత్తిని కొనసాగించవచ్చు అని తెలిపారు.జిల్లాలోని యాదగిరిపల్లి కాటమయ్య గుడి వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి రక్షణ మోకుల తో శిక్షణ ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా లోని యూనియన్ మొదటగా ఎంపిక కాబడిన కల్లుగీత కార్మికులకు కంటమయ్య రక్షణ కవచం అందజేశారు. సేఫ్టీ మోకులతో తాటి చెట్లను ఎక్కే పద్ధతిని. ప్రమాదాలు నివారించడానికి సేఫ్టీ మోకును ఎలా వాడాలో ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, ఆలేరు మోత్కూర్ భువనగిరి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు దీపిక, రవి చంద్ర రెడ్డి, నరేందర్ స్థానిక సొసైటీ అధ్యక్షులు సీస కృష్ణ గౌడ్, యాదగిరిగుట్ట పట్టణ నాయకులు మచ్చ నరసింహ గౌడ్. సంఘం నాయకులు పరకాల అంజయ్య, బత్తిని బిక్షం, నరసింహ, వెంకటేష్, తోటరాజు, జిల్లాలోని వివిధ మండలాల గీత కార్మికులు, ఎక్సైజ్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

